RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 12-02-2026 గురువారం | సంపుటి : 12 | సంచిక : 348 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

## ప్రతి ఒక్కరూ సైనికుడిలా ముందుకు రావాలి

- దేశానికి సేవ చేసే రంగాలను యువత ఎంచుకోవాలి
- ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి
- దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రజల్లో పెంపొందించడంతో తీరప్రాంత భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో సైకిల్ యాత్ర

5



## కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల ఆకాంక్ష

- బైక్ యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం
- కడప ఉక్కు ఉద్యమం ఇలాంటి ఎన్నో అవరోధాలను అధిగమించింది : రవి శంకర్

5





## వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

### అసెంబ్లీ సభ్యులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

**అమరావతి:** వైసీపీ.. హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మూడు పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైసీపీ నేతలు చేసే విధ్వంస కుట్రలను సమావేశంలో డిప్యూటీ సీఎం లేవనెత్తారు. మన ప్రభుత్వంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మూడు పార్టీల సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పవన్ దిశానిర్దేశం చేశారు.

### సభ్యులు కీలక అంశాలు ప్రస్తావించాలి: మంత్రి పయ్యావుల కేశవ్

ఏపీ అసెంబ్లీలో సభ్యులు ఎంతసేపు మాట్లాడామనే దానికంటే గురించి ఏం మాట్లాడమనేది ముఖ్యమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. దావోస్ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పలువురు పారిశ్రామికవేత్తలను కలిశారని ప్రస్తావించారు. ఆయన కలిసే ప్రతీ సంస్థ గురించి ముందస్తు సమాచారం సేకరించి ముఖ్యమైన అంశాల గురించి మాట్లాడేవారని గుర్తు చేశారు. దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామిక వేత్తలతో జరిగిన భేటీలో ఆ సంస్థకు మన ప్రభుత్వ పరంగా కావాల్సినవి ఏమిటి? మనకు ఉన్న వనరులేమిటనే విషయంపై సూటిగా చెప్పి.. ప్రతి సమావేశాన్ని నిమిషాల వ్యవధిలో చంద్రబాబు ముగించారని ప్రస్తావించారు. తక్కువ సమయంలో ఎక్కువ మంది పారిశ్రామిక వేత్తలను కలిసేందుకు వీలైందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో సభ్యులు కూడా ముఖ్యమంత్రి స్ఫూర్తితో.. తక్కువ సమయంలో కీలక అంశాల గురించి ప్రస్తావించాలని మంత్రి పయ్యావుల కేశవ్ మార్గనిర్దేశం చేశారు.



## గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై హైకోర్టు కీలక ఉత్తర్వులు

**అమరావతి:** ఏపీపీఎస్సీ గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలపై రాష్ట్ర హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూల్యాంకనంలో చోటు చేసుకున్న అక్రమాలను నిగ్గు తేల్చేందుకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ఏర్పాటుకు ధర్మాసనం ఆదేశించింది. అడిషనల్ డీజీ స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రం వెలుపల ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకోవాలని స్పష్టీకరించింది. ఎంపికైన అభ్యర్థుల జవాబు పత్రాలు భద్రంగా ఉన్నాయా? లేదా? వాటిని ఎవరైనా ట్యాంపర్ చేశారా? అనేది ఫోరెన్సిక్ నిపుణులతో పరిశీలించాలని న్యాయస్థానం సూచించింది. విజయవాడలో జరిగిన మూల్యాంకనం సమయంలో ఉపయోగించిన బార్‌కోడ్‌లు, అసలు ఓఎంఆర్ షీట్లలోని వివరాలు ఒకదానికొకటి సరిపోలుతున్నాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు.. దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశమున్నందున వారందరినీ అప్రాధాన్య పోస్టులకు బదిలీ చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. మార్చి 16లోగా నివేదిక సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి అనుబంధ పిటిషన్లను పరిష్కరించిన హైకోర్టు.. ప్రధాన వ్యాజ్యాలపై విచారణను వాయిదా వేసింది.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో పీటీ వారెంట్



**గుంటూరు :** వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో పీటీ వారెంట్ జారీ అయింది. గుంటూరు ప్రిన్సిపల్ సబ్ కోర్టులో సత్తెనపల్లి పోలీసులు పీటీ వారెంట్ వేశారు. సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో అంబటి వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అంబటి నేతృత్వంలో లక్కీ డ్రా పేరుతో లాటరీ టికెట్ల విక్రయాలు జరిగాయి.

### జనసేన నేతలు ఫిర్యాదు

2023లో సంక్రాంతి లక్కీ డ్రా లాటరీ టికెట్లు అమ్మకాలపై సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర రావు సబ్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో అంబటి రాంబాబుపై 2023 జనవరి 16న సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ లక్కీ డ్రా కేసులో తాజాగా పీటీ వారెంట్ జారీ అయింది. మూడు రోజుల క్రితం కూడా అంబటి రాంబాబుకు సంబంధించిన కేసులో పోలీసులు పీటీ వారెంట్ దాఖలు చేశారు. గతేడాది నవంబర్ 12న మెడికల్ కాలేజీల పీపీపీ (PPP) మోడల్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిన అంబటి.. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని వెళ్లారు. ఈ ఘటనపై అప్పట్లోనే పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయంపై కేసు దర్యాప్తు జరుగుతోందని పోలీసులు పీటీ వారెంట్లో ప్రస్తావించారు.

## మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి నెల 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్ పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది.

# అసెంబ్లీలో 'ఆవు కథలు' చెప్పకూడదు..

### మంత్రులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి :** అమరావతి వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలనలో క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై సీఎం స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

#### కేబినెట్ కీలక నిర్ణయాలు: మంత్రులకు సూచన..

కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు.

#### మంత్రులకు సీఎం దిశానిర్దేశం:

**సమయపాలన:** మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

**బాధ్యతాయుత ప్రసంగాలు:** అసెంబ్లీలో 'ఆవు కథలు' చెప్పవద్దని, సమాధానాలు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని మంత్రులకు చెప్పారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు.

**ప్రిపరేషన్:** సబ్జెక్టుపై పూర్తి అవగాహనతో, ప్రిపేరై అసెంబ్లీకి రావాలని సూచించారు.

#### కీలక మార్పులు – నిర్ణయాలు:

**పేర్ల మార్పు:** రాష్ట్రంలోని వార్డులు, సచివాలయాల పేర్లను 'స్వర్ణ వార్డు', 'స్వర్ణ సచివాలయాలు'గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

**అసైన్డ్ భూముల కౌలు:** సోలార్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం అసైన్డ్ భూములను కౌలుకు ఇచ్చేందుకు అనుమతినిచ్చారు. దీనికింద ఏడాదికి ఎకరాకు 30 వేల రూపాయల కౌలు, ప్రతి రెండేళ్లకు 5 శాతం పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

**జల జీవన్ మిషన్:** ఏపీకి రావాల్సిన 12 వేల కోట్ల రూపాయల నిధులను విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించిందని, ఈ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు.

#### అమరావతికి మహర్దశ:

కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీలను అమరావతిలోనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి కేంద్రానికి చేసిన సూచనలకు సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**శ్రీశైలం ఘటనపై చర్చ:** శ్రీశైలంలో భక్తుల రద్దీ సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై సీఎం చర్చించారు. వృద్ధులను క్యూ లైన్ల నుంచి బయటకు తెచ్చే సమయంలో భక్తులకు తప్పుడు సంకేతాలు వెళ్లకుండా, మైక్ ద్వారా ముందే అనౌన్స్ చేసి వివరించి ఉండాల్సిందని సీఎం అన్నారు.

# దేవుడంటే విశ్వాసం లేదు.. జగన్ అండ్ కో పై సీఎం చంద్రబాబు ధ్వజం

**అమరావతి:** వైసీపీ అధినేత జగన్‌పై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క తిరుపతిలోనే కాదని.. అన్ని దేవాలయాల్లోనూ జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అన్ని మతాలను గౌరవిస్తుందని స్పష్టం చేశారు. అన్ని మతాల సెంటిమెంట్లు ముఖ్యమన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు. వైసీపీ హయాంలో రామతీర్థంలో రాముడి తల నరికారని ఆగ్రహించారు.

#### అసెంబ్లీకి అందరూ రావాల్సిందే..

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమైన



విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎన్డీఏ శాసనసభ పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అసెంబ్లీ సమావేశాలకు ప్రతి ఒక్కరూ ఉదయం 9:00 గంటలకు అందరూ హాజరు కావాల్సిందే. ఉదయం 9:00 గంటల నుంచి 10:00 గంటల వరకే ప్రశ్నోత్తరాలు ఉంటాయి. నేను ప్రతి ఒక్కటీ గమనిస్తూనే ఉన్నా.. కూటమి పక్షాల అధినేతలుగా ఉన్న మా మధ్య ఎలాంటి విభేదాలూ లేవు. మేమంతా ఐక్యతగా ఉన్నాం. అభివృద్దే మా లక్ష్యం. 40 మంది టీడీపీ ఎమ్మెల్యేలను పిలిపించుకుని వారితో మాట్లాడి, వారి పనితీరును సమీక్షిస్తాం. మేం పరిష్కరించాల్సిన సమస్యలు ఏమైనా ఉంటే చెప్పండి' అని చెప్పారు.

#### ప్రజలకు జవాబుదారీగా ఉండాలి..

టీడీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు నోరుజారి మాటాడవద్దు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. 'మనం 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ప్రతి రోజు అందరూ అసెంబ్లీ కు రావాల్సిందే. గవర్నర్ ప్రసంగం నేను రెండున్నర గంటలు స్టడీ చేశాను. ఇప్పటివరకు మనం చేసిన అభివృద్ధి పనుల గురించి చర్చించాల్సిన అవసరముంది. జాతీయ రహదారులు మన రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల పనులు జరుగుతున్నాయి. రైల్వేకు సంబంధించి రూ.90 వేల కోట్ల పనులు సాగుతున్నాయి. మీ నియోజకవర్గాలకు సంబంధించిన పనులేమైనా ఉంటే నా దృష్టికి తీసుకురండి. కేంద్ర ప్రభుత్వం.. మన రాష్ట్రం పట్ల చాలా పాజిటివ్‌గా ఉంది. విశాఖ స్టీల్ గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.450 కోట్లు నష్టంలో ఉంది. కానీ ఈ ఏడాది ఆ నష్టాన్ని పూరించి రూ.50 కోట్ల లాభంలోకి వచ్చింది' అని అన్నారు.

## జగన్ అవకాశం ఇవ్వకపోతే... సొంతంగా పోటీచేసి నా బలం చూపిస్తా

- దువ్వాడ శ్రీనివాస్



**అమరావతి:** 'వైసీపీ నుంచి జగన్ అవకాశం ఇవ్వకపోతే... సొంతగా పోటీ చేసి నా బలం చూపిస్తా' అంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. శాసనమండలిలో తన వాణి వినిపిస్తానని చెప్పారు. త్వరలోనే జగన్‌ను కలుస్తానని ఆయన పేర్కొన్నారు. టీటీడీ లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతానని దువ్వాడ వ్యాఖ్యానించారు. అలాగే మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్మించాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు.

అంతకముందు.. అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను పిలిచి మాట్లాడారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. ఈ సందర్భంగా జగన్ కాళ్లకు మొక్కారు దువ్వాడ. 'ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్?' అని దువ్వాడను జగన్ పలకరించగా.. ధర్మాన ప్రసాదరావుతో ఉన్న అంశాలపై మాట్లాడాలని తెలిపారు ఎమ్మెల్సీ. దీనిపై 'ఒకసారి కలవమని' చెప్పి వెళ్లిపోయారు జగన్. ఈ భేటీ దువ్వాడ భవిష్యత్తు రాజకీయాలపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. జగన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం, పార్టీలో చేరే అవకాశాలు, సొంతంగా పోటీ చేయడం తదితర అంశాలు చర్చనీయాంశంగా మారాయి.




## ఆత్మకూరు 'పుష్ప'

**ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) :** ఆత్మకూరు నియోజకవర్గంలో పుష్పా సినిమా నడుస్తూనే ఉంది, థియోటర్లలో కాదు ఎర్రచందనం అక్రమ రవాణా చేయడంలో పుష్ప సినిమాను మించి నియోజకవర్గంలో ఎర్రచందనం అక్రమ రవాణా అవుతూనే ఉంది. అయితే అధికారులే ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. నియోజకవర్గ ప్రజలకు ఈ అక్రమ రవాణా సినిమా చూసే అవకాశం లేదు. కొందరు సంబంధిత అధికారులు మాత్రం సినిమా కంటే గొప్పగా మౌనంగా ఈ అక్రమ రవాణా సంఘటనను గొప్పగా చూస్తున్నారు. అందుకు కారణం ఈ అక్రమ రవాణా సూత్రధారి మంత్రి అనుచరుడు కావడమే.

మంత్రి అనుచరులు పుష్ప సినిమాలో లాగా ఒక్కొక్కరూ ఒక్కో పాత్రలో సహజ సంపదను దోచుకుంటుంటే ఆయాశాఖల అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. గత అక్టోబర్ నెలలో సోమశిల పరివాహక ప్రాంతంలో కొందరు స్మగ్లర్లు అటవి సంపదను దారుణంగా దోచుకుంటుంటే రాత్రికి రాత్రి తరలిస్తున్నారన్న వార్తలు నియోజకవర్గమంతా పొక్కాయి. అయితే ఆ వార్తల విషయాన్ని మంత్రి అనుచరవర్గం తొక్కేయడంతో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో అక్రమ రవాణా కొనసాగుతోంది.

గత మూడు రోజుల క్రితం ఉదయగిరి నియోజకవర్గం ఆర్లపడియ సమీపంలోని భైరవానికొండ అటవీ ప్రాంతంలో ఎర్రచందనాన్ని తరలించేందుకు సిద్దంగా ఉంచిన వాహనం, దుంగలతో పాటు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన పాత్రదారి తాళ్లూరు తిరుపతి ఆత్మకూరు నియోజకవర్గం చేజర్ల మండలం నాగులవెలటూరుకు చెందిన వ్యక్తి కావడంతో ఎర్రదొంగలు నియోజకవర్గంలో పద్దారా అని ప్రజలు అనుకునేలా పరిస్థితులు వచ్చాయి.అయితే ఆ తిరుపతి పరపతి మంత్రి ప్రధాన అనుచరుడు సోమశిల ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ కేశవచౌదరి అత్యధిక రేంజ్ లో ఉండడంతో స్మగ్లింగ్ విషయం మొత్తం బయటకు రాకుండా అప్పుడప్పుడు ఒక్కొక్కటి బయటకు వస్తుంది. గతంలో సంక్రాంతి సందర్భంగా గ్రామంలో అధికారుల సమక్షంలోనే కోడి పందెలు కూడా నిర్వహించిన సంగతి తెలిసిందే. మంత్రి అండదండలు నిండుగా ఉన్న సదరు నాయకుడు అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ గత సంవత్సరం రోజులుగా ఎర్రచందనం స్మగ్లింగ్ ను యధేచ్ఛగా చేస్తున్నట్లు తెలియవస్తోంది. తన అనుచరులకు నియోజకవర్గంలో అక్రమ కార్యకలాపాలకు గేట్లెత్తిన సదరు మంత్రి ఇలాకాలో ఇసుక, గ్రావెల్ తో పాటు ఎర్రచందనం కూడా



కలిపి సహజ సంపదను కాస్తా తమ సంపదగా మార్చుకునే దందాను నిత్యం కొనసాగిస్తున్నారనే సంగతి నియోజకవర్గ ప్రజలు తెలుసుకునేలా కొందరు అధికారులు మాట్లాడుకుంటున్నారు. సంబంధిత అటవీశాఖ మాత్యుడు, డిప్యూటి సీయం ఈ విషయమై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో చూడాల్సి ఉంది. ఏదేమైనా జిల్లాలో అటవీ సంపదకు ఆత్మకూరు నియోజకవర్గానికి ప్రత్యేకస్థానం ఉంది. అటవీ సంపదను కాపాడుకోవాల్సిన వాళ్లే అక్రమ సంపాదన కోసం పుష్ప సినిమాలోలా వివిధ ప్రయత్నాలు చేస్తుంటే అడ్డుకునే వారు కరువయ్యారని చెప్పక తప్పడం లేదని సంబంధిత అధికారుల పనితీరు చెప్పకనే చెబుతుంది.

# పేదరికం లేని సమాజమే కూటమి లక్ష్యం

## టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్



**విజయవాడ ఫిబ్రవరి 11 వుదయం న్యూస్ బ్యూరో :-** పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం 19వ డివిజన్ జార్జీపేటకు చెందిన పల్లి మాధవి, 7వ డివిజన్ కు చెందిన ముంద్రు బాబురావు, 22వ డివిజన్ సొరగుడి వెంకటేశ్వరరావు కుటుంబాలకు పి–4 మార్గదర్శకాలలో భాగంగా విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ నేతృత్వంలో ప్రతి నెల కుటుంబ పోషణకు అవసరమైన నిత్యావసర సరుకులతో పాటు వెయ్యి రూపాయల నగదును గద్దె క్రాంతి కుమార్ అందజేశారు. ఈ ఈ సహాయాన్ని లబ్బీపేట 19 డివిజన్ కార్యాలయంలో టీడీపీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ, పేద కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రత్యక్షంగా సహాయం అందించే దిశగా తమ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. అనంతరం డివిజన్ అధ్యక్షుడు భాగం సాయి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వారికి అండగా నిలబడడంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ముందుంటారని, ఆయన అడుగుజాడల్లో తాము పని చేయడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీను, పరిశపోగు విజయ్, డి.కోటి, శేఖర్, గఫూర్, జహీర్, హర్షిత్ మిత్రబృందం పాల్గొన్నారు.

# నిత్యపూజ స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాధ్



**కడప, ఫిబ్రవరి 11, (వుదయం జిల్లా బ్యూరో)** మహాశివరాత్రి పర్వదిన నేపథ్యంలో సిద్దవటం పోలీస్ స్టేషన్ పరిధిలోని నిత్యపూజా కోనలోని నిత్యపూజ స్వామి ఆలయాన్ని బుధవారం జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాధ్ సందర్శించారు. మహాశివరాత్రి నాడు పెద్దఎత్తున భక్తులు తరలి రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. మహిళలు, వృద్దులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఒంటిమిట్ట సి.ఐ నరసింహరాజు ను ఆదేశించారు. వాహనాల పార్కింగ్ కు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్.పి వెంట రాజంపేట ఎ.ఎస్.పి మనోజ్ రామనాథ్ హెగ్డే, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ లు యు.సదాశివయ్య, ఈదురు బాషా, ఒంటిమిట్ట సి.ఐ నరసింహ రాజు, నందలూరు ఎస్.ఐ మల్లిఖార్జున రెడ్డి, సిద్దవటం ఎస్.ఐ పి.హారిక ఉన్నారు.

# కడపలో ప్రజాస్వామ్యం పడకేసింది

- పూర్తి న్యాయం జరిగేంతవరకు బాధిత కుటుంబానికి అండగా వైసీపీ
- ఇంటి కూల్చివేత దీక్ష శిబిరంలో వైసీపీ అన్నమయ్య జిల్లా పరిశీలకులు, మాజీ మేయర్ కె.సురేష్ బాబు



**కడప, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** కడప నగరంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా లేక హిట్లర్ పాలన సాగుతుందా అన్న అనుమానాలున్నాయని వైసీపీ అన్నమయ్య జిల్లా పరిశీలకులు సురేష్ బాబు విమర్శించారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలోని కందిపాళెంలో మాజీ సైనికుడు సట్టి నరసింహులు కుమారుల ఇంటిని అక్రమంగా కూల్చిన ఘటనను నిరసిస్తూ అఖిలపక్షం అధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరం బుధవారం 5వ రోజుకు చేరింది. శిబిరాన్ని సందర్శించిన సురేష్ బాబు సంఘీభావం తెలిపారు. సురాజ్యాంగం రచించిన రోజైన గణతంత్ర దినోత్సవ రోజు ఆర్ధరాత్రి ఓ మాజీ సైనికుడి ఇంటిని కూల్చడం దారుణమన్నారు. ఈ పరిస్థితిని చూస్తుంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక హిట్లర్ పాలనలో ఉన్నామా అన్న అనుమానాలు కలుగుతుందన్నారు. కలెక్టరేట్ కు కూత వేత దూరంలో ఈ ఘటన జరగడం, ఘటన జరిగిన నాటి నుంచి అఖిలపక్షం ఆందోళనలు, రిలేదీక్షలు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని, న్యాయం చెయ్యాలని అడిగిన వారిపైనే కేసులు నమోదు చెయ్యడం దారుణమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైసీపీ అండగా ఉంటుందని, తప్పక న్యాయం జరిగే వరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సిపిఐ నగర కార్యదర్శి వెంకటశివ, కార్పోరేటర్లు త్యాగరాజు,కె. బాబు, సుబ్బరాయుడు, గుంటి నాగేంద్ర, దేవి రెడ్డి ఆదిత్య, ప్రజా సంఘాల నాయకులు వినోద్ కుమార్, డాక్టర్ పెంచలయ్య, పల్లంకొండ సంపత్, కంచుపాటి బాబు, కుమార్, శ్రీరాములు, మహిళా సమాఖ్య భాగ్యలక్ష్మి , ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్ర , శివ తేజ, నారాయణ తదితర నాయకులు పుర ప్రముఖులు సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. ఐదో రోజు దీక్షలో సట్టి వనజ,సట్టి నితీష్ కుమార్, కిషోర్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ శర్మలు కు సాయంత్రం ఐదు గంటలకు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు.

# మెడికవర్ హాస్పిటల్‌లో క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక చికిత్స

- డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా క్యాన్సర్‌కు ఉచిత వైద్యం
- ప్రముఖ సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగ రామన్‌కు పూల మొక్క అందించిన డా. విజయ్ నాగేంద్ర



**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** క్యాన్సర్ వ్యాధికి నెల్లూరులోని మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ లో అత్యాధునిక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగ రామన్ అన్నారు. మంగళవారం ప్రొద్దుటూరు నగరంలోని హర్ష హాస్పిటల్స్ లో క్యాన్సర్ వ్యాధుల చికిత్స కొరకు కన్సల్టేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా తొలిసారి నగరానికి విచ్చేసిన డాక్టర్ రంగ రామన్ కు హర్ష హాస్పిటల్స్ చైర్మన్, డాక్టర్ కే విజయ్ నాగేంద్ర పూల కుండి అందజేసి స్వాగతం పలికారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారిని డాక్టర్ పరీక్షించి వారికి తగు వైద్య సలహాలు,సూచనలు అందజేశారు.16 మంది క్యాన్సర్ బాధితులు డాక్టర్ ను చికిత్స నిమిత్తం సంప్రదించారు. వారందరిని ఓపిగ్గా పరీక్షించి వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ రంగ రామన్ ప్రతి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు ప్రొద్దటూరు నగరంలోని హర్ష హాస్పిటల్ లో తాను అందుబాటులో ఉంటానని తెలిపారు.క్యాన్సర్ వ్యాధులతో బాధపడుతున్న వారు తనను సంప్రదించి నాణ్యమైన,మెరుగైన వైద్య సేవలను పొందవచ్చని చెప్పారు.రొమ్ములో గడ్డలు, నీరు, రక్తం కారడం,గొంతు కింద గడ్డలు, థైరాయిడ్ గడ్డలు ఉన్నవారికి చికిత్సలు అందిస్తామని తెలిపారు. అలాగే నోటిలో మానని పుండ్లు,కడుపులో గడ్డలు ఉన్నవారికి ఆధునిక చికిత్సలు అందజేస్తామన్నారు.మలంలో రక్తం పడడం,నల్లగా రావడం, అధిక ఋతుస్రావంతో బాధపడుతున్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కొందరిలో మూత్రంలో రక్తం పడడం జరుగుతుందని తెలిపారు. శరీరంలో ఎక్కడైనా మానని పుండ్లు ఉన్నవారు,పచ్చ, తెల్ల కామెర్లతో బాధపడుతున్న వారిని పరీక్షించి తగు వైద్యం అందజేస్తామని తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం,ఈ.హెచ్.ఎస్ పథకం ద్వారా అన్ని రకాల క్యాన్సర్ జబ్బులకు మెడి కవర్ హాస్పిటల్స్ లో ఉచిత వైద్యం అందజేస్తామని వివరించారు. అపాయింట్మెంట్ కొరకు 8008900157, 9640540475. అనే సెల్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో హర్ష హాస్పిటల్స్ పరిపాలన అధికారి కిరణ్ మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం



**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** హకీమ్ అ జ్మల్ ఖాన్ యునాని కి చేసిన సేవలకు గుర్తింపుగా నేడు ఆయన జన్మదినం పురస్కరించుకొని ప్రపంచ యునాని దినం సందర్భంగా నేడు వై ఎం ఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం లో వైద్యధికారి డాక్టర్ నిరంజన్ గారు మాట్లాడుతూ చర్మ రోగాలు, మోకాలు నొప్పులు, బి పి, షుగర్ వంటి దీర్ఘ కాలిక రోగాలకు మందులు ఇచ్చారు. 38మందికి వైద్య పరీక్షలు చేయడమైనది. ఈ కార్యక్రమం లో కాంపౌండర్ శ్రీనివాసులు, సి ఓ ఎం వి సుబ్బారెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ సైనికుడిలా ముందుకు రావాలి

- దేశానికి సేవ చేసే రంగాలను యువత ఎంచుకోవాలి
- ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పిలుపు



**కావలి, ఫిబ్రవరి 11, వుదయం న్యూస్:** భారతదేశానికి మూడు వైపులా సముద్రం ఉండటంతో తీరప్రాంత భద్రతపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరమని, విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సైనికుడిలా ముందుకు రావాలని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కావలి రూరల్ మండలం తుమ్మలపెంటలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఘనంగా జరిగింది. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రజల్లో పెంపొందించడంతో పాటు తీరప్రాంత భద్రతపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈ సైకిల్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు సీఐఎస్ఎఫ్ వంటి సైనిక దళాలు వచ్చి యువతలో అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. దేశ భద్రత కోసం ఎండనక వాననక కష్టపడే భద్రతా సిబ్బందికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేయాలని పేర్కొన్నారు. వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నియంత్రణ, మహిళలు, యువతుల అక్రమ రవాణా, ఉగ్రవాదుల చొరబాటు నియంత్రణ, తదితర అంశాల పై తీరప్రాంత వాసులకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరచడం అభినందనీయమని కొనియాడారు. యువత మిలిటరీ, ఎయిర్ ఫోర్స్, నేవీ, సీఐఎస్ ఎఫ్, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వంటి విభాగాల్లో చేరి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. జీవనోపాధి సాధించడంతో పాటు దేశంపై ప్రేమ కలిగి ఉండే వారే ఇలాంటి సేవా రంగాల్లో రాణించగలరని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి భావన పెంపొందించేందుకు స్థానిక కళాశాలలు, పాఠశాలలు తీసుకున్న ముందడుగును ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడమే ఈ సైక్లోతాన్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గత ఏడాది కూడా కావలి ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించారని గుర్తు చేస్తూ, ప్రతి సంవత్సరం ఈ ప్రాంతంలో నిర్వహించాలని సీఐఎస్ఎఫ్ అధికారులను కోరారు. వచ్చే ఏడాది మరింత పెద్ద స్థాయిలో, పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దేశవ్యాప్తంగా వెస్ట్ బెంగాల్ నుంచి గుజరాత్, కొచ్చిన్ తదితర ప్రాంతాలను కలుపుతూ దాదాపు 6533 కిలోమీటర్ల సుదీర్ఘ సైకిల్ యాత్ర చేపట్టడం గొప్ప విషయమని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో కావలి రూరల్ మండల అధ్యక్షులు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, పాలడుగు రంగారావు, పద్మావతి శ్రీదేవి, జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు, విద్యార్థులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ నిబంధనలు, ఆరోగ్య భద్రతపై అవగాహన ర్యాలీ

**కడప, ఫిబ్రవరి 11, (వుదయం జిల్లా బ్యూరో)** స్థానిక సి ఎస్ ఎస్ ఆర్ అండ్ ఎస్ ఆర్ ఆర్ ఎమ్ డిగ్రీ మరియు పిజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రత్యేక శిబిరంలో భాగంగా రెడ్డి కాలనీలో "రోడ్డు భద్రత – జీవన రక్షణ" మరియు బీడీ కాలనీలో ఆరోగ్య అవగాహనపై ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆరవ రోజు "రోడ్డు నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపకూడదని, కారులో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని మరియు మద్యం సేవించి వాహనం నడపకూడదని, ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కళాశాల చైర్మన్ సి.వి. రాజ గోపాల్ రెడ్డి, సిఐ దస్తగిరి, ఎస్సై విద్యాసాగర్ గార్లు పాల్గొన్నారు. సిఐ మాట్లాడుతూ" విద్యార్థులకు మరియు ప్రజలకు ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ ప్రాముఖ్యత, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాలు గురించి అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించ వచ్చని తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ యూనిట్ – 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ వై. నాగశిల్పా దేవి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా ఐదవ రోజు "ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారం, వ్యాయామం ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులు మాట్లాడుతూ, సమయానికి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, పోషకాహారం తీసుకోవడం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని వివరించారు.

## టీడీపీ- యువ నాయకులు సూర్య ఫ్లెక్సీల చించివేత




**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** ప్రశాంతంగా ఉండే ప్రొద్దుటూరు పురపాలక పరిధిలోని మండలంలో వివిధ మున్సిపల్ వార్డుల్లో కొందరు కావాలనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని, సహించేదిలేదని టీడీపీ యువ నాయకులు భూమిరెడ్డి సూర్య ప్రతాప్ రెడ్డి, హెచ్చరించారు. ఇటీవల టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి పట్టణం అంతా ఫ్లెక్సీలు వేసిన టీడీపీ యువ నేత సూర్య కడప జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే తనయుడు కొండారెడ్డి పేరుతో శుభాకాంక్షలు తెలుపుతూ తెలుగుదేశం పార్టీ, నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున చించేశారు.ప్రొద్దుటూరులో కవ్వింపు చర్యలు సరికాదని, ప్రశాంత పట్టణంలో రెచ్చగొట్టే చర్యలు దుష్పరిణామాలకు దారితీస్తా యని, బ్యానర్లను ధ్వంసంచేసినవారిని తక్షణం అరెస్ట్ చేయాలని టిడిపి యువ నాయకులు సూర్య డిమాండ్ చేశారు.

# పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ



**నెల్లూరు (వుదయం ప్రతినిధి) ఫిబ్రవరి 11వ తేదీ** రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం, తన్విక్ష జన్మదిన వేడుకలు పురస్కరించుకుని వారి తల్లిదండ్రులు భరత్ కుమార్, దివ్యశ్రీ ఆర్థిక సహాయముతో రవిచంద్ర గిరిజన కాలనీలోని పిల్లలకు పౌష్టికాహారం స్వీట్లు, బిస్కెట్లు, పండ్లు,కేక్స్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి అనుముల జయప్రకాష్ మాట్లాడుతూ పిల్లలు నడువవలసిన త్రోవను వారికి నేర్పించిన ఎడల వారు పెద్దవారైనను దాని నుండి తొలగిపోరు అనే సూక్తిని తెలియజేస్తూ, తన్విక్ష ఉన్నత చదువులు చదివి ఆమె భవిష్యత్తులో మంచి ఉద్యోగాన్ని పొందాలని సమాజానికి అవసరమైనటువంటి ఒక మంచి వ్యక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తన్విక్ష తల్లి దండ్రులైన భరత్ కుమార్, దివ్యశ్రీలు తమ బిడ్డకు చిన్నతనం నుండే సేవా భావాన్ని నేర్పించి సమాజానికి దిశా, నిర్దేశం అందించే వ్యక్తిగా తమబిడ్డ ఎదగాలని కోరుకోవడం వారి మంచితనానికి నిదర్శనమని, ఇలా ప్రతితల్లి, తండ్రి ఆలోచించి తమబిడ్డలను సమాజ శ్రేయస్సు కొరకు ఉపయోగపడేలా దిద్దితే భవిష్యత్తు తరాలలో మంచి మానవత్వానికి రూప రేఖలుగా ఆబిడ్డలు తయారవుతారని ఆయన అన్నారు. పి.ఎం.పి అసోసియేషన్ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఇటువంటి పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నటువంటి పిల్లలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, రిటైర్డ్ ఏఎస్ఐ మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు సుభహాన్, నారాయణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మర్పణ దివస్

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** అర్బన్ వన్ ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్రరావు ఆధ్వర్యంలో పట్టణ కార్యాలయం నందు ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతకర్త, అంత్యోదయ భావం రూపకర్త, నాటి జనసంఘ్ అధ్యక్షులు, నేటి మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు స్ఫూర్తిప్రదాత, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంబగిరి, ప్రధాన కార్యదర్శి చెన్నా మోహన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఎన్ కుమారి, మల్లికార్జునరావు, భూమి రెడ్డి భాస్కర్ రెడ్డి చలపతిరావు రాగాల రమణయ్య కార్యదర్శి సురేంద్ర, గంగాధర్ రెడ్డి, పరమేశ్వరరావు, అగ్గారపు వెంకటేశ్వర ప్రసాద్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై ..
# కలెక్టర్ సమీక్ష

**తిరుపతి, ఫిబ్రవరి 11, వుదయం ప్రతినిధి:** తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం తుడా సమావేశ మందిరంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ తిరుపతి పరిధిలోని చెరువుల సుందరీకరణ, తుడా టవర్స్, శెట్టిపల్లి అభివృద్ధి, జిల్లాలోని మాస్టర్ ప్లాన్ రోడ్డుల అభివృద్ధి గురించి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుపతి పట్టణం లో గల 20 చెరువుల అభివృద్ధి చేసి సుందరీకరణ చేయాలని అన్నారు. అందులో పేరూరు చెరువు నుండి అవిలాల చెరువు వరకు సమరు 5 కిమీ పైపు లైను వేసి అభివృద్ధి చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలి తెలిపారు. జిల్లా నందు పలు మాస్టర్ ప్లాన్ రోడ్డులను, శెట్టిపల్లి అభివృద్ధి లో భాగంగా మాస్టర్ ప్లాన్ రోడ్డుల అభివృద్ధి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రజలకు అందుబాటులో కి త్వరలో తుడా టవర్స్ నందు మొత్తం 12 అంతస్తులలో నిర్మాణం జరిగిందన్నారు. కమర్షియల్ ప్లాట్లు అందులో 234 ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. 2బీహెచ్‌కె , 3బీహెచ్‌కె,4బీహెచ్‌కెలు ఉన్నాయన్నారు. టవర్స్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటేశ్వర ప్రసాద్,, తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, తుడా ఎస్ ఈ కె. రవీంద్రయ్య, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, ప్లానింగ్ అధికారులు, మరియు తుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రెండవ రోజు రైతుల శిక్షణ కార్యక్రమం

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం జిల్లా బ్యూరో)** ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల, పశుసంవర్ధక ఉత్పత్తి మరియు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో, ఐసీఏఆర్–ఎన్ఆర్సీ సహకారంతో నిర్వహిస్తున్న "గొర్రెల పెంపక రంగంలో నికర ఆదాయం ద్వారా రైతుల ప్రగతి" అనే శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ రైతులు పాల్గొన్నారు. బుధవారం శిక్షణలో భాగంగా రైతులకు గొర్రెలలో కనిపించే పరాన్న జీవుల నిర్మూలన విధానాలు, సాధారణ వ్యాధులు మరియు నివారణ చర్యలు, గొర్రెల శరీర నిర్మాణం, వివిధ శరీర భాగాలు, పశువుల అస్థిపంజరం, అలాగే గొర్రెల అంతర్గత అవయవాలపై హ్యాండ్స్–ఆన్ శిక్షణ అందించారు. ప్రత్యక్ష ప్రదర్శనల ద్వారా రైతులకు ప్రాయోగిక అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పశుసంవర్ధక పథకాలు మరియు వాటిని రైతులు ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమానికి శిక్షణ సమన్వయకర్త విభాగాధిపతి డా. డి. ఇందిరా మార్గదర్శకత్వం వహించారు. అధ్యాపకులు డా. జ్ఞాని చరిత, డా. సాయికృష్ణ, డా. రేవతి, మరియు డా. విజయ్, డా. గాయత్రి పాల్గొని రైతులకు శాస్త్రీయ సూచనలు అందించారు. ఈ శిక్షణ ద్వారా రైతులు గొర్రెల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక నికర ఆదాయం పొందగలరని నిర్వాహకులు తెలిపారు.

# ముమ్మరంగా సిద్దేశ్వరం రోడ్డు మరమ్మతులు

## ఎమ్మెల్యే ఆదేశాలతో నేతలు పనులకు శ్రీకారం



**నెల్లూరు, ఫిబ్రవరి 11, వుదయం న్యూస్:** ప్రముఖ చారిత్రిక పుణ్యక్షేత్రం అయిన సిద్ధేశ్వరం వెళ్ళే రహదారి మార్గాన్ని స్థానిక నేతలు భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా మరమ్మత్తులు చేసే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురం మండలం లోని చారిత్రక ఖ్యాతి వహించిన సిద్దేశ్వరం దేవాలయానికి వెళ్లే రోడ్డు మరమ్మత్తు పనులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు, సీతారాంపురం టిడిపి మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులు అనుచరులైన తెలుగుదేశం పార్టీ నాయకుల పర్యవేక్షణలో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సిద్దేశ్వరం మహాక్షేత్రములో మహాశివరాత్రి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు లక్షలాదిమంది భక్తులు వీచేస్తారని, పరిసర ప్రాంత జిల్లాల ప్రజలే కాక, ఇతర రాష్ట్రాల నుండి కూడా ఈ ప్రాంతానికి భక్తులు విచ్చేసి ప్రవేశిస్తారు. అన్నారు. మాజీ మండల కన్వీనర్ ముత్తంశెట్టి చెన్నకేశవులు, వికాస్ బాబు, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, నరసయ్య, సుబ్బారాయుడు, నరసింహులు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొనీ ఏర్పాట్లు చూస్తున్నారు.

# రూ.33 లక్షల మోసం కేసులో ఐదుగురు అరెస్టు





**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం జిల్లా బ్యూరో)** డబ్బు రెట్టింపు పేరుతో రూ.33 లక్షలు మోసం చేసి, ప్రాణహానితో బెదిరించిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను ప్రొద్దుటూరు II టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో రూ.8 లక్షల 50 వేల నగదు, ఒక బ్రీఫ్‌కేస్ మరియు నేరానికి ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. 07-01-2025 నాడు ఫిర్యాదుదారు అదిమూలం గంగ ప్రసాద్‌ను రూ.50 లక్షలు ఇస్తామని నమ్మించి గోకుల్ నగర్ క్రాస్ వద్ద కలిసిన సమయంలో, కత్తితో బెదిరించి నగదు లాక్కొని నిందితులు పరారైనట్లు పోలీసు లు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దానంబట్టిలు క్రాస్ రోడ్ వద్ద నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠా "రైస్ పుల్లింగ్", "పవర్ కాయిన్స్" వంటి మోసపూరిత పథకాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. డబ్బు రెట్టింపు వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## ఏఐటీయూసీ కడప నగర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

- అధ్యక్షులుగా పగడపూల మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా ఉద్దె మద్దిలేటి



**కడప, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** ఏఐటీయూసీ కడప నగర వర్కింగ్ ప్రెసిడెంట్ గా పిచ్చినేని సుబ్బరాయుడు, ఏఐటీయూసీ కడప నగర సహాయ కార్యదర్శిలుగా నరసింహులు, నారాయణ, ఈశ్వరయ్య, రెడ్డయ్య, రామచంద్రుడు, నాగిరెడ్డి, క్రాంతి, హనుమంతు, ఏఐటీయూసీ కడప నగర ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, పుల్లయ్య, మా భాష, రమణ, హుస్సేన్, నాగిరెడ్డి, సుబ్బరాయుడు, ఏఐటీయూసీ కడప నగర కోశాధికారిగా శ్రీనివాసులుతో పాటు 43 మంది కౌన్సిల్ సభ్యులు 21 మంది ఆఫీస్ బేరర్స్ ని ఏఐటీయూసీ కడప నగర 10 వ నగర మహసభలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ నాగ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు గంటి వేణుగోపాలు, జిల్లా డిప్యూటీ సెక్రటరీ కెసి. భాదుల్లా, తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప నగర అధ్యక్ష కార్యదర్శులు పి.మల్లికార్జున యు. మద్దిలేటి. మాట్లాడుతూ లేబర్ కోడ్ల వల్ల కార్మిక సంఘా లు సుదీర్ఘ పోరాటాల ద్వారా ఎంతగానో కష్టపడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు నిర్వీర్యమవుతు న్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు ఇప్పటివరకు కొంతమేరకు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వచ్చాయని వారు తెలిపారు. అనేక పరిమితులు వున్నప్పటికీ, వేతనాలు, పనిగంటలు, సామాజిక భద్రత, పారిశ్రామిక భద్రత, తనిఖీ, సమిష్టి బేరసారాలు వంటి హక్కులు కొంతవరకు అమల్లో వుండేవని వారు పేర్కొన్నారు.

# కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల ఆకాంక్ష

- బైక్ యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం
- కడప ఉక్కు ఉద్యమం ఇలాంటివి ఎన్నో ఎవరోధాలను అధిగమించింది
- బైక్ యాత్ర తాత్కాలిక వాయిదా.. సీమ అభివృద్ధికి క్రియాశీలక ఉద్యమానికి ప్రణాళిక...
- ఆర్పీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రవిశంకర్ రెడ్డి



**కడప, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ ప్రజల ఆకాంక్ష అని, 18 ఏళ్లుగా నిర్మాణ దశలో ఆగిన కడప బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయాలని శాంతియుతంగా జరుగుతున్న బైక్ జాతను అక్రమ కేసులు బనాయిస్తామని పోలీసులు బెదిరించడం అప్రజాస్వామికం అని ఆర్పిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రవి శంకర్ రెడ్డి, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ అన్నారు. బుధవారం జమ్మలమడుగు లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలను ప్రయివేటుపరం చేయడం ఆపాలని ఆర్ఎస్ఎఫ్ ఈ రోజునుండి మూడు రోజుల పాటు బైక్ యాత్రను చేస్తుంటే పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం కు ఎందుకంత ఉలికిపాటు అని ప్రశ్నించారు. ఇక్కడ చదువుకున్న యువతకు ఉద్యోగాలు కావలి అని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగే హక్కు లేదా? ప్రజాస్వామ్య బద్దంగా, శాంతియుతంగా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం అడగడం తప్పా?? పార్లమెంట్ సాక్షిగా చట్టం చేసిన కడప ఉక్కు నిర్మాణంను పూర్తి చేయాలని అడిగితే అక్రమా కేసులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రం నుండి ఎన్ని రైల్వే ప్రాజెక్ట్ లు వచ్చిన కోస్తా ప్రాంతానికే ప్రాధాన్యత ఇస్తున్నానురు. మెట్రో రైలు అంటూ అభివృద్ధి చెందిన వైజాగ్, విజయవాడ కు 20 వేల కోట్ల రూ. కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పెడుతుంది కూటమి ప్రభుత్వం. ఇక్కడ వెయ్యి కోట్లు ఖర్చు వెనుకబడిన రాయలసీమ ను కాపాడండి అడగడం తప్పా... గుంతకల్లు రైల్వే జోన్ చేయాలని దాని ప్రాధాన్యత గురించి చెప్పిన వినకుండా, వైజాగ్ కు రైల్వే జోన్ చేస్తారు. ఇవేమి పట్టని ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కోస్తా ప్రాంతానికి ఊడిగం చేస్తారు, అక్కడ ఏం అభివృద్ధి జరిగిన ఇక్కడ భజన చేయడానికే వున్నారని, ఈ ప్రాంత వెనుక్కుబాటు తానం పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు వేసిన వెనకడుగు వేసేది లేదని, రాజ్యాంగబద్దంగానే కడప ఉక్కు, కడప బెంగళూరు రైల్వే లైన్, పులివెందుల మెడికల్ కళాశాల ప్రయివేటికరణ ఆపాలని కొత్త ప్రణాళికతో ముందుకొస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వంశీ, ఉపాధ్యక్షులు శివ, నాగార్జున, నాయకులు కుమార్ ఆర్పీపీ నాయకులు ప్రసాద్, విజయ్,షరీఫ్, ఆటో యూనియన్ నేత తారా పాల్గొన్నారు.

## రాజకీయ స్వార్థం కోసం
# మనుషుల మధ్య విద్వేషం పెంచుతున్నారు




**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 11, (వుదయం ప్రతినిధి)** రాజకీయ స్వార్థం కోసం మనుషుల మధ్య విద్వేషం పెంచుతున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాలేష సాహెబ్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజిలో "హూ యామ్ ఐ" కార్యక్రమం ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాలేషా మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న ఎనిమిది వందల కోట్ల మంది ఏక కణం నుంచి వచ్చారని, ఈ విషయాన్ని డార్విన్ తన ఆరిజిన్ అఫ్ స్పిసిస్ గ్రంధంలో వివరించారని, కానీ మనం ఇప్పటికీ కులం, మతం పేరుతో విభజన చెంది ఒకరిని ఒకరు ద్వేషించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికీ రాజకీయ దురుద్దేశ్యంతో చింపాంజీ నుంచి, కోతి నుంచి మానవ పరిణామం చెందడాన్ని మేము చూడలేదు కాబట్టి మేము నమ్మమని వితండ వాదం చేస్తున్నపాలకులు ఉన్న తరుణంలో, జీవ పరిణామంను పాఠ్యపుస్తకములు నుంచి తొలగించిన సందర్భంలో దీని అవసరాన్ని, డార్విన్ చెప్పిన సత్యాన్ని ప్రజలకు వివరించేందుకు విద్యార్థులలో అవగాహన కార్యక్రమాలను జేవివిగా చేస్తున్నామని డాక్టర్ కాలేషా అన్నారు. మానవులు హోమో సేపియన్స్ అనే తెగగా ఆఫ్రికాలో ఏర్పడి ఈ భూప్రపంచం అంతా విస్తరించారని, కానీ ఇప్పుడు దేశాల పేరుతో శత్రుత్వం ఏర్పరుచుకొని మనం అంతా ఒక్కటే అనే సత్యాన్ని మరిచిపోతున్నామని అన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి మనిషి రంగులు ఏర్పడతాయని సైన్సు వివరిస్తుంటే మనం చర్మ రంగులను బట్టి మనిషి ఉన్నత్తుడు, కాదు అనే తేడాలను చూపుతున్నామని వివరించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, రాష్ట్ర కమిటి సభ్యులు సునీత, జిల్లా గౌరవ సలహాదారులు గోపినాథ రెడ్డి, జెవివి నాయకులు, రాజేష్, హేమంత్ కుమార్, జి టి ఈశ్వరయ్య, రవిబాబు, వరలక్ష్మి , కాలేజి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## రాహుల్ గాంధీని క్షణంపాటు స్తబ్దుడిని చేసిన జగదంబికా పాల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (వుదయం):** ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం దిగువ సభలో బడ్జెట్‌పై మాట్లాడుతూ, ఇటీవల ప్రకటించిన అమెరికా వాణిజ్య ఒప్పందం, మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరావణే ప్రచురించని పుస్తకంలోని విషయాల నుండి ఎప్‌స్టీన్ ఫైల్స్ వరకు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తన ప్రసంగంలో రాహుల్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వంపై అనేక తీవ్రమైన ప్రకటనలు, ఆరోపణలు చేశారు. అయితే, ఆ సమయంలో సభకు అధ్యక్షత వహిస్తున్న బిజెపి నాయకుడు జగదాంబికా పాల్ ఆయనను ఒక్క క్షణం నోరుమూయించారు. పాల్, రాహుల్ గాంధీ మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన ఒక క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఈ క్లిప్‌లో, బడ్జెట్‌పై మాట్లాడమని రాహుల్ గాంధీకి పాల్ సలహా ఇస్తున్నట్లు వినవచ్చు, దానికి కాంగ్రెస్ నాయకుడు స్పందిస్తూ, "మీరు కాంగ్రెస్ పార్టీ మాజీ సభ్యుడు, కాబట్టి నేను ఈ రోజు మీకు ప్రత్యేక సహాయం చేస్తాను సార్. నేను వెనక్కి తగ్గుతాను." పాల్ జోక్యం చేసుకుంటూ, ఆ వ్యాఖ్యలు రికార్డులో ఉండవు అని స్పష్టం చేశారు "మీకు చైర్ పట్ల ఎలాంటి గౌరవం లేకపోతే... కొన్ని సార్లు మీ ప్రస్తుత సభ్యులు ఈ చైర్‌ను ఆక్రమించేవారు," అని ఆయన కుమారి సెల్జా వైపు చూపిస్తూ ఆమె అభిప్రాయాన్ని కోరారు. రాహుల్ గాంధీ తన మునుపటి వ్యాఖ్యను పునరుద్ఘాటిస్తూ, "మీరు మా పార్టీ మాజీ సభ్యుడు, కాబట్టి నేను ఈ రోజు అంత దూకుడుగా వెళ్లను" అని అన్నారు.

"మీరు దాని గురించి ఎందుకు అంతగా ప్రస్తావిస్తున్నారు?" అంటూ పాల్ వేసిన ప్రశ్నకు మీరు నా పార్టీ సభ్యుడు, సార్... మాకు మీరంటే ఇష్టం అంటూ రాహుల్ జవాబిచ్చారు. ఈ సమయంలో, పాల్ చేసిన వ్యాఖ్యతో రాహుల్ గాంధీకి కొద్దిసేపు నోట మాట రాలేదు. "మీరు నా సలహాను విని ఉంటే, మీరు ప్రతిపక్ష బెంచీలపై కూర్చొని ఉండేవారు కాదు అని ఆయన అన్నారు. మీరు సరైన మార్గంలో వెళ్లాలని నేను మీకు సలహా ఇస్తున్నాను. సరైన మార్గంలో నడిచేందుకు మీకు ఇంకా సమయం ఉంది అని ఆయన పేర్కొన్నారు.

## రాహుల్, రిజిజు మధ్య వాగ్వాదం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (వుదయం):** బుధవారం లోక్‌సభలో భారత్‌వాణిజ్య ఒప్పందం పై ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి, రాహుల్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి లొంగిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అనంతరం, ఆయన సంచలనాత్మక ఆరోపణల పరంపరను కొనసాగించారు. వీటికి ప్రభుత్వం వైపు నుంచి, వెంటనే ఖండనలు, నిరసనలు ఎదురయ్యాయి. సభలో గందరగోళం చెలరేగడంతో, సభాపతి ఆయనకు సభా నియమాలను గుర్తు చేయవలసి వచ్చింది.

ఏదైనా ఒత్తిడి లేదా పరపతి ఉంటే తప్ప ప్రభుత్వం అలాంటి ఒప్పందంపై సంతకం చేస్తుందని నేను నమ్మను. మన రైతులను వారి కర్మానికి వారిని వదిలివేశారు. జౌళి రంగం తుడిచిపెట్టుకుపోయింది. మన ఇంధన భద్రతను అప్పగిస్తున్నారు, అని రాయ్‌బరేలి ఎంపీ అన్నారు.

ఈ ఆరోపణలకు స్పందించిన రిజిజు, ఎటువంటి ఆధారాలు లేకుండా పచ్చి ఆరోపణలు చేస్తున్నప్పుడు మేం రాహుల్ గాంధీని ఇబ్బంది పెట్టడం లేదు. కానీ ఇది ఆమోదయోగ్యం కాదు అని అన్నారు.



ప్రతిపక్ష నాయకుడు చేసిన ఆరోపణలను ధృవీకరించాలని మంత్రి కోరారు. ఇందుకు సభాపతిగా ఉన్న జగదాంబికా పాల్, గాంధీ ఆరోపణలు లోక్‌సభ రికార్డుల్లోకి వెళ్లవని స్పష్టం చేశారు. ట్రెజరీ బెంచ్ డిమాండ్ చేసిన తర్వాత, రాహుల్ గాంధీ తన వ్యాఖ్యను ప్రామాణీకరించాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. అయితే, ప్రతిపక్ష నాయకుడు తన ఆరోపణలకు మద్దతుగా పత్రాలను సమర్పించాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిఅన్నారు.

ప్రభుత్వం డిమాండ్‌కు రాహుల్ గాంధీ స్పందిస్తూ, ప్రామాణీకరించాల్సిన పత్రాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. "నేను పత్రాలను కూడా టేబుల్‌పై ఉంచుతాను" అని ఆయన అన్నారు. రికార్డులను ప్రామాణీకరించడానికి ప్రతిపక్ష నాయకుడు తగిన ప్రక్రియను అనుసరించాలని రిజిజు కూడా అన్నారు.

సభాపతి తీర్పు ఉన్నప్పటికీ, మీరు చేసిన ఆరోపణలు ఏవైనా సరే, ప్రతిపక్ష నాయకుడిగా మీరు కొన్ని విషయాల గురించి మాట్లాడేటప్పుడు, వాటికి తీవ్రమైన అర్థాలు ఉంటాయి. కనుక, ప్రతిపక్ష నాయకుడు అన్ని అంశాలను ధృవీకరించాలని నేను కోరుతున్నాను." రాహుల్ గాంధీ ప్రసంగం ముగిసిన తర్వాత, రిజిజు భారతదేశాన్ని ఎవరూ అమ్మలేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశంలో అత్యంత బలమైన ప్రధాని అని ఆయన నొక్కి చెప్పారు. "భారతదేశం అభివృద్ధి చెందుతున్నందుకు కాంగ్రెస్ విచారంగా ఉంది" అని అన్నారు.

అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ సభను తప్పుదారి పట్టించారని, నిరాధారమైన ఆరోపణలు చేశారని పేర్కొంటూ, ప్రభుత్వం ఆయనపై ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేస్తుందని రిజిజు అన్నారు.

"రాహుల్ గాంధీ తన ప్రసంగం తర్వాత ఉద్దేశపూర్వకంగా పదే పదే ఇలాగే చేస్తాడు, సాధారణంగా ఆయన ప్రసంగం అబద్ధాలు, ఆరోపణలతో నిండి ఉంటుంది, తర్వాత ఆయన పారిపోతాడు. మంత్రి సమాధానం వినడానికి ఎప్పుడూ కూర్చోడు. మనకు చాలా గంభీరమైన స్వభావం లేదా ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన గంభీరమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి లేకపోవడం చాలా దురదృష్టకరం. రాహుల్ గాంధీ అబద్ధాలను బయట ఎదుర్కోవాలని మా పార్టీ నిర్ణయం తీసుకుంది. కానీ సభ లోపల, నోటీసు జారీ అవుతుంది. మేము స్పీకర్‌కు నోటీసు అందిస్తాము. రాహుల్ గాంధీ తన ఆరోపణలను ధృవీకరిస్తానని హామీ ఇచ్చాడు, కానీ అతను అబద్ధం చెప్పినందున అతను ధృవీకరించలేడని మాకు తెలుసు. ఆయన సభలో అబద్ధం చెప్పాడు... తన ప్రసంగం తర్వాత, వెంటనే పారిపోయాడు, కనుక, నియమాలను మళ్లీ మళ్లీ ఉల్లంఘిస్తున్నాడు" అని ఆయన అన్నారు.

## ప్రతిపక్ష అవిశ్వాస తీర్మాన నోటీసులో లోపాలు

### సరిదిద్దుకునేందుకు సమయమిచ్చిన ఓం బిర్లా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 (వుదయం):** తన పై పెట్టిన అవిశ్వాస తీర్మా నోటీసు ముసాయిదాలో ఏర్పడిన దోషాల కారణంగా దానిని పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా, దానిలో లోపాలను సరిదిద్దుకోవడానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాలకు అవకాశమిచ్చారని పార్లమెంటరీ వర్గాలు బుధవారం ఒక వార్తాసంస్థకు తెలిపాయి.



118 మంది ప్రతిపక్ష ఎంపీలు సంతకం చేసిన ఈ నోటీసును మంగళవారం మధ్యాహ్నం లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు సమర్పించారు. అయితే, ఇందులో ఫిబ్రవరి 2025లో నాలుగు చోట్ల జరిగిన సంఘటనల ప్రస్తావనలు ఉన్నాయని, ఇది నిబంధనల ప్రకారం తిరస్కరణకు దారితీసి ఉండవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. దానిని తోసిపుచ్చడానికి బదులుగా, నోటీసును సరిదిద్దడానికి, వీలైనంత త్వరగా జాబితా చేయడానికి వీలుగా లోపాల గురించి ప్రతిపక్షాలకు తెలియజేయాలని బిర్లా అధికారులను ఆదేశించారని ఆ వర్గాలు తెలిపాయి. తరువాత ప్రతిపక్షం మునుపటి నోటీసును ఉపసంహరించుకుని, సరిదిద్దిన తేదీతో, సవరించిన వర్షన్‌ను సమర్పించింది.

"నోటీసులో ఫిబ్రవరి 2025 నాటి సంఘటనలను నాలుగుసార్లు ప్రస్తావించినట్లు తెలుస్తోంది, దీని ఆధారంగా నిబంధనల ప్రకారం దానిని తిరస్కరించవచ్చు" అని ఆ వర్గాలు తెలిపాయి.

ఒక రోజు ముందు, స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ మధ్యాహ్నం 1:14 గంటలకు అవిశ్వాస తీర్మానానికి నోటీసును సమర్పించినట్లు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు.

ప్రతిపక్ష పార్టీలు బిర్లా స్పష్టంగా పక్షపాతంతో ప్రవర్తిస్తున్నారని ఆరోపించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర నాయకులను మాట్లాడటానికి అనుమతించలేదని వారు ఆరోపించారు. 2020 భారతదేశంచైనా ప్రతిష్టంభనపై మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరావణే ప్రచురించని జ్ఞాపకాలను గాంధీ ప్రస్తావించడానికి ప్రయత్నించిన విషయం తెలిసిందే.

లోక్‌సభ సచివాలయ వర్గాల ప్రకారం, బడ్జెట్ సమావేశాల రెండవ భాగం మొదటి రోజు, అంటే మార్చి 9న ఈ తీర్మానంపై చర్చ జరిగే అవకాశం ఉంది.

## పాక్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా చూసింది

### అమెరికాపై ఖవాజా ఆసిఫ్

**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11 (వుదయం) :** తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం యునైటెడ్ స్టేట్స్ ఇస్లామాబాద్‌ను ఉపయోగించుకుని, తర్వాత టాయిలెట్ పేపర్ కన్నా ఘోరంగా విసర్జించిందని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అమెరికాపై తీవ్ర ఆరోపణలను గుప్పించారు. పార్లమెంటులో ప్రసంగిస్తూ, 1999 తర్వాత అమెరికాతో తిరిగి పొత్తు పెట్టుకోవాలని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయం, ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్ విషయంలో వేసిన తప్పటడుగు, దేశానికి శాశ్వత నష్టం కలిగించిందని ఆసిఫ్ అన్నారు. అమెరికా మద్దతు తీసుకోవడం ఒక తప్పు అని ఆయన అభివర్ణించారు, దీని పరిణామాలు దశాబ్దాల తర్వాత కూడా పాకిస్తాన్ ఎదుర్కొంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆఫ్ఘన్ యుద్ధం విషయంలో జోక్యాన్ని అంగీకరించిన ఆసిఫ్**

ఖ్వాజా ఆసిఫ్ ఆఫ్ఘన్ వివాదంలో పాకిస్తాన్ జోక్యం మతపరమైన విధి ద్వారా ప్రేరేపితమైందన్నవాదనను ఖండించారు. కానీ, జిహాద్ ముసుగులో పాకిస్తానీయులను సమీకరించి పోరాడటానికి పంపడాన్ని అంగీకరించారు. అదనంగా, ఈ యుద్ధాలను చట్టబద్ధం చేయడానికి పాకిస్తాన్ విద్యా వ్యవస్థను కూడా పునర్నిర్మించారని ఆయన పట్టి చూపారు. నేటికీ అనేక సైద్ధాంతిక మార్పులు ఇందులో ఇమిడి ఉన్నాయని పేర్కొన్నారు. దశాబ్దాల నాటి కథనాన్ని ఆసిఫ్ సవాలు చేస్తూ, 1980లలో ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన సోవియట్ వ్యతిరేక యుద్ధాన్ని, మతపరమైన ఆవశ్యకత కంటే అమెరికన్ భౌగోళిక రాజకీయ ప్రయోజనాలే నిర్దేశించాయని



వాదించారు. పరిస్థితులు జిహాద్ ప్రకటనకు ఎప్పుడూ అధికారం ఇవ్వలేదని నొక్కి చెప్పారు. పాకిస్తాన్ తన సొంతం కాని సంఘర్షణలలో పాల్గొనడం వల్ల దీర్ఘకాలిక అస్థిరత ఏర్పడిందని, తీవ్రమైన సామాజిక నష్టం జరిగిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు.

**పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా అమెరికా చూసింది**

1999 తర్వాత, ముఖ్యంగా సెప్టెంబర్ 11, 2001 దాడుల తర్వాత, అమెరికాతో తిరిగి పొత్తు పెట్టుకోవడం వల్ల కలిగిన నష్టాలు వినాశకరమైనవని ఆసిఫ్ అన్నారు. "పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ కంటే దారుణంగా చూశారు. దానిని ఒక ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నారు, తరువాత విసర్జించారు" అని ఆయన పార్లమెంటులో అన్నారు.

2001 తర్వాత కాలంలో వాషింగ్టన్‌తో కలిసి ఉండటం వల్ల ఇప్పటికీ ఎదుర్కొంటున్న హింస, తీవ్రవాదం, ఆర్థిక ఒత్తిడికి అమెరికానే కారణమని రక్షణ మంత్రి ఆరోపించారు. "మనం అనుభవించిన నష్టాలను ఎప్పటికీ భర్తీ చేయలేము" అని ఆసిఫ్ అన్నారు, పాకిస్తాన్ చేసిన తప్పులను 'తిరిగి మార్చలేనివి' అని అభివర్ణించారు.

## రాహుల్ చేసిన ఆరోపణలు నిరాధారం

**న్యూఢిల్లీ, పిబ్రవరి 11 (వుదయం) :** కాంగ్రెస్ నాయకుడు లోక్‌సభలో జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలన్నట్లు ప్రస్తావించిన తర్వాత, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి బుధవారం ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై ఎదురుదాడి చేశారు. రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేశారని, సమాధానాలను వినకుండా సభ నుండి వాకౌట్ చేశారని ఆరోపించారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో తన పేరు ప్రస్తావించడంపై ఆయన వివరణ ఇచ్చారు. తాను దివంగత, అవమానకరమైన అమెరికన్ ఫైనాన్షియర్‌ను కొన్ని సందర్భాలలో ప్రతినిధి బృందంలో భాగంగా మాత్రమే కలిశానని, అతనితో ఒక ఇమెయిల్ మాత్రమే మార్పిడి చేసుకున్నానని స్పష్టం చేశారు. మా సంభాషణలకు (అతడి మోపిన నేరారోపణలకు) ఎటువంటి సంబంధం లేదు," అని పూరి అన్నారు, "మేము 'మేక్ ఇన్ ఇండియా' గురించి మాట్లాడుకున్నాము."

ఎప్‌స్టీన్ కార్యకలాపాలపై నాకు ఆసక్తి లేదు. వారికి, నేను 'సరైన వ్యక్తి' కాదు," అని కూడా ఆయన అన్నారు, ఎప్‌స్టీన్ తనను "రెండు ముఖాలు" అని పిలిచారని, రాహుల్ గాంధీ ఆరోపణలు చేసే ముందు ఈమెయిల్స్ చదవాలని అన్నారు.

పార్లమెంటులో గాంధీ ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, మనకు ఒక యువ నాయకుడు ఉన్నాడు, అతను ఈరోజు పార్లమెంటు ముందు కొన్ని విషయాలను ఉంచాడు. అతనికి నిరాధారమైన ఆరోపణలు చేసే అలవాటు ఉంది అంటూ పూరి చెప్పుకువచ్చారు. "రెండు రకాల నాయకులు ఉంటారు: రాజకీయ వ్య



వస్థలో బాధ్యతను స్వీకరించి, దేశాన్ని మారుస్తూ, సామాజిక సేవకు తమ జీవితాలను అంకితం చేసేవారు, తమ జీవితకాలంలో దేశాన్ని 10వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుండి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మారేలా చూసుకుని తమ జీవితాలను అంకితం చేసేవారు అని ఆయన అన్నారు.

అప్పుడప్పుడు దేశానికి వచ్చే ఇతర నాయకులు ఉన్నారు, వారు పార్లమెంటుకు వచ్చినప్పుడు, ఎవరైనా వారికి సరైన సమాధానం ఇస్తే, వారి మాట వినకుండా వారు సభ నుండి వాకౌట్ చేస్తారు. ఈరోజు తన సొంత ప్రసంగం తర్వాత ఆయన వెళ్ళిపోయారు అంటూ సభలో గాంధీ ప్రవర్తనను పూరీ తీవ్రంగా విమర్శించారు.

పార్లమెంటులో ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఆరోపణలపై బిజెపి, కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం తీవ్రమవుతున్న నేపథ్యంలో ఈ వాగ్యుద్ధం జరిగింది. ప్రభుత్వం ఈ ఆరోపణలను నిరాధారమైనదిగా తోసిపుచ్చింది.

## థాయిలాండ్ స్కూల్‌లో కాల్పులు

### ఉపాధ్యాయుడిపై కాల్పులు, బందీలుగా విద్యార్థులు

**వుదయం డెస్క్, పిబ్రవరి 11 :** థాయిలాండ్‌లోని సాంగ్లా ప్రావిన్స్‌లోని హాట్ యాయ్ జిల్లాలోని ఒక పాఠశాలపై బుధవారం సాయంత్రం అనేక మంది సాయుధ దుండగులు దాడి చేసి, కాల్పులు జరిపి, అనేక మంది ఉపాధ్యాయులను, విద్యార్థులను బందీలుగా తీసుకువెళ్లారు. మే తప్టిమ్ యాలా ఫౌండేషన్ ప్రకారం, తంబోన్ పటోంగ్‌లోని పటోంగ్ ప్రధాన్ ఖిరివాట్ పాఠశాలపై సాయంత్రం 4.59 గంటల ప్రాంతంలో దాడి జరిగింది. ముష్కరులు క్యాంపస్‌లోకి ప్రవేశించి కాల్పులు జరపడం ప్రారంభించారు. ఒక ఉపాధ్యాయుడిని కాల్చి చంపినట్లు సమాచారం. గాయపడిన ఉపాధ్యాయుడిని చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు స్థానిక వర్గాలు తెలిపాయి.



**పాఠశాలలోకి దూసుకువెళ్లిన సాయుధ దుండగులు**

దాడి జరిగిన వెంటనే పోలీసు దళాలు స్పందించి, పాఠశాలను చుట్టుముట్టారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు భవనం లోపలే ఉన్నారని, చాలామంది విద్యార్థులు భయంతో చిక్కుకుపోయి బయటకు వెళ్లలేకపోతున్నారని అధికారులు తెలిపారు. హాట్ యాయ్ పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రత్యేక దళాల బృందాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రాంగణం నుండి వీలైనంత ఎక్కువ మందిని తరలించేందుకు సహాయక బృందాలు కూడా వచ్చాయి.

**బందీలను విడిపించేందుకు చర్చలు**

సాయుధ ముష్కరులతో కమ్యూనికేషన్ ఏర్పాటు చేసుకోవడానికి, చర్చలు జరపడానికి జిల్లా అధికారులు, టాంబోన్ నాయకులు, గ్రామ పెద్దలతో సమన్వయం చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. వార్త ఇచ్చే సమయంలో ఇంకా ప్రతిష్టంభన కొనసాగడమే కాదు, ఎటువంటి పరిష్కారం గురించీ వార్తలు వెలువడలేదు.

**ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లవద్దని ప్రజలకు సూచన**

భద్రతా దృష్ట్యా పాఠశాల, దాని పరిసర ప్రాంతాలకు సమీపంలోని మార్గాలను ప్రజలు నివారించాలని అధికారులు కోరారు. పరిస్థితి మరింత పరిణామం చెందుతున్నందున ప్రభుత్వ సంస్థలు లేదా ఇతర విశ్వసనీయ వర్గాల నుండి వచ్చే సూచనలను మాత్రమే అనుసరించాలని వారు ప్రజలకు సూచించారు.

## అమెరికాబంగ్లాదేశ్ వాణిజ్య ఒప్పందం గార్మెంట్స్‌కు జీరో టారిఫ్

అమెరికా, బంగ్లాదేశ్ మధ్య కుదిరిన రెసిప్రోకల్ ట్రేడ్ అగ్రిమెంట్‌తో బంగ్లాదేశ్ గార్మెంట్ ఎగుమతులకు జీరో టారిఫ్ లభించింది. అయితే, అమెరికాకు చెందిన కాటన్, సింథటిక్ మెటీరియల్స్ వాడితేనే ఈ రాయితీ వర్తిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా కార్లు, మోటార్ సైకిళ్లు, మెడికల్ డివైసులు, ఐటీ పరికరాలు, ఎనర్జీ ఉత్పత్తులు, సోయా ఆధారిత వస్తువులకు బంగ్లాదేశ్‌లో ప్రాధాన్యత లభిస్తుంది. బంగ్లాదేశ్ రానున్న 15 ఏళ్లలో 3.5 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు, 15 బిలియన్ డాలర్ల విలువైన ఎనర్జీ ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడంతో పాటు, బోయింగ్ నుంచి 25 విమానాలు కొనుగోలు చేయాలి. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభమైన చర్చల తర్వాత ఈ ఒప్పందం ఖరారైంది. మొదట బంగ్లాదేశ్ ఎగుమతులపై అమెరికా 37 శాతం వరకు సుంకాలు విధించాలని ప్రతిపాదించింది. సుదీర్ఘ చర్చల అనంతరం దీనిని మొదట 20 శాతానికి, ఇప్పుడు తాజాగా 19 శాతానికి తగ్గించారు. ఈ సుంకాల తగ్గింపునకు బదులుగా, బంగ్లాదేశ్ కూడా కొన్ని అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులకు తమ మార్కెట్‌లో ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ ఒప్పందం అధికారికంగా అమల్లోకి రావాలంటే ఇరు దేశాలు నోటిఫికేషన్లు జారీ చేయాల్సి ఉంటుంది.

## ప్రత్యర్థులు కాదు సహకార భాగస్వాములు

**వుదయం డెస్క్, ఫిబ్రవరి 11 :** భారత్, చైనా తమ సంబంధాలలో స్థిరీకరణ స్వరాన్ని ప్రదర్శించడానికి మంగళవారం ప్రయత్నించాయి. ఇరు దేశాలూ, ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా సహకార భాగస్వాములుగా పరిగణించుకుని, ఒకరికొకరు ముప్పుగా కాకుండా అభివృద్ధి అవకాశాలుగా చూసుకోవాలని బీజింగ్ పేర్కొంది. బ్రిక్స్ సంబంధిత సమావేశాల కోసం భారత్ విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, చైనా కార్యనిర్వాహక ఉప విదేశాంగ మంత్రి మా జావోక్సు మధ్య న్యూఢిల్లీలో జరిగిన భారతదేశంచైనా వ్యూహాత్మక చర్చ తాజా దశ తర్వాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

ద్వైపాక్షిక సంబంధాలు, సరిహద్దు స్థిరత్వం, వాణిజ్య ఆందోళనలు, బహుపాక్షిక సహకారం వంటి అంశాలపై జరిగిన చర్చలను వివరిస్తూ చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వేర్వేరుగా ప్రకటనలను విడుదల చేశాయి.

**సహకార భాగస్వాములు, ప్రత్యర్థులు కాదు: చైనా**

అంతర్జాతీయ, ప్రాంతీయ పరిస్థితి, దేశీయ, విదేశాంగ విధానాలు, చైనాభారత్ సంబంధాల స్థితిగతులపై ఇరుపక్షాలు స్నేహపూర్వకంగా, నిష్కపటంగా, లోతైన చర్చలు జరిపాయని బీజింగ్ తన ప్రకటనలో పేర్కొంది.

అంతర్జాతీయ పరిస్థితిలో సంక్లిష్టమైన, తీవ్రమైన మార్పులను దృష్టిలో ఉంచుకుని, అధ్యక్షుడు జి జిన్‌పింగ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మధ్య కుదిరిన ముఖ్యమైన ఉమ్మడి అవగాహనలను చిత్తశుద్ధితో అమలు చేయడానికి చైనా, భారత్ కలిసి పనిచేయాలని రెండు పక్షాలు నొక్కిచెప్పాయి అని చైనా ప్రకటనపేర్కొంది. ఇరుపక్షాలు చైనాభారత దేశ సంబంధాలను వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్కోణం నుంచి చూడాలి, నిర్వహించాలి.



చైనా, భారత్ ప్రత్యర్థులుగా కాక సహకార భాగస్వాములు అనే వ్యూహాత్మక అవగాహనను నిలబెట్టుకొని, రెండు దేశాలు ఒకరినొకరు ముప్పుగా కాక అభివృద్ధి అవకాశంగా పరిగణించాలని అది పేర్కొంది.

2026, 2027లో బ్రిక్స్ అధ్యక్ష పదవికి ఒకరికొకరు మద్దతు ఇవ్వాలని, బహుపాక్షికతకు, ఐక్యరాజ్యసమితి కేంద్ర పాత్రకు మద్దతు ఇవ్వాలని, గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని, బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషి చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**శాంతి, వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలు: భారత్**

ఈ సంభాషణ ద్వైపాక్షిక, ప్రాంతీయ, ప్రపంచ సమస్యల విస్తృత శ్రేణిని కవర్ చేసిందని, ముఖ్యంగా సంబంధాలను స్థిరీకరించడం, పునర్నిర్మించడం చర్చలను ముందుకు తీసుకెళ్లే మార్గాలను గుర్తించడంపై దృష్టి సారించిందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ద్వైపాక్షిక సంబంధాలలో మొత్తం పురోగతికి సరిహద్దు ప్రాంతాలలో శాంతి, నిశ్చలతకు ప్రాముఖ్యతను ఇరు పక్షాలు నొక్కిచెప్పాయి అని ప్రకటన పేర్కొంది.

కైలాస్ మానసరోవర్ యాత్ర విజయవంతంగా పునఃప్రారంభం కావడం గురించి మిస్రి ప్రముఖంగా ప్రస్తావించారు. దాని పరిధి మరింత విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు వైపులా, నవీకరించిన విమాన సేవల ఒప్పందాన్ని ప్రారంభ దశలోనే ముగించాల్సిన అవసరాన్ని గుర్తించి, వీసా సులభతరం చేయడానికి, ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించడానికి ఆచరణాత్మక చర్యలు తీసుకోవడం కొనసాగించడానికి అంగీకరించారు. ప్రస్తుత బ్రిక్స్ అధ్యక్షతన బహుపాక్షిక సహకారం చర్చలలో ఉందని భారత్ తెలిపింది. భారతదేశంలో విజయవంతమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి చైనా మద్దతు వ్యక్తం చేసింది. యుఎన్ ఎస్‌సి సభ్యత్వం కోసం భారతదేశ ఆకాంక్షలను చైనా అర్థం చేసుకుంటుందని, గౌరవిస్తుందని అని పేర్కొంది.

**సానుకూల ఊపు, సున్నితమైన అంశాలపై చర్చ**

ద్వైపాక్షిక సంబంధాలలో సానుకూల వేగాన్ని, ఊపును ఇరువురు ప్రతినిధులు సమీక్షించారు. తూర్పు లడఖ్‌లో సైనిక ప్రతిష్టంభన తర్వాత ఇరుపక్షాలు దెబ్బతిన్న సంబంధాలను స్థిరీకరించడానికి, పునర్నిర్మించడానికి తీసుకున్న చర్యలు, వాణిజ్యానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించే మార్గాలపై చర్చలు దృష్టి సారించాయి. మిస్రి, మా అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారని కూడా ఆ ప్రకటన తెలిపింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ , చైనా అధ్యక్షుడు గ్జి జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశాల తర్వాత సంబంధాలలో క్రమంగా ఏర్పడిన మెరుగుదల గురించి, 2024 అక్టోబర్‌లో కజాన్‌లో, 2025 ఆగస్టులో టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా వారి సంభాషణ గురించి ఈ ప్రకటన ప్రస్తావించింది.

## విశాల భారత్ మ్యాప్‌ను తొలగించిన యుఎస్




**వాషింగ్టన్, ఫిబ్రవరి 11 (వుదయం):** తమ గత వైఖరికి భిన్నంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను, అక్సాయ్ చిన్‌ను భారత్‌లో భాగంగా చూపుతూ యుఎస్ ట్రేడ్ ఆఫీస్ విడుదల చేసిన మ్యాప్‌ను ఆన్‌లైన్ చర్చ అనంతరం తొలగించింది. గతంలో వారు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను, అక్సాయ్‌చిన్‌ను భారత్‌లో భాగంగా చూపించేవి. అయితే, ఈ ఆచరణకు భిన్నంగా వ్యవహరిస్తూ యుఎస్‌టిఆర్ ఈ మ్యాప్‌ను రూపొందించి విడుదల చేసింది.

ఈ మ్యాప్ జనంలో ఆశ్చర్యానికి, చర్చకు దారి తీసింది. కాగా, పాకిస్తాన్ అభ్యంతరాలకు అనుకూలంగా, అధికారిక అమెరికా మ్యాప్‌లు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను విడిగా చూపేవి. కొత్త మ్యాప్‌ను గతవారం, భారత్ యుఎస్ వాణిజ్య ఒప్పందంతో పాటుగా పోస్ట్ చేశారు. అటు పీఓకెను, అక్సాయ్‌చిన్‌ను భారత్‌లో భాగంగా చూపడం పొరపాటుగా జరిగిందా లేక ద్వైపాక్షిక సంబంధాలలో నూతన దశకు ఇది సంకేతమా అనే ఊహాగానాలు కొనసాగాయి. ఈ చర్చను ముగిస్తూ, యుఎస్‌టిఆర్ ఆ పోస్ట్‌ను తన ఎక్స్ అకౌంట్ నుంచి తొలగించింది. తమ పాత పద్ధతుల నుంచి విడిపోయి గతంలో, యుఎస్ ప్రభుత్వం మ్యాప్‌లు సాధారణంగా పీఓకెను విడిగా చూపేవి. ఈ ప్రాంతంపై పాకిస్తాన్ హక్కును ప్రతిఫలిస్తున్నట్టుగా అవి ఉండేవి. అయితే, ప్రస్తుతం తొలగించిన మ్యాప్ ఆ తేడా చూపకుండా వివాదాస్పద ప్రాంతాలను భారత్ సరిహద్దులలో ఉన్నట్టుగా చూపింది.

ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు ఇటీవలే తగ్గిన సమయంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. భారత్, అమెరికాలు సుంకాలను తగ్గించుకోవాలని అంగీకరించాయి. భారతీయ వస్తువులపై సుంకాన్ని 50 నుంచి 18 శాతానికి వాషింగ్టన్ తగ్గించింది. ఇది అసియా దేశాలన్నింటిలో తక్కువ. ఈ చర్యను లోతైన ఆర్థిక సహకారానికి ద్వారాలు తెరవడంగా భావిస్తున్నారు. తొలగించిన మ్యాప్‌లో తూర్పు లడఖ్‌లోని అక్సాయ్ చిన్ అనే ప్రాంతాన్ని కూడా చూపించారు, దీనిని చైనా తనది అని వాదిస్తోంది, కానీ భారతదేశం భారత దేశంలో భాగంగా వివాదం చేస్తోంది. తొలగించిన మ్యాప్‌లో తూర్పు లడఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని కూడా భారత్‌లో భాగంగా చూపారు. చైనా అది తనది అని వాదిస్తోంది, కానీ భారతదేశం అది తమ దేశంలో భాగమని వాదిస్తోంది.

**భారతదేశం స్థిర వాదన**

జమ్మూ కాశ్మీర్ ప్రాంతం మొత్తం దేశంలో అంతర్భాగమని భారతదేశం పదే పదే సమర్థించింది. భారత సరిహద్దులను, ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్‌కు సంబంధించిన ప్రదేశాలను అమెరికా విదేశాంగ శాఖ, ఇతర అంతర్జాతీయ సంస్థలు తప్పుగా చిత్రీకరించడం పట్ల విదేశాంగ మంత్రిత్వ శాఖ నిరంతరం అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉంది.

## కెనడాలో భారతీయ యువకుడి దారుణ హత్య

కెనడాలో దారుణం చోటు చేసుకుంది. టొరంటోలోని ఒక షాపింగ్ మాల్ పార్కింగ్ ఏరియాలో గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఓ భారతీయ యువకుడు మృతి చెందాడు. ఉద్యోగ నిమిత్తం అక్కడకు వెళ్లిన అతడు ప్రాణాలు కోల్పోగా.. కుటుంబం మొత్తం కన్నీరు మున్నీరు అవుతోంది. ఈ ఘటనతో అటు కెనడాలోని ప్రవాస భారతీయుల్లో, ఇటు బాధితుడి స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన 37 ఏళ్ల చందన్ కుమార్... ఉద్యోగ నిమిత్తం కెనడాకు వచ్చారు. ఆరేళ్లుగా అక్కడే ఉంటూ.. ఒక ప్రైవేట్ సంస్థలో ఐటీ ప్రొఫెషనల్‌గా పని చేస్తున్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**

మమ్మల్ని X @ SCRailwayIndia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.

**'ఇ'-వేలం లీజింగ్ ద్వారా కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టుల ప్రదానం కొరకు గుంటూరు డివిజన్ యొక్క సమగ్ర నెలవారీ కేటలాగ్**

PUB/1918

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు IREPS వెబ్‌పోర్టల్‌లో ఇ-వేలం లీజింగ్ విధానం ద్వారా ఇ-బిడ్లు కోరుచున్నారు. కేటలాగ్స్ వివరాలు దిగువ విధంగా ప్రచురించబడినవి:

**పే & యూజ్ టాయిలెట్స్ ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్**

| క్ర. సం. | కాంట్రాక్టు రకం | స్టేషన్ | కాంట్రాక్టు వ్యవధి | బయానా విలువ | వేలం ప్రారంభ తేది మరియు సమయం |
|---|---|---|---|---|---|
| 1 | పే & యూజ్ టాయిలెట్ | గిద్దలూరు | 3 సంవత్సరాలు | బిడ్ విలువలో 10% | 24.02.2026 11:00 గం. |
| 2 | పే & యూజ్ టాయిలెట్ | GNT PF 1, 4 & 5 | 3 సంవత్సరాలు | బిడ్ విలువలో 10% | 24.02.2026 11:00 గం. |
| 3 | పే & యూజ్ టాయిలెట్ | మార్కాపూర్ | 3 సంవత్సరాలు | బిడ్ విలువలో 10% | 24.02.2026 11:00 గం. |
| 4 | పే & యూజ్ టాయిలెట్ | నరసరావుపేట | 3 సంవత్సరాలు | బిడ్ విలువలో 10% | 24.02.2026 11:00 గం. |

ఇ-టెండర్లలో పాల్గొనుటకు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుట మరియు IREPS లో ఇ-ఆక్షన్ లీజింగ్‌లో తమకు తాము నమోదు చేసుకొనుట టెండరుదారులదే బాధ్యత. రిజిస్ట్రేషన్ కొరకు మరియు IREPS పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో పాల్గొనుటకు ముందస్తు ఆవశ్యకతలు www.ireps.gov.in పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. టెండరుదారులు కోరబడినప్పుడు దిగువ సంతకందారు కార్యాలయానికి అవసరమైన డాక్యుమెంట్లు దాఖలు చేయవలెను. టెండరుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడింగ్ చేయు సమయంలో లేదా చెల్లింపులు చేయు సమయంలో IREPS పోర్టల్‌లో తలెత్తే ఏదేని అంతరాయానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించబడిన అన్ని నిబంధనలు నెరవేర్చకుండా అందినట్టి టెండర్లు వెంటనే తిరస్కరించబడతాయి. పై టెండరు యొక్క పూర్తి వివరాలు ఇ-ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్ www.ireps.gov.in పోర్టల్‌లో లభిస్తాయి.

A2434 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు



"రాహుల్ గాంధీ తన ప్రతి ప్రసంగం తర్వాత ఉద్దేశపూర్వకంగా ఇలాగే చేస్తారు. సాధారణంగా ఆయన ప్రసంగం అబద్ధాలు, ఆరోపణలతో నిండి ఉంటుంది, అతను పారిపోతాడు. మంత్రి సమాధానం వినడానికి ఎప్పుడూ కూర్చోడు. మనకు చాలా గంభీరమైన స్వభావం లేదా ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన గంభీరమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి లేకపోవడం చాలా దురదృష్టకరం. రాహుల్ గాంధీ అబద్ధాలను బయట ఎదుర్కోవాలని మా పార్టీ నిర్ణయం తీసుకుంది, కానీ సభ లోపల నోటీసు జారీ చేస్తాం. మేము స్పీకర్‌కు నోటీసు అందిస్తాం. రాహుల్ గాంధీ తన ఆరోపణలను ప్రామాణీకరిస్తానని హామీ ఇచ్చారు, కానీ ఆయన అబద్ధం చెప్పినందున ఆయన ప్రామాణీకరించలేరని నాకు తెలుసు. ఆయన సభలో అబద్ధం చెప్పారు. అందుకే, తన ప్రసంగం తర్వాత, ఆయన వెంటనే పారిపోయారు, నియమాలను మళ్లీ మళ్లీ ఉల్లంఘిస్తున్నారు."

**- కిరణ్ రిజిజు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి**

## వేమన పద్యం

**తనువ దెవరిసొమ్ము తనదని పోషింప**
**ద్రవ్యమెవరిసొమ్ము దాచుకొనగ**
**బ్రాణమెవరిసొమ్ము పారిపోవక నిల్వ**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# బంగ్లా ఓటు పర్వం!

దీర్ఘమైన ఉక్కబోత తర్వాత చల్లని పిల్ల గాలి వీచినట్టు అనిపిస్తున్నది.బంగ్లాదేశ్ లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మొదటిసారిగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేడు జరుగనున్నది.దేశమంతటా 64 జిల్లాల్లోని 42,761పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుంటారు. మొత్తం 350 నియోజక వర్గాల్లోని 300 నియోజక వర్గాల్లో ఈ ఘట్టం జరుగుతుంది. మిగతా 50 నియోజక వర్గాలను ఆయా పార్టీలు ఈ ఎన్నికల్లో సాధించుకునే స్థానాల దామాషాను బట్టి వాటి మహిళ అభ్యర్థులకు కేటాయిస్తా రు. ఆదర్శ ప్రజాస్వామ్యాన్ని ఆశించి చేసుకున్న ఈ ఏర్పాటులో ప్రశాంత పాలన కొరవడడం, బలమైన పార్టీల నేతలు తాము చేస్తున్నది దేశ సేవ అనే స్పృహను కోల్పోవడం, పరస్పరం పగలు, కక్షలు, రగిలించుకుంటూ ప్రజాస్వామ్య ధర్మానికి పాడె కట్టడం అత్యంత ఆందోళనకరం.అయితే ప్రపంచవ్యాప్తంగా రాజకీయాలను ధనికులు, కార్పొరేట్ అనుకూల శక్తులు శాసించడం మొదలైన తర్వాత ప్రజాస్వామ్యాలు ధనస్వామ్యాలు గా మారిపోయాయి. భారత ఉపఖండ దేశాల్లోని రాజకీయాల మీద మతం తన ప్రాబల్యాన్ని పెంచుకుంటున్నది. బంగ్లాదేశ్ అందుకు భిన్నం కాదు పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ ఏర్పడినప్పుడే భారత్ మద్దతుతో జరిగిన ఆ పోరాటం కారణంగా బంగబంధు ముజిబుర్ రెహ్మాన్ ను వ్యతిరేకించిన మతతత్వ శక్తులు ఆయనను సకుటుంబంగా హతమార్చింది.పాకిస్తాన్ వారికి దన్నుగా నిలిచింది తర్వాత ప్రజలు ముజిబుర్ కుమార్తె హసీనా బేగం ను పదే పదే ఎన్నుకున్నప్పటికీ ఆమె అక్రమ ఎన్నికల ద్వారా అధికారంలోకి వస్తున్నారనే విమర్శ వెల్లువత్తింది.దేశ స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నవారి పిల్లలకు రిజర్వేషన్ల అంశంపై 2004 జూలై-ఆగష్టు లో యువత ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనలు తీవ్ర హింసా కాండకు దారి తీసాయి. ఈ హింసలో 1400 మంది అసందోళనకారులు మరణించారు. నోబుల్ శాంతి బహుమతి గ్రహీత మొహమ్మద్ యూనస్ సారథ్యంలో ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వం ఆధ్యర్యంలో జరుగుతున్న ఈ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీ అయిన హసీనా బేగం కి చెందిన అవామీ లీగ్ ను బహిష్కరించారు.

ఈ ఎన్నికలు నిష్పాక్షికంగా జరగబోవనడానికి ఇదే తిరుగు లేని నిదర్శనం. జనరల్ జియా భార్య మాజీ ప్రధాని ఖలీదా జియా ఇటీవలే చనిపోయారు.ఆమె నాయకత్వంలోని బంగ్లా నేషనల్ పార్టీ (బి ఎన్ పి)హసీనా అవామీ పార్టీ కి ప్రధాన రాజకీయ శత్రువుగా ఉంటూ వచ్చింది.ఆ పార్టీ నాయకత్వ వారసుడు, ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ భవిష్యత్ వ్యవహార శైలి ఎలా ఉన్నప్పటికీ ప్రస్తుతానికైతే ఈ ఎన్నికల్లో గెలుపు బి ఎన్ పి దే అని సర్వేలు చెబుతున్నాయి. అయితే బంగ్లాలో మత వైషమ్యాలు పెరిగి హిందువులు వంటి మైనారిటీ మతస్థులకు మరింత గడ్డుకాలం తప్పదనే జోస్యాలు భయపెట్టడం సహజం. బంగ్లాదేశ్ లో న్నికల నిష్పాక్షిత, ప్రశాంతత బలిపీఠం మీద కూచున్నాయి.


## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాటలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# అవిశ్వాసం కాదు.. తొలగింపు తీర్మానం

లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా పై కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి అవిశ్వాస తీర్మాన నోటీసును అందజేసింది. పలు కీలకచర్చల సందర్భంలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీకి సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదని , ఏకపక్షంగా కొందరు సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారని, స్పీకర్ ఒక సందర్భంలో చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, అందుకే స్పీకర్ పై అవిశ్వాస తీర్మాన నోటీసు ఇచ్చామని ప్రతిపక్ష కూటమి చెబుతోంది. అయితే ప్రజలకు సులభంగా అర్థం కావడానికి అవిశ్వాస తీర్మానం అనే పదం వాడుతున్నారు కాని అసలు రాజ్యాంగంలో కాని, లోక్ సభ నియమావళిలో కాని ఎక్కడా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ల విషయంలో నో కాన్ఫిడెన్స్ మోషన్- అవిశ్వాస తీర్మానం, అనే పదాన్ని వాడలేదు. అసలు రాజ్యాంగం లో నో కాన్ఫిడెన్స్ మోషన్ అన్న పదం కనిపించదు. ఇప్పటికే పదవిలో ఉన్న స్పీకర్‌పై సభకు విశ్వాసం లేదని తెలియజెప్పే సందర్భంలో అవిశ్వాసం అనే పదాన్ని వాడుతున్నారు.

### ఆర్టికల్ 94, 96 ఏం చెబుతున్నాయి?

స్పీకర్ పదవి ఖాళీ, రాజీనామా, తొలగింపునకు (రిమూవల్)కు సంబంధించిన విధి విధానాలు, అనర్హత,. స్పీకర్ ఎప్పుడు పదవిని కోల్పోతారు వంటి అంశాలను రాజ్యాంగం ప్రస్తావిస్తోంది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 94,96 లు వీటిని ప్రస్తావిస్తున్నాయి. ఆర్టికల్ 94 ప్రకారం, స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లు (ఎ)లోక్ సభ సభ్యత్వం కోల్పోతే తమ పదవిని కోల్పోతారు (బి) స్పీకర్ డిప్యూటి స్పీకర్ కు, డిప్యూటీ స్పీకర్‌కూ స్వదస్తూరితో రాజీనామా లేఖ సమర్పించినపుడు పదవి కోల్పోతారు. (సి) సభలోని మొత్తం సభ్యులలో మెజారిటీ సభ్యులు ఒక తీర్మానం ద్వారా స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను తొలగించవచ్చు, అయితే ఇందుకోసమే నిర్దేశించిన నోటీసును లోక్ సభ సెక్రటరీ జనరల్ కు 14 రోజుల ముందు అందజేయాలి. అయితే లోక్ సభ రద్దు అయినా స్పీకర్ పదవి మాత్రం దానంతట అదే ఖాళీ కాదు. తదుపరి సభ తొలి సమావేశ మయ్యేంతవరకు వారు కొనసాగుతారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 95 ప్రకారం స్పీకర్ పదవి ఖాళీగా ఉన్నప్పుడు లేదా స్పీకర్ లేనపుడు డిప్యూటీ స్పీకర్ లేదా ఇందుకోసం నియమితులైన వారు సభా కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఆర్టికల్ 96 ప్రకారం, . స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ ను తొలగించాలనే నోటీసు చర్చకు వచ్చినపుడు, నిష్పాక్షికత పాటించడం కోసం, ఎవరిపై తీర్మానం ప్రవేశపెట్టారో వారు సభాపతి స్థానంలో ఉండరాదు. అయితే వారు చర్చలో పాల్గొనడానికి, ఓటు వేయడానికి అర్హత కలిగి ఉంటారు. అయితే స్పీకర్ లేదా డిప్యూటి స్పీకర్ తొలగింపు తీర్మానానికి సమానంగా ఓట్లు వచ్చినపుడు మాత్రం వీరు (ఎవరిపై తీర్మానం చర్చిస్తున్నారో వారు) నిర్ణయాత్మక ఓటు వేయరాదు. నిష్పాక్షికత కోసం ఈ నిబంధనలు రూపొందించారు. తమ మీద ప్రవేశపెట్టిన తీర్మానం పై చర్చ జరుగుతున్నపుడు సభాధ్యక్షస్థానంలో వారు ఉండడం సరికాదని ఈ నిబంధన రూపొందించారు.

### తొలి స్పీకర్‌కూ తప్పని పరీక్ష

స్వతంత్ర భారతదేశ లోక్‌సభ తొలి స్పీకర్, .గణేశ్ వాసుదేవ మౌలంకర్‌కు పార్లమెంటరీ విలువలకు పెద్దపీట వేసిన వ్యక్తిగా పేరు. ఆయనను లోక్‌సభ పితామహుడంటారు (ఫాదర్ ఆఫ్‌లోక్‌సభ) . దేశ ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆయనకు ఈ గౌరవాన్నిచ్చారు. పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ప్రశ్నోత్తరాల సమయానికి ప్రాధాన్యత తెచ్చిన వ్యక్తిగా ఆయనకు పేరు. అలాగే పార్లమెంటరీ నిబంధనలు ఎన్నింటికో ఆయన రూపశిల్పి. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు,ఆ తర్వాత ధన్యవాదాల తీర్మానం వంటి ఆలోచనలను ముందుకు తెచ్చింది మౌలంకరే. పార్లమెంటరీ కమిటీలు, రూల్స్ కమిటీ, బిజినెస్ అడ్వయిజరీ కమిటీ, ప్రైవేట్ మెంబర్స్ బిల్స్ పై కమిటీ వంటి వాటి రూపశిల్పి ఆయనే. వాటినీ ఇప్పటికీ పాటిస్తున్నాం. అటువంటి జి.వి.మౌలంకర్‌ను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ అప్పటి ప్రతిపక్ష సభ్యులు నోటీసు ఇచ్చారు. ఈ నోటీసును బీహార్‌కు చెందిన సోషలిస్ట్ పార్టీ ఎం.పీ. విఘ్నేశ్వర్ మిసిర్ ప్రతిపాదించారు. జెబి కృపలాని, ఎస్.ఎస్. మోరె, వి.జి.దేశ్‌పాండ్, ఎన్.బి.ఖరే, ఎ.కె.గోపాలన్, సారంగధర్ దాస్ తదితరులు ఈ నోటీసుపై సంతకాలు చేశారు. వాయిదా తీర్మానాలు పట్టించుకోకపోవడం, ప్రశ్నలు అడగడానికి సమాన అవకాశం ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల స్పీకర్‌సభ్యులందరి విశ్వాసాన్ని పొందలేకపోయారన్నది వారి వాదన.



స్పీకర్ పదవి ఖాళీగా ఉన్నప్పుడు లేదా స్పీకర్ లేనపుడు డిప్యూటీ స్పీకర్ లేదా ఇందుకోసం నియమితులైన వారు సభా కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఆర్టికల్ 96 ప్రకారం, స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ ను తొలగించాలనే నోటీసు చర్చకు వచ్చినపుడు, నిష్పాక్షికత పాటించడం కోసం, ఎవరిపై తీర్మానం ప్రవేశపెట్టారో వారు సభాపతి స్థానంలో ఉండరాదు. అయితే వారు చర్చలో పాల్గొనడానికి, ఓటు వేయడానికి అర్హత కలిగి ఉంటారు. అయితే స్పీకర్ లేదా డిప్యూటి స్పీకర్ తొలగింపు తీర్మానానికి సమానంగా ఓట్లు వచ్చినపుడు మాత్రం వీరు (ఎవరిపై తీర్మానం చర్చిస్తున్నారో వారు) నిర్ణయాత్మక ఓటు వేయరాదు. నిష్పాక్షికత కోసం ఈ నిబంధనలు రూపొందించారు. తమ మీద ప్రవేశపెట్టిన తీర్మానం పై చర్చ జరుగుతున్నపుడు సభాధ్యక్షస్థానంలో వారు ఉండడం సరికాదని ఈ నిబంధన రూపొందించారు.

దీనిపై 1954 డిసెంబర్ 18న సభలో సుదీర్ఘ చర్చజరిగింది. ఈ చర్చను డిప్యూటీ స్పీకర్ మాడభూషి అనంత శయనం అయ్యంగార్ చేపట్టారు. (మాడభూషి వారి జన్మస్థలం తిరుపతి పక్కనే ఉన్న తిరుచానూరు. మన తెలుగు గడ్డమీదే వారు జన్మించారు.) ఈ చర్చ లో అధికార పక్షం తక్కువ సమయం తీసుకుంటుందని, ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇవ్వాలని ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ డిప్యూటీ స్పీకర్ కు సూచించారు. స్పీకర్ తొలగింపు తీర్మానంపై సుదీర్ఘ చర్చ జరిగింది. అనంతరం, ఈ తీర్మానం మూజువాణి ఓటు (వాయిస్‌ఓట్)తో వీగిపోయినట్టు డిప్యూటీ స్పీకర్ ప్రకటించారు. మౌలంకర్ లోక్‌సభ స్పీకర్ గా కొనసాగారు.

### సర్దార్ హుకుమ్‌సింగ్ పై తీర్మానం

ఇక రెండోది, 1966 నవంబర్ 24న స్పీకర్ సర్దార్ హుకుమ్‌సింగ్ తొలగింపు తీర్మానానికి ప్రతిపక్ష సభ్యుడు మధులిమయే నోటీసు ఇచ్చారు. అయితే ఈ నోటీసు చర్చ వరకూ వెళ్లలేదు. స్పీకర్ తొలగింపు నోటీసుపై చర్చకు అవసరమైన సభ్యుల మద్దతు లభించలేదు. దీనితో ఇది చర్చకు నోచుకోలేదు. ఆ రకంగా సర్దార్ హుకుమ్ సింగ్ పై ప్రతిపక్షాలు పెట్టాలనుకున్న తొలగింపు తీర్మానం వీగిపోయింది. అప్పుడు డిప్యూటి స్పీకర్ ఎస్.వి.కృష్ణమూర్తి రావు సభాకార్యకలాపాలు నిర్వహించారు. సర్దార్ హుకుం సింగ్ స్పీకర్ గా కొనసాగారు.

### బలరాం జాఖడ్‌పైనా నోటీసు

భారత పార్లమెంటరీ చరిత్రలో సుదీర్ఘకాలం స్పీకర్‌గా ఉన్న వ్యక్తి బలరాం జాఖడ్. దాదాపు 9 సంవత్సరాల 329 రోజులపాటు అంటే 1980 నుంచి 1989 మధ్య లోక్ సభ స్పీకర్‌గా ఉన్నారు. అయితే వారిని తొలగింపును కోరుతూ ప్రతిపక్షాలు నోటీసును ఇచ్చాయి. పలు రాజ్యాంగ పరమైన అంశాలను ఇతర ముఖ్యమైన అంశాలను చర్చించడానికి తమను అనుమతించడం లేదంటూ , సిపిఎం నాయకుడు సోమనాథ్ చటర్జీ బలరాంజాఖడ్ తొలగింపునకు నోటీసు ఇచ్చారు. ఈ నోటీసును స్వీకరించి ఈ అంశాన్ని చర్చకుచేపట్టాలా వద్దన్న అంశాన్ని సభ చేపట్టిందికానీ సభలో ఈ తీర్మానంపై చర్చకు తగినంత మద్దతు లేకపోవడంతో తీర్మానం వీగిపోయినట్టు డిప్యూటి స్పీకర్ తంబిదురై ప్రకటించారు.. ఆ రకంగా బలరాం జాఖడ్ పదవి పదిలం అయింది. ఆ తర్వాత పలు సందర్భాలలో పలువురు స్పీకర్ ల తొలగింపునకు ప్రతిపక్షాలు తీర్మానాల నోటీసులు ఇవ్వాలని హడావుడి చేసినా అవేవీ చివరి వరకూ రాలేదు.

**నెంబర్ గేమ్ :** స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్ ను తొలగించాలనే తీర్మానం ఆమోదం పొందాలంటే సభ మొత్తం సభ్యులలో మెజారిటీ సభ్యుల ఆమోదం అవసరం. లోక్ సభలో అధికార పక్షానిదే పైచేయిగా ఉంటుంది. కాకుంటే సభ్యులు తమ అసమ్మతి ని చర్చరూపంలో తెలిపి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించడానికి దీనిని వేదికగా మలచుకోవడానికి ప్రయత్నించవచ్చు.



రేవూరు
ఉమామహేశ్వరరావు

# తెలుగు సాహిత్యానికి ఎం.ఎల్. విశేష కృషి

మాదిరాజు లక్ష్మీ నరసింహా రావు భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన పాత్ర పోషించి, తెలుగు సాహిత్యానికి విశిష్టమైన కృషి చేసిన మహనీయుడు. స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం, ఆయన రచనల గాథలు, సాహిత్య సేవలు తెలుగుభాషా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు నవంబర్ 7, 1928న ఖమ్మం జిల్లా, కామేపల్లి మండలం, పండితాపురం గ్రామంలో జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం సాగుతున్న సమయంలో ఆయన బాల్యం గడిచింది. చిన్ననాటి నుంచి ఆయన అన్యాయాన్ని తట్టుకోలేని నైజం, సమాజాన్ని మారుస్తామని పట్టుదల ఆయన వ్యక్తిత్వానికి చిరునామాగా మారాయి. నిజాం నిరంకుశ పాలనలో జరుగుతున్న అన్యాయాలను చూశారు. దానికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నారు. మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆయనపై గాఢమైన ప్రభావం చూపాయి. అవి ఆయన వ్యక్తిగత జీవితానికే కాకుండా రచనా కృషికీ మార్గదర్శకంగా నిలిచాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు తెలుగు భాషకు సేవ చేయాలని సంకల్పించి, తెలుగు అకాడమీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తరువాత ఆయన హైదరాబాద్‌లోని కోఠి శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయంలో 50 ఏళ్లకు పైగా కార్యదర్శిగా సేవలందించారు. ఆయన గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వ్యవస్థాపకులుగా, గాంధీ పీస్ ఫౌండేషన్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. నిజాం పాలనలో జరుగుతున్న అన్యాయాలపై నిలదీశారు. ప్రజలను చైతన్య వంతులను చేస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి ప్రోత్సాహాన్ని అందించారు. భౌతిక పోరాటానికి బదులుగా సాహిత్యాన్ని ఆయుధంగా మార్చుకున్నారు. గాంధీజీ పద్ధతులను అనుసరించి, ప్రజలలో స్వాతంత్ర్య దాహాన్ని పెంచడంలో తన రచనల ద్వారా పాత్ర వహించారు. మాదిరాజు లక్ష్మి నరసింహారావు సాహిత్య రంగంలో ప్రఖ్యాతి పొందారు. ఆయన దాదాపు 38 గ్రంథాలను రచించారు, వీటిలో రాజకీయ, చారిత్రక, సమాజ పరమైన అంశాలు ప్రతిబింబించాయి. ఆయన రచనల ముఖ్య లక్ష్యం చరిత్రను సజీవంగా ఉంచడమే కాదు, సమాజానికి మార్గదర్శనం చేయడం. ఆయన ముఖ్యమైన రచనలు...స్వాతంత్ర్య సమర సేనానులు తెలంగాణ చరిత్ర: ఉద్యమాలు - పోరాటాలు, హైదరాబాదు స్వాతంత్ర్య ఉద్యమం - తెలంగాణ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులు, స్వామి రామానంద తీర్థ, వందే మాతరం, మహాత్మా గాంధీ సంక్షిప్త జీవిత చరిత్ర, ప్రధానమంత్రి పి.వి. నరసింహారావు, తెలంగాణ వైతాళికులు. ఈ రచనలు తెలుగు ప్రజలకు చరిత్ర, రాజకీయ చైతన్యం, ఉద్యమాలు, మహనీయుల జీవితగాథలను పరిచయం చేశాయి. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక సేవలను అందించారు. గాంధీ పీస్ ఫౌండేషన్ ద్వారా సమాజంలోని నిరక్షరాస్యత, అన్యాయంపై అవగాహన కల్పించారు. తన జీవితకాలంలో అనేక పురస్కారాలను అందుకున్నారు...తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం నుండి అయ్యంకి వెంకటరమణయ్య పురస్కారం, భోపాల్‌లోని అఖిల భారతీయ భాషా సమ్మేళనం నుండి సాహిత్యశ్రీ బిరుదు, శ్రీరామనవమి ప్రతిభా పురస్కారం. మాదిరాజు లక్ష్మీ నరసింహారావు కేవలం రచయితగానే కాకుండా, ఒక ఉద్యమకారుడిగా, గాంధీజీ సిద్ధాంతాల అనుసర నీయుడిగా, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన సాహితీవేత్తగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం, తెలుగు భాష అభివృద్ధి, సమాజ సేవల ద్వారా ఆయన పేరు శాశ్వతంగా నిలుస్తుంది. ఆయన జీవితగాథ ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తుంది. ఆత్మసమర్పణ, సాహిత్య సేవ, ప్రజల అభ్యున్నతే ఆయన జీవితసారాంశం.



# కొనసాగుతున్న విశాఖ ఉక్కు ఉద్యమం

విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్దమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి ఐదేళ్లు అయింది. విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పనున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ & కో సమగ్ర నివేదిక సమర్పిం చింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూపకల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్థుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (RINL) ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ (SAIL) నుండి విడివడి RINL గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్దమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది.

1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేకపోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది.

సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిద్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్చు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్‌సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఏసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.





సంగనబట్ల
9440595494

# మున్సిపల్ పోలింగ్ ప్రశాంతం సిద్దిపేట జిల్లాలో 82.03 శాతం ఓటింగ్- జిల్లా కలెక్టర్

**సిద్దిపేట, వుదయం**

సిద్దిపేట జిల్లా పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లో బుధవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి హేమావతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సగటున 82.03 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఈ నెల 13న జరగనున్న ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం కౌంటింగ్ కేంద్రాల వద్ద 163 BNSS (గతంలో సెక్షన్ 144) అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ప్రకటించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం 1,01,085 మంది ఓటర్లు ఉండగా, 82,921 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్: 84.21%, దుబ్బాక: 85.05% చేర్యాల: 83.41%, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్: 79.35% ఓటు వేసిన వారిలో 40,380 మంది పురుషులు, 42,536 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేసిన సిబ్బందిని, గట్టి బందోబస్తు నిర్వహించిన పోలీసు యంత్రాంగాన్ని కలెక్టర్ అభినందించారు.

# ఆరేపల్లి గ్రామంలో నీటి వృథా

## గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**వుదయం , సిద్దిపేట:**



సిద్దిపేట జిల్లాలోని కోహెడ మండలం ఆరేపల్లి గ్రామంలో వాటర్ ట్యాంక్ నిండుగా నిండిపోవడంతో మంచినీరు వృథాగా కిందకు కారిపోతున్న ఘటన ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. గ్రామ వాటర్ సిబ్బంది నిర్లక్ష్య ధోరణి కారణంగానే ఈ పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వాటర్ ట్యాంక్ పైభాగం నుంచి అధికంగా కారుతున్న నీటితో ట్యాంకు చుట్టూ నీరు నిల్వ ఉండి, అక్కడ బర్రెలు, గేదెలు చల్లదనం కోసం చేరుతున్నాయి. ఒకవైపు గ్రామంలో తాగునీరు సరైన సమయానికి అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు ఇంత పెద్ద మొత్తంలో నీరు వృథా కావడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యను పలుమార్లు గ్రామపంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ట్యాంక్ నిర్వహణలో జాగ్రత్తలు తీసుకుని నీరు వృథా కాకుండా కాపాడాలని వారు కోరుతున్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజీని సరిచేసి, గ్రామానికి సమయానికి సరిపడా తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రధాన పార్టీ అభ్యర్థులకు చెమటలు పుట్టించిన ఏసి బుజ్జగింపులు బేఖాతరు..

## 3, 7 వార్డుల్లో 'హస్తం' రెబల్స్ సంచలనం!

**మంథని, వుదయం**

మంథని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారంతో ముగిసింది. అయితే, ఈ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్ (BRS) అభ్యర్థుల కంటే, స్వతంత్ర అభ్యర్థుల హడావిడే ఎక్కువగా కనిపించింది. ముఖ్యంగా 3వ మరియు 7వ వార్డుల్లో 'ఏసీ' (Air Conditioner) గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు ప్రధాన పార్టీల అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టించారనే చర్చ మంథని గల్లీల్లో జోరుగా సాగుతోంది. బుజ్జగించినా వినని వైనం.. తగ్గేదే లేదన్న రెబల్స్!కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉండి, చివరినిమిషంలో టికెట్ దక్కక భంగపడ్డ 3వ వార్డు అభ్యర్థి సింగారపు కిష్టయ్య, 7వ వార్డు అభ్యర్థి ఇనుముల విజేత సత్యనారాయణలు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. వీరిని పోటీ నుంచి తప్పించేందుకు పార్టీ అగ్రనాయకత్వం, స్థానిక పెద్దలు రంగంలోకి దిగి తీవ్రంగా ప్రయత్నించారు. భవిష్యత్తులో మంచి పదవులు ఇస్తామని, పార్టీ కోసం పనిచేయాలని స్వయంగా పెద్దలు బుజ్జగించినప్పటికీ.. "ప్రజలే మా పక్షం.. వార్డు అభివృద్ధి మా లక్ష్యం" అంటూ వారు ససేమిరా అన్నారు. అధిష్టానాన్ని ఎదిరించి మరీ స్వతంత్రులుగా బరిలో నిలవడం ఇప్పుడు నియోజకవర్గంలో సంచలనంగా మారింది. పోలింగ్ రోజున 'ఏసీ' గుర్తు హవా! నిన్న జరిగిన పోలింగ్‌లో ఈ ఇద్దరు అభ్యర్థులు ప్రధా న పార్టీలకు ముచ్చెమటలు పట్టించా రు. పార్టీ గుర్తు లేకపోయినా, తమకు కేటాయించిన 'ఏసీ' గుర్తును ఓటర్లలోకి బలంగా తీసుకెళ్లడంలో ఈఇద్దరూ సఫలీకృతమయ్యారు. ★3వ వార్డులో: సింగారపు కిష్టయ్య తనకున్న పాత పరిచయాలు, వ్యక్తిగత ఇమేజ్‌తో ప్రధానఓటు బ్యాంకుకు భారీగా గండి కొట్టారు. ★ 7వ వార్డులో: ఇనుముల విజేత సత్యనారాయణ నిర్వహించిన ప్రచార హోరు, యువత మరియు మహిళా ఓటర్ల మద్దతు ఆమెను గెలుపుముంగిట నిలబెట్టినట్లు సమాచారం. 13న తేలనున్న మున్సిపల్ భవితవ్యంమున్సిపాలిటీపై పట్టు సాధించాలని భావిస్తున్న ప్రధాన పార్టీలకు ఈ 'రెబల్' అభ్యర్థులు కొరకరాని కొయ్యగా మారారు. వీరుగెలిస్తే మంథని మున్సిపల్ పీఠం పై ఎవరి జెండా ఎగురుతుందనే విష యంలో స్వతంత్రులే 'కింగ్ మేకర్స్' అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నేటి తో పోలింగ్ ముగియగా, రేపు (ఫిబ్రవరి 13) వెలువడనున్న ఫలితాల్లో 'ఏసీ' గుర్తు సంచలనం సృష్టిస్తుందా? లేక ప్రధాన పార్టీల హవా కొనసాగుతుందా? అనేది తేలిపోనుంది.


**దక్షిణ మధ్య రైల్వే**
మమ్మల్ని అనుసరించండి X @SCRailwayIndia
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

**ఇ-టెండరు ప్రకటన నం.03-2026**
**తేది: 09.02.2026**
PUB/1912

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ కో-ఆర్డినేషన్/ గుంతకల్ వారు దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.
**ముగింపు తేది & సమయం: 09.03.2026న 15:00 గం.**

క్ర.నం: 01 టెండరు నం: Engg-GTL-Central-2021, పని వివరణ: **SW-I:** గుంతకల్ డివిజన్ - డోన్ బల్లాస్ట్‌లెస్ ట్రాక్ (రోడ్ నం.1) వేసే ప్రతిపాదన, **SW-II:** గుంతకల్ డివిజన్ - డోన్ బల్లాస్ట్‌లెస్ ట్రాక్ (రోడ్ నం.4) వేసే ప్రతిపాదన, **SW-III:** గుంతకల్ డివిజన్ - డోన్ బల్లాస్ట్‌లెస్ ట్రాక్ GTL వద్ద (రోడ్ నం.5) వేసే ప్రతిపాదన. **ప్రకటిత విలువ:** రూ.16,44,85,179.49 పై., **బయానా:** రూ.9,72,400.00

క్ర.నం: 02 టెండరు నం: Engg-GTL-North-2022, పని వివరణ: GY-WD & BAY-GTL సెక్షన్ (UP / DN): DEN/North అధికార పరిధిలోని ADEN/North, AD&RC సబ్‌డివిజన్ల క్రింద CP-3022 బ్రాండ్ పేరు గల మైక్రో ఫ్లో మెటల్స్ స్ప్రే పౌడర్ ద్వారా క్రాస్ వెల్డెడ్ జాయింట్స్ రీకండిషనింగ్ ప్రతిపాదన మరియు వీల్ బర్న్స్/ స్కాబ్స్ రీకండిషనింగ్ ప్రతిపాదన. **ప్రకటిత విలువ:** రూ.67,54,565.66పై., **బయానా:** రూ.1,35,100.00

క్ర.నం: 03 టెండరు నం: Engg-GTL-South-2023, పని వివరణ: 2025-26 సంవత్సరంలో Sr. DEN/South/GTL అధికార పరిధిలోని రోడ్ అండర్ బ్రిడ్జీలలో ప్రతిపాదిత డీవాటరింగ్. **ప్రకటిత విలువ:** రూ.89,68,180.00 పై., **బయానా:** రూ.1,79,400.00

క్ర.నం: 04 టెండరు నం: Engg-GTL-Coord-2024, పని వివరణ: ADEN/ SW/ GTL సబ్ డివిజన్‌లోని **SW-I:** గుంతకల్: అరవింద్ నగర్‌లోని స్టాఫ్ క్వార్టర్స్ నం. 374 నుండి 416 కొరకు ప్రహరీ గోడలు మరియు కోర్టు యార్డ్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేయుట మరియు మరమ్మతులు అంటే లోపలివైపు మరియు బయట వైపు ప్లాస్టరింగ్, సేఫ్టీ గ్రిల్స్ మొదలైనవి మరమ్మతులు **SW-II:** గుంతకల్ లోని రైల్వే హాస్పిటల్ వద్ద టూ-వీలర్ పార్కింగ్‌కు మరమ్మతులు **SW-III:** గుంతకల్: GTL- సౌత్ కాలనీలోని ప్రస్తుత డ్రైనేజీ సిస్టమ్ అంటే సెప్టిక్ ట్యాంక్, ఓపెన్ డ్రైనేజ్ మరియు ఇంటి కనెక్షన్లు మొదలైన వాటికి మరమ్మతులు **SW-IV:** గుంతకల్: అరవింద్ నగర్‌లోని స్టాఫ్ క్వార్టర్స్‌కు మరమ్మతులు అంటే లోపలివైపు మరియు బయట వైపు ప్లాస్టరింగ్, ఏసి రూఫ్ రీప్లేస్‌మెంట్, టాయిలెట్స్ రీమోడలింగ్, శానిటరీ ఫిట్టింగ్స్ మొదలైనవి. **ప్రకటిత విలువ:** రూ.2,96,30,786.84 పై., **బయానా:** రూ.2,98,200.00

ఏవేని సవరణలు ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును.
డివిజనల్ రైల్వే మేనేజర్/ పనులు/ గుంతకల్
A2425

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in


# ఓటు హక్కు వినియోగించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్, ఫిబ్రవరి 11(జి.ఎన్.ఎస్•): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా రవీంద్రనగర్ సీబీఆర్ స్కూల్లోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించినప్పుడు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు.

# కత్తితో ఓటేసేందుకు వచ్చిన మహిళ

బోథ్, ఫిబ్రవరి 11(ఎ.ఎం.ఎస్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగుతోంది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. బోగస్ ఓట్లు, డబ్బుల పంపిణీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఆరోపణలు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పట్టణంలో ఓటు వేయడానికి వచ్చిన మహిళ కత్తితో కనిపించడంతో కలకలం రేగింది. తోటి ఓటర్లు, సిబ్బంది అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మహిళను, ఆమె భర్తను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

# పోలింగ్ కేంద్రం వద్ద డబ్బులు పంచిన ఇద్దరిపై కేసు

నిర్మల్, ఫిబ్రవరి 11(ఎ.ఎం.ఎస్): ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు పంచుతున్న ఇద్దరిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా, కాటిపెల్లి రాజా రెడ్డి వద్ద రూ. 3,440, మేకల కృష్ణ కుమార్ వద్ద రూ. 2,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సమయంలో నగదు, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ఓటర్లను ప్రభావితం చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ సునీల్ కుమార్ హెచ్చరించారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ

ఖానాపూర్, ఫిబ్రవరి 11(ఎ.ఎం.ఎస్): నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఖానాపూర్, నిర్మల్ పట్టణాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించి, అధికారులతో మాట్లాడారు. అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

# నిర్మల్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరడం ఖాయం

ముథోల్, ఫిబ్రవరి 11(ఎ.ఎం.ఎస్): రాష్ట్రంలో అత్యధిక మున్సిపాలిటీలను బీజేపీ కైవసం చేసుకుంటుందని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గాజులపేట్ లోని పోలింగ్ బూత్ 123లో తన ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన, అవినీతి రహిత మున్సిపల్ పాలన కోసం బీజేపీని ఆశీర్వదించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటేస్తున్నారని తెలిపారు. నిర్మల్ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ పోస్టర్ ఆవిష్కరణ

మానకొండూరు, ఫిబ్రవరి 11(ఎ.ఎం.ఎస్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో బుధవారం కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ పోస్టర్‌ను సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనవసర లింకులు క్లిక్ చేయకూడదని, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. కేశవపట్నంలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కళాశాలకు సెలవు...

**జగిత్యాల, వుదయం**

జగిత్యాల లోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ సైన్స్ కళాశాలలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడనున్నందున జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు 2026 ఫిబ్రవరి 12, 13వ తేదీలలో కళాశాలకు సెలవులు ప్రకటించబడినవి అందువల్ల బోధనా సిబ్బంది బోధనేతర సిబ్బంది విద్యార్థులు గమనించగలరు సంబంధిత సమాచారం విద్యార్థులకు తప్పనిసరిగా తెలియజేయవలసిందిగా సూచించబడింది

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్76.80 శాతం పోలింగ్ నమోదు

**లక్షెట్టిపేట్, వుదయం:**



మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకుకొనసాగింది.సాయంత్రం ఐదు గంటల సమయానికి క్యూ లైన్ లో వేచి ఉన్న ఓటర్లందరికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. లక్షెట్టిపేటలో మున్సిపాలిటీలో మొత్తం 15 వార్డులు ఉండగా, వార్డుకు రెండు చొప్పున మొత్తం 30 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు.మున్సిపాలిటీ లో మొత్తం 18331 మంది ఓటర్లుండగా, వీరిలో 6727 మంది పురుషులు, 7351 మంది స్త్రీలు ఓటు వేశారు. మొత్తం 14078 ఓట్లు పోలై నట్లు అధికారులు వెల్లడించారు.

# జిల్లాలోని 5 మున్సిపాలిటీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

## 5 గంటల వరకు 70.13శాతం పోలింగ్ నమోదు

### జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్

**జగిత్యాల, వుదయం**



జగిత్యాలజిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలు – 2026 సందర్భంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో మున్సిపాలిటీలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పోలింగ్ కొనసాగినట్లు జిల్లా ఎన్నికల అధికారి బి సత్యప్రసాద్ తెలిపారు ఐదు మున్సిపాలిటీలలో మొత్తం 136 వార్డులకు 379 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఓటర్లు ఎంతో చైతన్యంతో బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు యువ ఓటర్లు ఎన్నికల ప్రక్రియ లో ఉత్సాహంగా పాల్గొన్నందున వారికి శుభాకాంక్షలు తెలిపారు ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలకు ఎన్నికల్లో పాల్గొని సమన్వయం తో పని చేసిన వివిధ స్థాయిల అధికారులకు పోలీస్ యంత్రాంగానికి ఎన్నికలలో పాల్గొన్న సిబ్బందికి ఎన్నికల సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసిన పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడం వల్ల జిల్లాలో 5 మున్సిపాలిటీలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో తదుపరి ప్రక్రియలను కూడా నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తెలిపారు జిల్లా వ్యాప్తంగా నమోదైన పోలింగ్ శాతం జగిత్యాల 69.60 శాతం రాయికల్ 74.96 శాతం ధర్మపురి 75.16 శాతం కోరుట్ల 69.47శాతం మెట్పల్లి 69.21 శాతం మొత్తం 70.13 శాతం.

# వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వికారాబాద్, వుదయం:**

11-2-26వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ,వికారాబాద్ జిల్లా పరిధిలోని నాల్గు నియోజకవర్గాల్లో జరుగుతున్న , పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జన్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటర్లు విధిగా తమ హక్కును వినియోగించు కోవడానికి పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి రావాలని ఓటర్లకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సొంత నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకుంటున్న దృష్ట్యా, ప్రోటోకాల్ ననుసరించి అన్నీ ఏర్పాట్లతో పాటు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల పరిశీలన..జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్

**జగిత్యాల, వుదయం**

జిల్లాలోని 5 మున్సిపాలిటీలు జగిత్యాల ధర్మపురి కోరుట్ల మెట్ పెల్లి రాయికల్ లో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జరుగుతున్న పోలింగ్ సరళిని బుధవారం పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ వివిధ మున్సిపాలిటీల లోని పోలింగ్ కేంద్రల్లో పోలింగ్ కేంద్రం లోపల ఓటింగ్ సరళి పోలింగ్ కేంద్ర బయట ఓటర్ల రద్దీ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు అలాగే పోలింగ్ జరుగుతున్న తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు రిపోర్ట్ లను సూచించిన సమయం ప్రకారం ప్రతి రెండు గంటలకు ఒకసారి తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

# మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించిన కలెక్టర్

**సిద్ధిపేట, వుదయం**



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మహతి విద్యనికేతన్ హైస్కూల్, బి.ఎం.ఆర్ డిగ్రీ కళాశాల, మైనారిటీ వెల్ఫేర్ కంప్యూటర్ సెంటర్ మరియు హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ స్వయంగా సందర్శించారు. ఓటింగ్ సరళిని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 72 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన 176 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. సాయంత్రం 5 గంటల తర్వాత గేట్లు మూసివేసి, క్యూ లైన్లలో ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సీల్ చేసి, పోలీస్ ఎస్కార్ట్ మధ్య రిసెప్షన్ సెంటర్లకు తరలించి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తదితరులు ఉన్నారు.

# అడుగడుగునా ఉత్కంఠగా.. అయినా ప్రశాంతంగా..



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికలు వివాదాలు, ఆరోపణలు, దొంగ ఓట్ల కలకలం లాంటివి కొనసాగినప్పటికీ మొత్తానికి షాద్ నగరలో 76.24 శాతం పోలింగ్ శాతం నమోదై ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీకి బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య అభ్యర్థులతో స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. ఉద్రిక్త వాతావరణానికి దారి తీయకుండా పోలీసులు వెంటనే అప్రమత్తం కావడంతో ఎన్నికల ప్రక్రియ సమయానుకులంగా పూర్తయింది. షాద్ నగర్ మున్సిపాలిటీలో మొత్తం 53,403 ఓట్లకు గాను 40 వేల మందికి పైగా ప్రస్తుతం బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైన ఓటర్ల తీర్పు 13వ తేదీన వెలుగులోకి రానుంది. ఒక్కసారి మున్సిపాలిటీ ఎన్నికలు కొనసాగిన తీరును పరిశీలిస్తే.. ఇలా మొదలైంది.. పట్టణంలోని 28 వార్డుల లోను ఎలాంటి జాప్యం లేకుండా ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. అయితే ఉదయం మందగొండిగా ఉదయం 9 గంటల వరకు కేవలం 11.84 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు 65.28% ఓట్ల శాతం 34,843 పోలైన ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పోలింగ్ లో మొత్తం 76.24 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారిని కమిషనర్ సునీతా రెడ్డి మీడియాకు తెలిపారు. పలుచోట్ల జనం క్యూలో నిలబడి ఓట్లు వేయడం కనిపించింది. మొత్తం 28 వార్డులకు 92 మంది అభ్యర్థులు ఉండగా ఎన్నికల నిర్వహణలో 380 మంది సిబ్బంది, 200 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. తర్వాత ఓటర్ల రావడానికి నిలిపివేసి 5 గంటలకు అక్కడికి చేరిన ఓటర్లకు మాత్రం ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో కొంతమంది ఆలస్యంగా రావడం వల్ల తమ ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారు. వార్డుల వారిగా పోలింగ్ శాతం.. ఒకటో వార్డులో 81.30 శాతం, రెండో వార్డులో 78.17, మూడో వార్డులో 80.56, నాలుగో వార్డులో 73.78, ఐదో వార్డులో 75.13. ఆరో వార్డులో 72.16, ఏడవవార్డులో 75.94, ఎనిమిదో వార్డులో 77.20, 9వ వార్డులో 79.45, పదవ వార్డులో 72.70, 11వ వార్డులో 82.23, 12 వ వార్డులో 81.25, 13 వార్డులో 80.35, 14 వ వార్డులో 81.46, 15 వార్డులో 79.26, 16వ వార్డులో 74.94, 17వ వార్డులో 77.41, 18 వ వార్డులో 70.38, 19 వార్డులో 80.92, 20 వార్డులో 73.65, 21వ వార్డులో 73.9, 22 వార్డులో 79.35, 23వ వార్డులో 76.33, 24 వ వార్డులో 66.53, 25వ వార్డులో 69.42, 26వ వార్డులో 72.07, 27 వార్డులో 74.74, 28వ వార్డులో 70.83 మొత్తం 76.204 శాతం పోలింగ్ నమోదయింది. అతి తక్కువ 24 వ వార్డులో 66.53 ఓట్ల శాతం నమోదయింది. అత్యధికంగా 82.23% నమోదయింది. వివాదాల పరంపర.. కొన్ని వార్డుల్లో పార్టీ నాయకులు, అభ్యర్థుల వివాదాలు పోలీసులకు సవాలుగా మారాయి. పట్టణంలోని 9, 10, 15 వార్డుల్లో చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. అలాగే 9, 16 వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం చెలరేగింది. ఇద్దరు మహిళల ఓట్లు ఇతరులు వేసి వెళ్లిపోవడంతో వాస్తవ ఓటర్లు వచ్చి ఎన్నికల కేంద్రం వద్ద ఆవేదనతో వెనుతిరిగారు.9, 10, 15 వార్డుల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య వివాదం జరిగింది.అయితే పోలీసులు సమయానుకూలంగా అప్రమత్తమై ఉద్రిక్త వాతావరణం ఏర్పడకుండా నిరోధించారు. పట్టణంలోని పదవ వార్డులో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణ మీద కాంగ్రెస్ నాయకుడు జమ్రుద్ ఖాన్, బీఆర్ఎస్ నాయకుడు పిల్లి శేఖర్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. పోలీసులు అప్రమత్తం కావడంతో గుంపును చెదరగొట్టి వివాదం పెరగకుండా అడ్డుకోగలిగారు. ఇక 15వ వార్డులోనూ కాంగ్రెస్– బీఆర్ఎస్ నాయకుల మధ్య వివాదం జరిగింది. కాంగ్రెస్ దౌర్జన్యం చేస్తుందని బిఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్ దౌర్జన్యానికి పాల్పడుతుందని కాంగ్రెస్ నాయకులు పరస్పరం ఆరోపించుకున్నారు. ఇక్కడ కూడా పోలీసుల చొరవతో గొడవ సద్దుమణిగింది. ఇక ఎన్నికల చివరి దశలో 9వ వార్డులో బిజెపి నాయకులు దొంగ ఓట్లు వేయిస్తున్నారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం వివాదానికి తెరతీసింది. ఏసీపి లక్ష్మీనారాయణ రంగంలోకి దిగి గొడవ పెరగకుండా అడ్డుకున్నారు. అదేవిధంగా 27 వ వార్డులో ఉత్తర ప్రదేశ్ కు చెందిన మహిళపై బిజెపి అభ్యర్థి మంగ విజయ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడనే ఆరోపణలు వచ్చాయి. సిపి సుధీర్ బాబు పర్యటన.. ఫరూక్ నగర్ మండల కేంద్రంలో రెండు వార్డులను సైబరాబాద్ సిపి సుధీర్ బాబు డిసిపి శిరీషతో కలిసి సందర్శించారు. వార్డులలో ఎన్నికల సర్వే ఎలా జరుగుతుంది అన్నది ఆయన తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఎన్నికల విషయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పు అని హెచ్చరించారు. అదేవిధంగా ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ విజయ్ కుమారులు ప్రతి వార్డు తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది కూడా నిర్విరామంగా ఎన్నికల విధుల్లో పాల్గొని ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించారు. దొంగ ఓట్ల కలకలం.. కొన్ని వార్డుల్లో దొంగ ఓట్ల కలకలం ఆందోళన లేపింది. ఇంతకుముందు చెప్పుకున్నట్లు 9వ వార్డులో ఇదే అంశంపై వివాదం చోటు చేసుకోగా 8వ వార్డులో పోలీసు కూతురు చందనకు తొలిసారి ఓటు వేసే అవకాశం లేకుండా ఎవరో దొంగ ఓటు వేసి వెళ్లడం ఆందోళనకు దారితీసింది. అదేవిధంగా పదో వార్డు లో కూడా కొంతమంది దొంగ ఓట్లు వేసినట్లు ఆయా పార్టీల నాయకులు ఆరోపించారు. మొత్తానికి ఎన్ని వివాదాలు ఉన్నప్పటికీ ఎన్నికలు మాత్రం ప్రశాంతంగా ముగిసి అటు పోలీసులను, ఇటు అధికారులను ఊపిరి పీల్చుకునేలా చేశాయి. ఏం జరుగుతుందక్కడ.. నాకు తెలియాలి.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మున్సిపాలిటీలో తన ఓటు లేకపోవడంతో ఎక్కడ కూడా ఆయన ఎన్నికలు జరిగే చోటికి రాలేదు. అయితే తన పార్టీ కార్యాలయంలో కూర్చుని ఎప్పటికప్పుడు ఏ వార్డులో ఓటింగ్ సరళి ఎలా ఉంది. తమ పార్టీకి ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నాయా.. ఏదైనా వివాదాలు జరుగుతున్నాయా.. ఓట్ల వ్యవహారం ప్రశాంతంగా ఉందా లేదా.. అన్న వివరాలను నాయకులు, కార్యకర్తల ద్వారా తెలుసుకున్నారు.



# మళ్లీ అధికారంలోకి వస్తాం

**కోదాడ, ఫిబ్రవరి 11(వుదయం):**

తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టేది ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సందేహానికి తావు లేదని, యావత్ తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీ వైపే నిలుస్తోందని తెలిపారు.పురపాలక సంఘం ఎన్నికల సందర్భంగా కోదాడ పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డు 34వ పోలింగ్ బూత్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఈ ఎన్నికల్లో గేమ్ చెంజర్‌గా మారిందన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే అద్భుతంగా నిరుపేదలకు ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్న ప్రభుత్వం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేదల కళ్లలో వెలుగులు నిండాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారని, అందుకే పురపాలక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం కనిపిస్తున్న ఎన్నికల ట్రెండ్ కూడా అదే సంకేతాలు ఇస్తోందన్నారు.ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వసనీయత పెరిగిందని, ఈ ఎన్నికల ఫలితాలు ఆ నమ్మకాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమనే నమ్మకం బలపడిందని, మరో ఎనిమిది సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించేది కాంగ్రెస్ పార్టీయేనని పునరుద్ఘాటించారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు లాభం చేకూరలేదని, అందుకే విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

**ప్రపంచంలోనే మేటి నగరాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు**
**2047 కల్లా త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యం**
**మధిరలో ఓటు వేసిన అనంతరం మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**మధిర ఫిబ్రవరి 11, వుదయం ప్రతినిధి:**

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాస్వామ్య పండుగ లో విజ్ఞులైన తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర పట్టణంలోని తొమ్మిదవ వార్డులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు.ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయి ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు ఫ్యూచర్ సిటీ కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రికల్చర్ ఎకానమీ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. మిశ్రమలు విద్య వైద్యం మౌలిక వసతుల మేలు కలయిక ఈ ప్రణాళికలో ఉంటుందని తెలిపారు.ఎయిర్ ఇండెక్స్ సూచిక 250 దాటుతుంది ఢిల్లీ కలకత్తా వంటి నగరాల్లో నివసించడమే కష్టం అవుతుంది ఈ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గాలి నాణ్యతను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.రిజిస్ట్రేషన్లలో ఆదాయం కోల్పోతున్నప్పటికీ బ్యాటరీ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. పట్టణాల్లో మురుగునీటి శుద్ధం చేసేందుకు పెద్ద సంఖ్యలో ఎస్టీపీలను నిర్మాణం చేస్తున్నామన్నారు. చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు,చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఉత్పత్తి ప్రధానమైన విద్యుత్తు సరఫరాలో రెప్పపాటు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, పేద కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు 200 యూనిట్ల వరకు విద్యుత్తు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.



మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని, గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోనే ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కేంద్రాల్లో దేశంలోని ప్రముఖ లెక్చరర్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తామని అన్నారు.స్కిల్స్ ఉంటేనే ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయి అందుకే నియోజకవర్గ కేంద్రాల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు నెలకొల్పామని తెలిపారు.పేద బిడ్డలకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్ లో విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఒక్కో పాఠశాలను 25 ఎకరాల్లో 200 కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో నిర్మిస్తున్నామని అన్నారు.ఇల్లు లేని పేదలకు 5 లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

# ఆర్చరీలో పట్వారీగూడెం యువతి సంచలనం

- **సీఎం కప్‌లో లోహిత శ్రీకి స్వర్ణం**
- **శుభాకాంక్షలు తెలిపిన మాజీ జెడ్పీటీసీ పైడి**

**దమ్మపేట ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి):**



పాల్వంచ వేదికగా జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ ఆర్చరీ పోటీల్లో దమ్మపేట మండలం పట్వారీగూడెం గ్రామానికి చెందిన కనకం లోహిత శ్రీ అద్భుత విజయాన్ని సాధించారు. మహిళల రికర్వ్ విభాగంలో తన గురి తప్పని అస్త్రాలతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి ఆమె బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన లోహిత శ్రీ, క్రమశిక్షణతో కూడిన సాధనతో జిల్లా స్థాయి పోటీల్లో అగ్రస్థానంలో నిలవడం పట్ల దమ్మపేట మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు కోయ్యల అచ్యుతరావు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పట్వారీగూడెం గ్రామం పేరును జిల్లా స్థాయిలో నిలబెట్టిన లోహిత శ్రీని పలువురు ప్రముఖులు అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించాలని గ్రామస్తులు క్రీడాకారులు కోరుకుంటున్నారు.



# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, ఫిబ్రవరి 11 (వుదయం):-**

కామారెడ్డి మున్సిపాలిటీలోని వార్డు నెంబర్ 18 లిమ్రా గార్డెన్ సమీపంలో గల ప్రైమరీ స్కూల్, పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయం పీఎస్ నం.55 పోలింగ్ కేంద్రములో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 17 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.



# పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కమిషనర్

**వరంగల్ క్రైమ్, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బుధవారం ఎన్నికలు జరుగుతుండడంతో, వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో ఎన్నికలు జరుగుతున్న రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు ఘన్పూర్ మున్సిపల్ సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు, ఎన్నికలను సజావుగా జరిగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో సంబంధిత పోలింగ్ స్టేషన్ ఇంచార్జ్ అయిన పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, ఏసీపీలు నర్సయ్య, భీం శర్మతో పాటు ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ లు వున్నారు.

**పోలీస్ కమిషనర్ ను ఆకర్షించిన హరిత పోలింగ్ కేంద్రం**

మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రాన్ని, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సందర్శించారు. హరిత పోలింగ్ కేంద్రాన్ని అలంకరించిన తీరును పరిశీలించిన పోలీస్ కమిషనర్ ఆనందం వ్యక్తం చేస్తూ, పెండ్లి పందిరి మాదిరిగా అలంకరించినట్లుగా వుందని..తెలిపి హరిత పోలింగ్ కేంద్రం వద్ద ఇతర పోలీస్ అధికారులతో కలసి ఫోటో దిగారు.

# 'మెగా హెల్త్ క్యాంప్' విజయవంతం



## రోబోటిక్ టెక్నాలజీతో వైద్య సేవలు

**సికింద్రాబాద్, (వుదయం) :**

న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారుల కోసం సికింద్రాబాద్ సిటీ సివిల్, క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన 'మెగా హెల్త్ క్యాంప్' విజయవంతం ముగిసింది. సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ (ఎస్బీఏ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమన్వయంతో ప్రముఖ జర్మంటెన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చేపట్టిన వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని 12వ అదనపు ప్రధాన న్యాయమూర్తి షౌకత్ జహాన్ సిద్ధిక్, 6 వ అదనపు సెషన్స్ న్యాయమూర్తి జి.వేణు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. హాస్పిటల్ జనరల్ మేనేజర్ రోషన్ అలీ ఆధ్వర్యంలో వైద్య బృందం రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా జర్మంటెన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మీర్ జవాద్ జర్ ఖాన్ మాట్లాడుతూ.. తెలంగాణలోనే మొదటిసారిగా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలలో జర్మన్ ప్రెసిషన్ రోబోటిక్ టెక్నాలజీని ప్రవేశపెట్టిన ఘనత తమ హాస్పిటల్‌కే దక్కుతుందన్నారు. జర్మన్ డాక్టర్ల మార్గదర్శకత్వంలో హైటెక్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలను హైదరాబాద్‌లో అందిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్బీఏ అధ్యక్షుడు జి. రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎన్. జనార్దన్‌రెడ్డి, క్యాంప్ కోఆర్డినేటర్ మాజిద్ హుస్సేన్ పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



**కామారెడ్డి, ఫిబ్రవరి 11 (వుదయం):-**

2 వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎల్లారెడ్డి మున్సిపాలిటీ లో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, జిల్లాలో పోలింగ్ 100 శాతం నమోదు కావాలని ఆకాంక్షించారు.

# పేద ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం



- **ఎమ్మెల్యే నాయిని**
- **రూ. 1.59 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కార్పొరేటర్ మామిండ్ల రాజు**

**హనుమకొండ, ఫిబ్రవరి 11 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా కొండంత అండగా నిలుస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ గోకుల్ నగర్ లోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం హనుమకొండ మరియు కాజీపేట మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొత్తం 159 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 1,59,18,444 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఆడబిడ్డల వివాహాల కోసం తల్లిదండ్రులు అప్పుల పాలు కాకూడదన్నదే ప్రభుత్వ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. గతంలో పెళ్లిళ్లు చేయాలంటే పేదలు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా ఆర్థిక సాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.అనంతరం లబ్ధిదారులతో ముచ్చటించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

- **TMSRU ఆదిలాబాద్ శాఖ పిలుపు**
- **కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు లో భాగంగా February 12 దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ని విజయవంతం చేయాలి, తెలంగాణా మెడికల్ & సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్(TMSRU ) ఆదిలాబాద్ శాఖ**

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 10 (వుదయం) :**

తెలంగాణా మెడికల్ & సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్(TMSRU )..... ఆదిలాబాద్ శాఖ కార్యదర్శి..... తోకల శ్రీకాంత్ జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న మెడికల్ & సేల్స్ రిప్రజెంటేటివ్స్ ని ఉద్దేశించి మాట్లాడుతూ, మన యూనియన్లైన FMRAI, TMSRU ఔషధాల పై సున్నా శాతం GST కోసం గత కొన్ని సంవత్సరాలుగా చేసిన పోరాటం తో ప్రభుత్వం కొన్ని అవసరమైన మందులపై GSTను 5 శాతానికి తగ్గించిందని ఇది గత సంవత్సరం మనం సాధించిన అద్భుతమైన విజయమని తెలిపారు . అయినప్పటికీ, మందులు మరియు వైద్య పరికరాలపై పన్నుల భారాన్ని పూర్తిగా తొలగించే వరకు మన పోరాటం కొనసాగాలని.అలాగే ఔషదాల ధరలని మార్కెట్ ధరలతో కాకుండా ఉత్పత్తి ధర ఆధారంగా నిర్ణయిస్తే ప్రజలకు ఔషాదాలు అందుబాటు ధరలో దొరుకుతాయని తెలిపారు, అలాగే ఆన్లైన్లో ఔషాదాలు అమ్మడం వల్ల ప్రజలకు అనవసరమైన ఆరోగ్య సమస్యలు కలిగే అవకాశం ఉన్నందున ఆన్లైన్లో మందుల అమ్మకాన్ని పూర్తిగా నిషేదించాలని , ఔషద నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేసి, నకిలీ నాసిరకం మందులు తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలను కఠినంగా శిక్షించాలని కోరారు, అలాగే కొత్త నాలుగు కార్మిక కోడ్‌లు అమలు పరిచి కార్మికుల ఉద్యోగ భద్రతను తగ్గించడం, ట్రేడ్ యూనియన్లను బలహీనపరచడం, పని గంటలు పెంచడం లక్ష్యంగా ఉన్నాయి. "ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్" పేరుతో పూర్తిగా కార్మికుల ఉద్యోగ భద్రత ను కాలరాసి, ఎలాంటి హక్కులు లేకుండా బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం, అలాగే మెడికల్ & సేల్స్ రిప్రెజెంటేటివ్స్ ఎన్నో సంవత్సరాలు పోరాడి సాదించుకున్న "సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976" ని రద్దు చేసి మెడికల్ &సేల్స్ రిప్రెజెంటేటివ్స్ చట్టపరంగా ఉన్న రక్షణలని తొలగించింది, కావున ఈ క్రింది డిమాండ్ల తో ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మె లో దేశ వ్యాప్తంగా పనిచేస్తున్న మెడికల్ &



సేల్స్ రిప్రజెంటేటివ్స్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు

డిమాండ్లుకేంద్ర ప్రభుత్వానికి .

1. నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేసి, Sales Promotion Employees Act,1976 ను పునరుద్ధరించాలి
2. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు చట్ట బద్ధమైన పని విధానాలని రూపొందించాలి
3. కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేయాలి, వారి ఉద్యోగ హక్కును పరిరక్షించాలి

యాజమాన్యాలకు :

1. సేల్స్ పేరిట వేధింపులు, భయపెట్టే చర్యలు ఆపాలి
2. గాడ్జెట్ల ద్వారా నిఘా మరియు ట్రాకింగ్ చేసి ఉద్యోగుల గోప్యతకు భంగం కలిగించకూడదు ఫార్మా యాజమాన్యాలు సమ్మెలో పాల్గొంటున్న సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిడి, నిర్బంధం విధించకుండా స్వేచ్ఛగా తమ సమ్మె హక్కును వినియోగించుకునే స్వేచ్ఛను కల్పించాలని కోరుతూ, కేంద్ర ప్రభుత్వం, ఫార్మా యాజమాన్యాలు చొరవ తీసుకుని తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు

తోకల శ్రీకాంత్
శాఖ కార్యదర్శి
ఆదిలాబాద్
తెలంగాణ మెడికల్ & సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (TMSRU).



# ఎరువుల బుకింగ్ యాప్ రైతులకు వరం లాంటిది

- **సొసైటీ ఎరువుల పంపిణీ కేంద్రాలను సందర్శన. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ**

**ఖానాపురం, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి):**

రైతుల పంటల కష్టాలను తీర్చడానికి ఎరువుల బుకింగ్ యాప్ ను ప్రభుత్వం వ్యవసాయ శాఖ తీసుకురావడం రైతులకు వరం లాంటిదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే అనురాధ రైతులకు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ని ఎరువుల పంపిణీ కేంద్రాలను ఎరువుల యాప్ పని విధానాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ రైతులు ఉదయం పగలు రాత్రి తేడా లేకుండా ఎరువుల కేంద్రాల వద్ద చిన్నపిల్లలు వృద్ధులు లైన్లో గంటల తరబడి నిలబడే పని లేకుండా రైతుల కోసం ప్రభుత్వము ఎరువుల యాప్ ను తీసుకురావడం ద్వారా రైతులు గంటల తరబడి లైన్లో నిలబడే అవకాశం లేదని తెలుపుతూ, రైతులు ఇంటి వద్దనే ఉండి రైతుకు కావలసిన ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చని రైతులకు తెలుపుతూ, యాప్ ద్వారా రైతులకు కావలసిన ఎరువులను బుక్ చేసుకుంటే తక్షణమే ఆయా ఎరువుల పంపిణీ కేంద్రాల వద్దకు వెళ్లి ఎలాంటి లైన్ లేకుండా రైతు బుక్ చేస్తున్న ఎరువులను తీసుకోవచ్చునని రైతులకు తెలుపుతూ, ఈ యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు మేలు జరిగే విధంగా యాప్ ఉన్నదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్, సొసైటీ సీఈవో ఎల్లబోయిన ఆంజనేయులు, సిబ్బంది ఖడుగూరి వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో 5 మున్సి పాలిటీలలో ప్రశాంతంగా పోలింగ్

- **జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి) :**

జగిత్యాల మెట్ పెల్లి కోరుట్ల మున్సిపల్ కేంద్రంల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని 5 మున్సిపాలిటీలలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాటు చేసిన సదుపాయాలు పోలింగ్ సామగ్రి వినియోగం బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్ల పని తీరును సమీక్షించారు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో పోలింగ్ సజావుగా కొనసాగుతోందని తెలిపారు ఈ పరిశీలనలో స్పెషల్ ఆఫీసర్లు మున్సిపల్ కమిషనర్ లు తహసీల్దార్ లు ఎంపిడివో లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించిన మంత్రి పొన్నం

- **ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు కీలకం: మంత్రి పొన్నం ప్రభాకర్**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి ఫిబ్రవరి, 11:**

హుస్నాబాద్ నవ భారత్ హైస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్హుస్నాబాద్‌లోని నవ భారత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది ప్రతి పౌరుడి శక్తివంతమైన ఆయుధం. పోలింగ్ రోజు ప్రతి ఓటరు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి" అని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 90 శాతం ఓటర్లు ఓటు వేస్తున్నారని, అయితే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోని పట్టణ ఓటర్లందరికీ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు."గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తమ ప్రజా ప్రతినిధులను ఎంతో బాధ్యతతో ఎన్నుకుంటున్నారు. అదే విధంగా పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం కూడా అర్బన్ ఓటర్లు తమ విచక్షణతో ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి. ప్రజా ప్రతినిధులను జాగ్రత్తగా ఎన్నుకోవాలి" అని ఆయన అన్నారు."ఓటు వేయకపోతే ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం చేసినట్టుకాదు అనే నానుడి ఉంది. పట్టణాల్లో అనేక పనులు ఉన్నప్పటికీ కొంత సమయం కేటాయించి తప్పనిసరిగా ఓటు వేయాలి. అర్బన్ ప్రాంతాల్లో ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనం" అని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.





# వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియపై నిశిత పర్యవేక్షణ

◆ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, ఫిబ్రవరి 11 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

మునిసిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేటలలో ఏర్పాటు చేసిన మొత్తం 80 పోలింగ్ కేంద్రాల కార్యకలాపాలను, పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ కార్యాలయం తో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం కూడా నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండేలా సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు, సిబ్బంది నియామకం తదితర అంశాల్లో పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ సిపి గౌష్ ఆలం

◆ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు.

**కరీంనగర్, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి);**

కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా తీరుతెన్నులను స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యంగా క్రిటికల్ (సమస్యాత్మక) పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ, అక్కడ ఏర్పాటు చేసిన అదనపు బలగాల మోహరింపును తనిఖీ చేశారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వృద్ధులు మరియు దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు.నిఘా పటిష్టం: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిసి కెమెరాల నిఘా నిరంతరం ఉండాలని, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.విధుల్లో ఉన్న పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూనే, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సీపీ వెంట ట్రైనీ ఐపిఎస్ సోహం, పలువురు ఉన్నతాధికారులు మరియు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన బందోబస్తు కొనసాగుతుందని, ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందకుండా ఓటు వేయాలని సీపీ గౌష్ ఆలం పిలుపునిచ్చారు.



# దివ్యాంగులను, వయోవృద్ధుల ఓటర్లను సన్మానించిన జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి / ఫిబ్రవరి 11 వుదయం జిల్లా ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం 6 మున్సిపాలిటీలలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో బాగంగా జిల్లా కలెక్టర్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం లో, భువనగిరి బీచ్ మహల్ లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని కొత్త గుండ్లపల్లి లో, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు విశేష ఉత్సాహంతో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రాల్లో పచ్చని మొక్కలు, పూల అలంకరణ, కొబ్బరి తోరణాలు, ప్లాస్టిక్ రహిత సామాగ్రి, పర్యావరణహిత అలంకరణతో ఓటర్లకు మైమరిపించే అనుభూతిని కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. శాం



తియుతంగా, పారదర్శకంగా మరియు ఎన్నికల నియమావళి ప్రకారం కొనసాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, ర్యాంపులు, వీల్‌చైర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతోందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని, ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. నూతన ఓటర్లకు స్వాగతం పలుకుతూ, దివ్యాంగులను, వయోవృద్ధుల ఓటర్లను జిల్లా కలెక్టర్ హనుమంతరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటర్లలో పర్యావరణపై చైతన్యం కల్పించాలి

**వర్ధన్నపేట/నర్సంపేట, ఫిబ్రవరి 11(వుదయం ప్రతినిధి) :**

మునిసిపల్ ఎన్నికలను ప్రజాస్వామ్యానికి పచ్చని పండుగగా మార్చాలనే లక్ష్యంతో వరంగల్ జిల్లా పరిపాలన వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. పోలింగ్ శాతాన్ని పెంచడం తో పాటు ఓటర్లలో పర్యావరణ చైతన్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన హరిత, పర్యావరణ హిత పోలింగ్ స్టేషన్లను బుధవారం వర్ధన్నపేట, నర్సంపేట పట్టణాలలో కలెక్టర్ స్వయంగా సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు హరిత పోలింగ్ కేంద్రాలు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ విధానం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్ అంశాలతో ప్రత్యేక పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.నర్సంపేట పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన హరిత పోలింగ్ కేంద్రం పచ్చదనం, పరిశుభ్రత, పర్యావరణహిత అలంకరణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ రీసైక్లింగ్ అంశంతో రూపొందించిన ప్రత్యేక స్టేషన్‌లో అనవసర బొర్లు, సంచులు ఓటర్లను ఆలోచింపజేశాయి. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని, ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ల వద్ద ప్రజాస్వామ్య క్షణాలను స్మరించుకున్నారు. ఓటు వేసిన ప్రతి ఓటరికి కలెక్టర్ పెన్‌తో పాటు "ఓటు" రిస్ట్ బ్యాండ్ అందించడం విశేషంగా నిలిచింది.నర్సంపేట పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు హరిత పోలింగ్ స్టేషన్, బొందబడి ప్రభుత్వ పాఠశాలలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్రత్యేక పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిత్యావసర వస్తువుల తయారీ



ప్రదర్శనలు ఏర్పాటు చేసి, పునర్వినియోగ ప్రాధాన్యతను చాటి చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరాన్ని వివరించే సందేశాలు ప్రజల్లో చైతన్యం రేకెత్తించాయి.ఈ ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా ఓటింగ్ ప్రక్రియను మరింత ఆహ్లాదకరంగా, బాధ్యతాయుతంగా మార్చడమే కాకుండా పోలింగ్ శాతాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. "ప్రతి ఓటు ప్రజాస్వామ్యానికి బలమైన పునాది. ఓటు వేయడం మన హక్కు మాత్రమే కాదు, మన భవిష్యత్తు పట్ల మన బాధ్యత కూడా" అని ఆమె అన్నారు. ఈ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని కలెక్టర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అదనపు కలెక్టర్ సంధ్యారాణి,జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవోలు సుమ, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు భాగ్యలక్ష్మి, పుష్పలత, తహశీల్దార్లు విజయ్, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ

**కామారెడ్డి, ఫిబ్రవరి 11 (వుదయం):-**

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీలలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రలు సందర్శించి పరిశీలించారు.

**జిల్లాలో ఉదయం నుంచి ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల పోలింగ్**

కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీల పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైందని, పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మహిళలు, వృద్ధులు, యువత ఉత్సాహంగా పోలింగ్ లో పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ర్యాంపులు, వీల్‌చైర్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించామని , పోలింగ్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగుతోందని, పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 .00 గంటల వరకు కొనసాగిందన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ సమీప పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు.బాన్సువాడలో 19 వార్డులు, 39 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ ప్రక్రియ సజావుగా ప్రశాంతంగా కొనసాగిందని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలలో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.



ఈ సందర్భంగా ఎల్లారెడ్డి, బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ లలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు.

# జిల్లాలో ప్రశాంతంగా కొనసాగిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల/ రామకృష్ణాపూర్ ,ఫిబ్రవరి 11/2026(వుదయం ప్రతినిధి):**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా మున్సిపాలిటీలలో కొనసాగుతున్న ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని రామకృష్ణాపూర్ ప్రాంతంలో గల అల్ఫోన్జా ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టడం జరిగిందని, ఈ క్రమంలో అర్హులైన ఓటర్లు నిర్ణీత సమయంలోగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా బూత్ స్థాయి ఏజెంట్లు కృషి చేయాలని సూచించారు. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం గేటు మూసివేసి, లోపల ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా



వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు అవసరమైన త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో ప్రశాంతంగా పోలింగ్

**ధర్మపురిలో కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలన**

**ధర్మపురి, ఫిబ్రవరి 11 (వు దయం ప్రతినిధి):**

ధర్మపురి మున్సిపాలిటీ లో బుధవారం పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ధర్మపురి మున్సిపల్ కేంద్రంలో జరుగుతున్న పోలింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ స్వయంగా పరిశీలించారు.పోలింగ్ కేంద్రా లను సందర్శించిన కలెక్టర్, ఏర్పాటు చేసిన సదుపాయాలు, పోలింగ్ సామగ్రి వినియోగం, బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూనిట్ల పనితీరును సమీక్షిం చారు. పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణపై వివరాలు తెలుసు కుని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచిం చారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా నిర్వహించాలని, వృద్ధు



లు,దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ఆదేశిం చారు.భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో చర్చించి, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసా గుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు.ఓటర్ల గుర్తింపు ధృవీకరణ ప్రక్రియ,సీసీ కెమెరాల పర్యవేక్షణ, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికా రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.ధర్మపురిలో పోలింగ్ సజావుగా కొనసాగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివా సరావు,తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఓటేసిన కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో జగ్గు తండ ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మన గళాన్ని వినిపించడానికి ఓటు హక్కు శక్తివంతమైన సాధనం అని అన్నారు. వృద్ధులు వికలాంగులు ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్ల కోసం వీల్‌చైర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని వర్గాల ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చివరి నిమిషం వరకు వేచి చూడకుండా త్వరితగతిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్

◆ బి.యం.సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి):**

గద్వాల మున్సిపాలిటీలోని వార్డు నెంబర్ 03 పిజెపి కాలనీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రములో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా ఓటు వేయాలని స్థానిక సుపరిపాలనలో భాగస్వాములు కావాలని అన్నారు. ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ర్యాంప్స్ నిర్మించడమే కాక వీల్ చైర్స్ ను అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 17 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి పోలింగ్ స్టేషన్ లో



అక్కడి అధికారులకు చూయించి ఓటర్లు తమ ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

# అసమాన వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలి

◆ అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము



**దమ్మపేట ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి):**

భారత్ అమెరికాల మధ్య జరిగిన అసంబద్ధ ఒడం బడికను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్ అమెరికాల మధ్య జరిగిన ఈ ఒప్పందాన్ని నిరసిస్తూ ఫిబ్రవరి 12న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె దమ్మపేట మండల కేంద్రంలో జరిగే సార్వత్రిక సమ్మెకు అఖిలభారత ఐక్య రైతు సంఘం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నదని తెలియజేశారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ట్రంప్ ఆంక్షలకు లొంగి " భారత్ అమెరికాల మధ్య అసంబద్ధ వడంబడికపై సంతకం" చేశారు. ఈ ఒప్పందం మీద సంతకం చేయడం అంటే, భారతదేశ సార్వభౌమాధికారాన్ని అమెరికాకు తాకట్టు పెట్టడమే అన్నారు. ఈ ఒప్పందాల వల్ల భారత ప్రజలకు భారత రైతాంగానికి పాడి పరిశ్రమకు, బీమా సంస్థలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. భారతదేశంలోని చిరు వ్యాపారులు రైతులు విపరీతమైన నష్టాలకు చవిచూడవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. బీమా రంగంలో ప్రైవేటు వాళ్లకు 100% అనుమతించడం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఈ ఒప్పందాలు రద్దయ్యేంతవరకు పార్టీ ఆధ్వర్యంలో అన్ని రకాల ప్రజాసంఘాలను ఐక్యం చేసుకొని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన తెలియజేసినారు.

# ఆదిలాబాద్ మున్సిపల్ పీఠంపై ఎగురబోయేది కేసరి జెండానే



◆ ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 10 (వుదయం) :**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులు, ఉత్సాహాన్ని గమనిస్తే భారతీయ జనతా పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు అందిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి కానుకగా ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ పదవిని బీజేపీ గెలుచుకుంటుందని ప్రజలు నమ్మకంతో ఉన్నారని తెలిపారు.అదేవిధంగా, ఆదిలాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగాలంటే బీజేపీ పాలన మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి ఓటు వేసి అభివృద్ధి బాటలో అడుగులు వేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు పిలుపునిచ్చారు.

# ఓటర్ల ఉత్సాహం జోరు

**సాయంత్రం 5 వరకు 75.16% పోలింగ్**

**ధర్మపురి ఫిబ్రవరి11 (వు దయం ప్రతినిధి):**

ధర్మపురిలో పోలింగ్ ఉత్సాహంగా కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 75.16 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడిం చారు.ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలి రావ డంతో పలుచోట్ల క్యూలు కనిపించా యి.మొత్తం నమోదైన ఓట్లలో పురుషులు 4,827,మహిళలు 5,721,ఇతరులు 1మొత్తం.10,549 అని అధికారులు తెలిపారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొ



నడం విశేషం. పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదవడం గమనార్హం.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచే సుకోలేదని పోలీసులు తెలిపారు. సాయంత్రం చివరి గంటల్లో మరింత మంది ఓటర్లు ఓటుహక్కు విని యోగించుకున్నారు.

# జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 73.33%పోలింగ్ నమోదు

◆ పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉన్న ప్రతి ఓటరికి అవకాశం

◆ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 11 (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 73.33 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని మూడు అర్బన్ లోకల్ బాడీల పరిధిలో మొత్తం 106 వార్డులు, 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 1,85,348 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 88,738 మంది, మహిళలు 96,572 మంది, ఇతరులు 38 మంది ఉన్నట్లు వివరించారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 1,35,910 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.అశ్వరావుపేట మున్సిపాలిటీలో మొత్తం 16,850 మంది ఓటర్లలో 12,839 మంది 76.20% ఓటు హక్కు వినియోగించుకోగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 99,992 మంది 74.19% ఓటు వేశారు. ఇల్లందు



మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,079 మంది 68.44% ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.పోలింగ్ సమయం సాయంత్రం 5 గంటలకు ముగిసినప్పటికీ, అప్పటికే పోలింగ్ కేంద్రాల లోపల క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

పోలింగ్ ప్రక్రియ పూర్తైన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సంబంధిత స్ట్రాంగ్ రూములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద తగిన భద్రతా సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు.

వుదయం


# మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో పోలింగ్ కేంద్రాల సందర్శన

## భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష




ఈ రోజు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధి లోని టీచర్స్ కాలనీ బ్రిలియంట్ స్కూల్, ఠాగూర్ స్కూల్, గాంధీ రోడ్ స్కూల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలు, సిబ్బంది విధులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, క్యూలైన్ నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అక్కడి అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన సూచనలు చేశారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపారు. సీఐలు, డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులు, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు విధులు నిర్వర్తిస్తూ పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా రూట్ మొబైల్ బృందాలు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాంతి భద్రతలను కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తున్నాయని వివరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయ్యే వరకు పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉంటారని తెలిపారు.

# అర్వపల్లి అఖిల నాగ రమ్య, CMA లో ఘన విజయం

**ఖమ్మం, వుదయం**



ఖమ్మం నగరానికి చెందిన అర్వపల్లి అఖిల నాగ రమ్య గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్‌లో సిఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్మెంట్ అకౌంటెంట్) కోర్సును పూర్తి స్థాయిలో విజయవంతంగా ఉత్తీర్ణతతో సాధించారు. నిరంతర శ్రమ, క్రమశిక్షణతో కూడిన చదువు ఆమెను ఈ ఉన్నత విజయానికి చేర్చిందని ఉపాధ్యాయులు ప్రశంసించారు.అఖిల నాగ రమ్య 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మామిళ్ళగూడెం లోని మాంటిస్సోరి హైస్కూల్ లో విద్యనభ్యసించి, టెన్త్‌లో 9.5 జి.పి.ఎ సాధించారు. సాహితి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌లలో కాలేజ్ టాపర్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు.ఆమె తల్లిదండ్రులు అర్వపల్లి నాగేష్, శ్రీలక్ష్మి స్థానికంగా చిన్న కిరాణా వ్యాపారం నిర్వహిస్తూ కుమార్తె చదువుకు అన్ని విధాలుగా వారి సంపూర్ణ సహకారం అందిం చారు. చెల్లెలు యువ నాగశ్రీ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్థానికులు, అలాగే ఆమె చిన్ననాటి స్నేహితురాలు షేక్ తబస్సుమ్ అఖిల నాగ రమ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# చెల్లిని కత్తితో బెదిరించి లైంగిక దాడి చేసిన అన్న సొంత పెదనాన్న కూతురిపై అన్న అత్యాచారం

**తుంగతుర్తి(శాలిగౌరారం), వుదయం:**

*గంజాయి మత్తులో అఘాయిత్యానికి పాల్పడ్డ యువకునిపై ఫోక్సో, గంజాయి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల డిమాండ్*




సభ్యసమాజం తలదించుకునేలా 14 సంవత్సరాల మైనర్ బాలికల పై అదే గ్రామానికి చెందిన సొంత బాబాయ్ కుమారుడు అత్యాచారం చేసిన సంఘటన నల్గొండ జిల్లా, శాలిగౌరారం మండల పరిధిలోని అడ్లూరు గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత బాలిక తల్లితండ్రులు చెప్పిన వివరాల ప్రకారం అడ్లూరు గ్రామానికి చెందిన కడమంచి వెంకన్న -లక్ష్మీ కూతురుపై గత నెల 20 తేదీన మధ్యాహ్నం సమయంలో సొంత బాబాయ్ కుమారుడు వరసకు అన్న అయ్యే యువకుడు బలవంతంగా అత్యాచారం చేసాడు.దీంతో ఆ బాలిక తమ అమ్మా నాన్నకు చెప్పింది. ఈ విషయం విన్న బాలిక తల్లిదండ్రులు వెంటనే పెద్దమనుషులకు తెలుపగా వారు ఇరువురి కుటుంబాలను పిలిపించి ఇప్పటి నుండి ఎవరి జోలికి ఎవరు పోకూడదని పెద్ద మనుషులు తీర్మానం చేశారని సమాచారం. తదనంతరం ఆ యువకుడు నుండి బాలికకు హాని ఉందనే భయంతో ఆ బాలికను తమకు తెలిసిన చుట్టాల ఊరు ఖమ్మం కు పంపించారు. సోమవారం రోజు ఆ బాలికను అడ్లూరు గ్రామానికి తీసుకొచ్చారు. ఆ విషయం గమనించిన ఆ యువకుడు అదే రోజు రాత్రి ఆబాలిక ఇంటికి వెళ్లి తన వెంట బాలికను రమ్మని,లేనిచో అందరిని చంపుతానని కత్తులతో హల్చల్ చేసాడని సమాచారం. మంగళవారం బాలిక తల్లిదండ్రులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...సొంత తమ్ముని కుమారుడు నా కుమార్తెను భయభ్రాంతులకు గురిచేసి నా కూతుర్ని అత్యాచారం చేసి ఆమె భవిష్యత్తుని నాశనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# మున్సిపల్ ఎలక్షన్ సరళి, పోలీసు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**కామారెడ్డి, వుదయం:**



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడలోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని అక్కడ భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఆయన కామారెడ్డి పట్టణం లోని డ్రైవర్స్ కాలనీ, హరిజనవాడ, గొల్లవాడ, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్, ఎంపీపీఎస్ ఆర్‌బీ నగర్, జడ్పీహెచ్ఎస్ హై స్కూల్–దేవునిపల్లి, ఎంపీపీఎస్ ఎన్జీవోస్ కాలనీ, లింగాపూర్ జడ్పీహెచ్ఎస్, పంచముఖి హనుమాన్ ఎంయూపీఎస్ వంటి కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎల్లారెడ్డి, బాన్సువాడలోని పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ సెంటర్‌లను పరిశీలించడం జరిగింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసుల పటిష్ట బందోబస్తు ఉన్నది. పోలింగ్ కేంద్రాల పరిధిలో 163 BNS (144 సెక్షన్) అమలులో ఉందని, ఐదుగురికి పైగా గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధించబడిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రత్యేక పోలీస్ నిఘా కొనసాగుతుందని ఎస్పీ తెలి పారు. ప్రతి సిబ్బంది ఓటర్లతో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ, సమర్థంగా వ్యవహరించాలి అని సూచించారు. ఎస్పీ చట్ట ఉల్లంఘనలకు, బెదిరింపులు, ప్రలోభాలు లేదా గందరగోళం సృష్టించే ప్రయత్నాలకు ఎలాంటి తావు లేదని, అవసరమైతే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టంగా తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఓటర్లను భయభ్రాంతుల్లేని, స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించడానికి ప్రోత్సహిస్తూ, పోలీస్ శాఖ పూర్తి స్థాయి భద్రతను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహ కారం అందిస్తూ, ప్రజాస్వామ్య పండుగను ప్రశాంతంగా, గౌరవప్రదంగా ముగించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి అడ్మిన్ కె.నర్సింహారెడ్డి, ఏఎస్పీ బి.చైతన్యరెడ్డి, కామారెడ్డి పట్టణ సీఐ నరహరి, రూరల్ సీఐ రామన్, ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌హెచ్ఓ మహేష్, బాన్సువాడ ఎస్‌హెచ్ఓ శ్రీధర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాట్సాప్ లో మతం పేరుతో ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



మతాన్ని అడ్డుకు పెట్టుకుని ఓటును ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నం. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు. వన్ టౌన్ సీఐ బి సునీల్ కుమార్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మతాన్ని అడ్డుగా పెట్టుకుని ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వాట్సాప్‌లో వివాదాస్పద ప్రచారం చేస్తున్న వ్యక్తిపై ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు.ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చంద్రశేఖర్ @ చందు అనే వ్యక్తి "హుండీలలో విరాళాలు వేయడం వల్ల హిందూ మతం రక్షించబడదు, బ్యాలెట్ బాక్స్ నందు హిందువు ఓటు వేయడం ద్వారా రక్షించబడుతుంది" అనే సందేశాన్ని వాట్సాప్‌లో ప్రసారం చేస్తూ మతం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఎన్నికల సమయంలో మతం, కులం పేరుతో ఓటర్లను ప్రలోభపెట్టడం లేదా రెచ్చగొట్టే ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు సోషల్ మీడియాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# ముఖ్యమంత్రిని దూషిస్తూ వీడియోలు పోస్ట్ చేసిన వ్యక్తి అరెస్ట్

**వెల్దండ, వుదయం**

ఈనెల 9 న వాట్సప్ గ్రూపులలో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారిని ఉద్దేశిస్తూ ఒక వ్యక్తి అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ వీడియోలను పోస్ట్ చేయడం జరిగింది. అట్టి వ్యక్తిపై కేసు నమోదు చేసి బుధవారం అతనిని కల్వకుర్తి కోర్టు లో హాజరుపరచగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా పోలీసువారి హెచ్చరిక ఎవరైనా ఎదుటి వ్యక్తులను అవమానపరిచే విధంగా గాని కించపరిచే విధంగా గాని వీడియోలను గాని లేదా పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లయితే అట్టి వ్యక్తుల పైన కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ హెచ్చరించారు.

# పోలింగ్ సరళిని పరిశీలించిన ఏఆర్ డిఎస్పీ:శ్రీనివాస్

**చండూరు, వుదయం:**



నల్గొండ జిల్లా చండూరు పురపాలకలో జరుగుతున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఇన్‌ఛార్జ్ డీఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కుల పనితీరును పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఆయన వెంట చండూరు ఎస్సై శివకుమార్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మునుగోడు బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



**మునుగోడు, వుదయం:**

నల్గొండ జిల్లా మునుగోడు మండలం కొంపల్లిలో శ్రీ పార్వతీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కరపత్రాన్ని గ్రామ సర్పంచ్ నిర్మల, ఆలయ కమిటీ ఛైర్మన్ విజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈకార్యక్రమం మొగుదాల శంభు–మౌనిక, వడ్డేపల్లి దుర్గాప్రసాద్–లావణ్య దంపతుల సహకారంతో నిర్వహించబడింది.గ్రామంలో త్వరలో ప్రారంభం కానున్న జాతర ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులు చర్చించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కృతిక హాస్పిటల్ డైరెక్టర్ మొగుదాల నరసింహగౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కోదాడలో పోలింగ్ కేంద్రాల తనిఖీ

## ఎన్నికల భద్రతపై జిల్లా ఎస్పీ పర్యవేక్షణ

**కోదాడ, వుదయం**



సూర్యాపేట జిల్లా కోదాడ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ కే నరసింహ బాలాజీ నగర్, సాలార్జంగ్ పేట, కొమరబండ పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు, భద్రతా వలయాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను ఎస్పీ సమీక్షించారు.ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులు సహకరించాలని, ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట స్థానిక డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ముగిసిన మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్..

**రామకృష్ణాపూర్/వుదయం**



క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో మున్సిపాలిటీ పోలింగ్ ప్రశాంతంగా ముగి సింది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డు క్యాతన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఎన్నికల కేంద్రాలను తనిఖీ చేశారు. ఆర్డీవో శ్రీనివాస్, మందమర్రి ఎమ్మార్వో సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లు ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. 22 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు తమ తమ వార్డులలో ఓటు హక్కులను వినియోగించుకున్నారు. అక్కడక్కడ స్వల్ప ఉద్రిక్తతలు మినహా మునిసిపాలిటీ లోని 22 వార్డులలో ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయానికి క్యూ లైన్ లో వేచి ఉన్న ఓటర్లందరికి అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్నచోట టోకెన్ల జారీ చేసి ఓటింగ్ నిర్వహించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌లను సీల్ చేశారు. మందమర్రి సిఐ రమేష్ ,పట్టణ ఎస్ఐ శ్రీధర్, పోలీస్ సిబ్బంది పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని సింగరేణి క్లబ్ కు స్ట్రాంగ్ రూములకు తరలించారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీ ఓటింగ్ కార్పొరేట్ కంటే మెరుగ్గా ఉన్నట్లు ప్రాథమిక ఘనంగాలు చెబుతున్నాయి. ఈ ఎన్నికలను ప్రధాన పార్టీలన్నీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. సుమారు 72 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# ముగిసిన మున్సిపల్ పోలింగ్.. ఫలితాలపై ఉత్కంఠ..

మహబూబ్ నగర్ లో మున్సిపల్ పోలింగ్ ముంగిసింది. మున్సిపల్, కార్పొరేషన్ కు సంబంధించి ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ ఇవాళ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. పోలింగ్ సరణి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఉద్రిక్తతలు నమోదయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అదుపు తప్పే పరిస్థితులు ఉంటే వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిపోయింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు ఈ నెల 13న లెక్కించనున్నారు. బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవిష్యత్: మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో తమ జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు ప్రచార పర్వాన్ని సాగించాయి. ప్రత్యర్థులపై మాటల తూటాలు వదులుతు రాజకీయాన్ని రక్తికట్టించాయి. వాదనలు, సవాళ్లతో మొదలైన ప్రచార విలువలకు తిలోదకాలు దిద్దుతూ తిట్లపురాణాల వరకు చేరుకుంది. పార్టీల వ్యూహాలు, హామీలు, ప్రచార సరళిని అంతా గమనించిన ఓటర్లు పార్టీల భవిష్యత్ ను, అభ్యర్థుల అదృష్టాన్ని ఓటు రూపంలో బ్యాలెట్బాక్కుల్లో నిక్షిప్తం చేశారు. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో తేలనుంది.

# ఖమ్మం ప్రభుత్వ కార్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు.. రాష్ట్ర కమిషనర్ పి వి శ్రీనివాస్ రావు

**ఖమ్మం, వుదయం**



ఎన్ ఎస్ పి క్యాంపు లో ఉన్న సర్కిల్ త్రీ ఇరిగేషన్ కార్యాలయం పాత బస్సు స్టాండ్ సమీపం లోని ఖమ్మం ఆర్ డి ఓ కార్యాలయాలలో తనిఖీలు నిర్వహించి ఆర్ టి ఐ రికార్డు లను పరిశీలించారు. ఇరిగేషన్ కార్యాలయాలయంలో RTI చట్టం ప్రకారం 4(1) బి కింద పదిహేడు అంశాలతో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆర్ టి ఐ చట్టం ప్రకారం క్రింద రికార్డులను సరిగ్గా నిర్వహించకపోవడం పై కూడా ఆసంతృప్తి వ్యక్తం చేసారు. ఆర్ డి ఓ కార్యాలయంలో ఆర్ టి ఓ రికార్డులను ప రిశీలించారు. అక్కడ కూడా పరిశీలించి నిర్వహణ తీరును అభినందించారు. అయితే 4(1) బి ప్రకారం పదిహేడు అంశాలతో కూడిన సిటిజెన్ చార్ట్ ఏర్పాటు చేయకపోవడం పై అసంతృప్తి వ్యక్తం చేసారు.

# ఎస్ఎఫ్ఐ పదవ తరగతి టాలెంట్ టెస్ట్

**ఖమ్మం, వుదయం**



గత 40 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయం త్రివేణి పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర కేంద్రంలో త్రివేణి పాఠశాలలో పదవ తరగతి టాలెంట్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ కిమ్స్ హాస్పిటల్ వైద్యురాలు యార్లగడ్డ రజిత పేపర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రజిత మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యార్థులకు పరీక్షల పైన ఉన్నటువంటి భయాన్ని పోగొట్టే దానికోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నారని తెలియజేశారు. అదే విధంగా నేటి అధునాతన కాలంలో విద్యార్థులు వారి మేధో శక్తిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా పెంపొందించుకోవాలని విజ్ఞానవంతులుగా మేధావులుగా తయారవ్వాలని తెలిపారు. ఉద్యమాలతో పాటు విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ లు పెట్టడం విద్యార్థులకు ఉపయోగమని అన్నారు. జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల హక్కుల కోసం వారి సమస్యలపై పోరాడమే కాకుండా గత 40 సంవత్సరాలుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల పైన ఉన్న భయాన్ని పోగొట్టేందుకు ఈ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని అదే రీతిలో ఈరోజు పట్టణ మండల స్థాయి టాలెంట్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని తెలిపారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమని విద్యార్థులకు ఈ టెస్ట్ ద్వారా ఎంతో ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఈ పేపర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంగీత జిల్లా సహాయ కార్యదర్శి సాత్విక జిల్లా కమిటీ సభ్యురాలు సింధు జిల్లా కమిటీ సభ్యులు శ్రీనాథ్ నాయకులు లోకేష్, రమణ,లోహిత్ కుమార్, సాయి,గోపి, హారిక, అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**జిన్నారం, వుదయం**

*జిన్నారంలో 90 శాతం పోలింగ్ నమోదు*

*గడ్డపోతారంలో 86.08శాతం పోలింగ్ నమోదు*

*ఉత్సాహంగా ఓటేసిన వృద్ధులు దివ్యాంగులు*




జిన్నారం గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో రెండవ సాధారణ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండు మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల సంఘం ఓటు హక్కు వినియోగించుకునే వారికి అవకాశం కల్పించింది. పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు పోలీసులు ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ఆయా వార్డులలో కౌన్సిలర్ అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాజిపల్లి పోలింగ్ కేంద్రంలో 90 ఏళ్ల వరకంటి అంజయ్య యాదవ్ అనే వృద్ధుడు పోలింగ్ కేంద్రానికి నడుచుకుంటూ వచ్చి ఓటు వేయడం గమర్నహం. వృద్ధులు, దివ్యాంగులు సైతం స్వచ్ఛందంగా ఓటింగ్ లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పారిశ్రామికవాడలో ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద మీడియా పాయింట్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అధికారులు వివరాలు వెల్లడించారు. కాగా జిన్నారం మున్సిపాలిటీ లోని 20 వార్డులలో 90.5 శాతంగా 11,350 ఓట్లు పోల్ అయ్యాయని, గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 18 వార్డులలో ( ..86.08) శాతంగా (...10315 ) ఓట్లు పోలయ్యాయని ఆయా ఎన్నికల అధికారులు తిరుపతి వెంకటరామయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాలెట్ బాక్స్ లను అధికారులు స్థానికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు తరలించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

గడ్డపోతారం పోలింగ్ కేంద్రాన్ని బాల నగర్ ఏసిపి గంగాధర్ తనిఖీ చేసి పోలింగ్ సరళి, భద్రత వ్యవస్థలు పర్యవేక్షించారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రెటరీ

**కామారెడ్డి, వుదయం:**



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా టిపిసిసి స్టేట్ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్ కాలనీలో ఉన్న సీనియర్ సిటిజన్ భవనంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెం. 111లో బుధవారం ఉదయం 11:20 గంటలకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కామారెడ్డి మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని బలపర్చే ఈ పవిత్రమైన హక్కును ప్రతి ఓటరు బాధ్యతగా భావించి తమ ఓటును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరారు.

# మానవత్వం చాటుకున్న ఎమ్మార్వో సతీష్ కుమార్

**రామకృష్ణాపూర్/వుదయం**



క్యాతన్ పల్లి మున్సిపాలిటీ లో ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఉదయం ఏడు గంటల నుండి పోలింగ్ కేంద్రానికి ఓటర్లు బారులు తీరారు. అందులో భాగంగానే రెండవ వార్డ్ లో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసేందుకు వచ్చిన మందమర్రి ఎంఆర్ఓ సతీష్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. రెండవ వార్డ్ ఓటరు దాసరి సమ్మయ్య శారీరక ఇబ్బందులు పడుతు పోలింగ్ స్టేషన్ కు రావడంతో గమనించిన ఎమ్మార్వో సతీష్ కుమార్ దాసరి సమ్మయ్య ను వీల్ చైర్ పై పోలింగ్ కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పోలింగ్ స్టేషన్ లోకి పంపించి ప్రశాంతంగా ఓటు వేసేందుకు సౌకర్యం కల్పించారు. మానవత్వం చాటుకున్న ఎమ్మార్వో సతీష్ కుమార్ కు ఓటర్లు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒత్తిడిని జయిస్తేనే ఉన్నత భవిష్యత్తు!

**కాజీపేట, వుదయం:**




విద్యార్థులు సానుకూల ఒత్తిడిని జయిస్తేనే లక్ష్యాలను సాధించగలరని మోటివేషనల్ స్పీకర్ కాజాంపురం దామోదర్ అన్నారు. హనుమకొండ ఆర్ట్స్ ,సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిభను గుర్తించి నిరంతర సాధనతో ముందుకు సాగాలని సూచించారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ చదువుతో పాటు విలువలు, వ్యక్తిత్వ వికాసం అవసరమని అన్నారు. ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యస్పష్టత, క్రమశిక్షణ విద్యార్థి జీవితానికి మూలాధారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డా. నహీదా పర్వీన్, దామెర నర్సయ్య, తేరాల యుగంధర్, శ్యామ్ పాల్గొన్నారు.

# నీటి సమస్యను తీర్చిన సర్పంచు

**నిజాంసాగర్, వుదయం:**

నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామ సర్పంచు గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ సమస్యలను పరిష్కరించడంలో ముందుంటున్నారు. ఇందులో భాగంగా గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద కాలనీవాసులకు, భక్తులకు నీటి సమస్య ఉందని భక్తులు పేర్కొనడంతో వెంటనే కాలనీవాసులు, ప్రజల కోరిక మేరకు అట్టి బోరుబావిని పరిశీలించి తక్షణం మరమ్మతులు చేయించారు. సమస్య ఉందని తెలిపిన వెంటనే స్పందించిన సర్పంచు చేతిపంపు మరమ్మతులు చేపట్టడంతో గ్రామస్థులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేయడమే కాకుండా సర్పంచు పనితీరు పట్ల ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచు మెంగారం కవిత పందరి, గ్రామపెద్దలు, వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

# ఉప్పల్‌లో బ్యాంక్ కేవైసీపై అవగాహన సదస్సు



**అలంపూర్, వుదయం**

ఐజ మండలం ఉప్పల్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేవైసీ అప్డేట్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ప్రతి వినియోగదారుడు కేవైసీ పూర్తి చేయాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసాలను నివారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, కౌన్సిలర్లు, గ్రామస్తులు పాల్గొని బ్యాంకింగ్ భద్రతపై అవగాహన పొందారు.

# జిల్లాలో ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్‌స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లను పరిశీలించిన కలెక్టర్



**గద్వాల, వుదయం**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జోగు ళాంబ గద్వాల జిల్లా లోనీ నాలుగు మున్సిపాలిటీలలో ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గద్వాల జిల్లాలోని పురపాలిక పరిధి లోని దౌదర్పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఐజ జెడ్పిహెచ్ఎస్ లో, పర్ది పురం అంగన్వాడి భవనంలో, శాంతి నగర్ జెడ్పిహెచ్ఎస్లోట, అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది, ఓటర్లు సెల్ ఫోన్స్ ఎట్టి పరిస్థితుల్లో తీసుకురాకూడదని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్యను సరిచూసుకొని ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. ఓటర్లకు బ్యాలెట్ పేపర్ లు ఇచ్చిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లో వేసేంత వరకు ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఆయా వార్డుల పరిధిలోని మొత్తం ఓటర్ల సంఖ్య తెలుసుకునీ పలువురు ఓటర్లతో మాట్లాడారు. ఆయా పోలింగ్ కేంద్రాల వెలుపల అతికించిన పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి గుర్తుల వివరాలను పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయం ప్రకారం జరిగిన ఓటింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు టీ పోల్ యాప్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సాయంత్రం ఐదు గంటల లోపల పోలింగ్ కేంద్రాల్లోని క్యూలో నిలుచున్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఐజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వడ్డేపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ హాల్స్ ను ఎస్పీ శ్రీనివాస రావు తో కలిసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూములలో వార్డులు, పోలింగ్ బూతుల వారీగా నిర్దేశిత క్రమ సంఖ్యలో బ్యాలెట్ బాక్స్ లను అమర్చాలని అక్కడి అధికారులకు సూచించారు. కౌంటింగ్ హాల్స్ లో అవసరమైన టేబుల్స్ ఏర్పాటు చేయడమే కాక ఎలాంటి తప్పిదాలకు చోటు లేకుండా లెక్కింపు ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను విజయవంతం చేసేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడమే కాక సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అక్కడ అదనపు పోలీస్ బలగాలను నియమించామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు ఎస్పి శంకర్, డిఎస్పి మొగిలయ్య, ఆయా మున్సిపాలిటీల ఎన్నికల అధికారులు,సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్ నియోజక వర్గంలో ప్రశాంతంగా మూడు మున్సిపల్ ఎన్నికల పోలింగ్

**అలంపూర్, వుదయం**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా అలంపూర్ నియోజక వర్గంలో బుధవారం జరిగిన మూడు మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గద్వాల జిల్లా అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులకు గాను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు మధ్య జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అయిజలో 20 వార్డులు, అలంపూర్ లో 10 వార్డులు, వడ్డేపల్లి లో 10 వార్డుల్లో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఐదు గంటలకు పూర్తయింది. అన్ని మున్సిపల్ పరిధిలో వార్డులకు గాను పోటీలో నిలబడిన అభ్యర్థులకు చెమటలు పట్టించేలా ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించు కున్నారని చెప్పుకోవచ్చు. బ్యాలెట్ బాక్స్ లో నిక్షిప్తమైన ఓట్లు ఈనెల 13న కౌంటింగ్ లో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో.. అనేది శుక్రవారం వెలువడే ఫలితాల్లో గెలుపోటములు బయటపడతాయి. అందులో ఓటర్లు ఎవరికి పట్టం కట్టి గెలిపించారో విజేతలు ఎవరు అనేది తేలిపోనుంది. అయిజ మున్సిపాలిటీ పరిధిలో 23016 మంది మొత్తం ఓటర్లు ఉండగా, 19492 మంది తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. మొత్తం పోలింగ్ శాతం 84.69%, అలంపూర్ లో మొత్తం ఓటర్లు 8751 ఉండగా, 7104 మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. పోలింగ్ శాతం 81.18%, వడ్డేపల్లిలో మొత్తం ఓటర్లు 10604 ఉండగా 8935 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 84.26% నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈనెల 13వ తేదీన ప్రభుత్వ కళాశాలలలో కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

# కౌంటింగ్ కేంద్రాల వద్ద 163 BNSS అమలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**సిద్దిపేట, వుదయం**



తెలంగాణ రాష్ట్ర రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ రశ్మి పెరుమాళ్ తెలిపారు. ఈ నెల 13న జరగనున్న కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం లెక్కింపు కేంద్రాల వద్ద 163 BNSS (గతంలో సెక్షన్ 144) కింద నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చేర్యాల, హుస్నాబాద్, దుబ్బాక మరియు గజ్వేల్ మున్సిపాలిటీల పరిధిలోని నాలుగు లెక్కింపు కేంద్రాల వద్ద ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని ఆమె పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం, ఊరేగింపులు నిర్వహించడంపై నిషేధం విధించారు. ఒక కిలోమీటరు పరిధిలో కర్రలు, లాఠీలు, మారణాయుధాలు లేదా ఇతర ప్రమాదకర వస్తువులు తీసుకురావడాన్ని నిషేధించారు. మైకులు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ద్వారా పాటలు, ప్రసంగాలు ప్రసారం చేయకూడదు. మత విద్వేషాలను ప్రేరేపించే చిత్రాలు, ప్లకార్డుల ప్రదర్శనను ఖచ్చితంగా నివారించాలి. గెలుపు ఉత్సాహంలో బాణసంచా కాల్చడం, విజయ యాత్రలు నిర్వహించడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై షామియానాలు, వేదికలు ఏర్పాటు చేయరాదు. ఈ నిషేధాజ్ఞలు ఫిబ్రవరి 13వ తేదీ ఉదయం 06:00 గంటల నుండి ప్రారంభమై, ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగా ముగిసే వరకు అమలులో ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. కేవలం లెక్కింపు విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి మాత్రమే ఈ నిబంధనల నుండి మినహాయింపు ఉంటుందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల వెల్లడి సమయంలో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సంయమనం పాటించాలని, శాంతియుత వాతావరణంలో ప్రక్రియ ముగిసేలా సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు

**ఆసిఫాబాద్, వుదయం**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని కాగజ్నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆసిఫాబాద్ నూతన మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులు, కాగజ్నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండ విట్టల్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముగిసినప్పటికీ క్యూ లైన్లో ఉన్నవారికి ఓటు వేసేందుకు అధికారుల అవకాశం కల్పించారు. కాగజ్నగర్ మున్సిపాలిటీలో 64.32 శాతం పోలింగ్ అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇలాంటి ఇబ్బందులు కలగకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ కే. హరిత, జిల్లా ఎస్పీ నికితపంత్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందితో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పా ట్లు చేశారు. దీంతో జిల్లాలోని ఆసిఫాబాద్ కాగజ్నగర్ మున్సిపాలిటీలలోఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల ఓటింగ్ పూర్తి కావడంతో వివిధ పార్టీల నాయకులు అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. ఎన్నికలు ముగిసినప్పటికీ ఫలితాలు ఈ నెల 13న ఉన్నందున అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

# వెబ్ కాస్టింగ్ తో పోలింగ్ కేంద్రాల పరిశీలన జిల్లా కలెక్టర్

**గద్వాల, వుదయం**



జోగులాంబ గద్వాల జిల్లాలోని మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే గద్వాల, అలంపూర్, ఐజ, వడ్డేపల్లి మునిసిపాలిటీలలోని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణను జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.బుధవారం ఉదయం ఐడిఓసి సమావేశపు మందిరంలో వెబ్ కాస్టింగ్ తో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తూ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది విధులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మున్సిపాలిటీ ఎన్నికలు జరిగేనాలుగు పురపాలక సంఘాల్లో మొత్తం 77 వార్డుల్లో అలంపూర్లోని పదవ వార్డు ఏకగ్రీవం కాగా మిగిలిన 76 వార్డులకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో మొత్తం 189 మంది చొప్పున ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 567మంది ఓపిఓలు విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. వీరికి రిటర్నింగ్, జోనల్, మున్సిపల్, పోలీస్, ఇతర సిబ్బంది పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు సహకరిస్తున్నారన్నారు. ఆయా పురపాలికల్లో మొత్తం 1,08,524 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇందులో 55,661 మంది మహిళలు, 52,851 మంది పురుషులు, ఇతరులు 12మంది ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇతర ఎన్నికల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వుదయం**



మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం సందర్శించారు. కొత్తగూడెం, ఇల్లందు అశ్వరావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందో బస్తును పరిశీలించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

# వాహనాలు తనిఖీ చేసిన ఆర్టీఓ

**నిజాంసాగర్, వుదయం:**



నిజాంసాగర్ మండలకేంద్రంలోని గాంధీచౌక్ చౌరస్తాలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎం.శంకర్ బుధ వారం వాహనాల తనిఖీ నిర్వ హించారు. ఆయన ఈ సందర్భంగా వాహనదారుల వద్ద వాహన ద వపత్రాలు, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. ద వపత్రాలు సరిగా లేని వాహనదారులకు ఆయన జరిమానా విధించారు. చిన్నారులకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

**హుస్నాబాద్, వుదయం**




హుస్నాబాద్ మున్సిపాలిటీలో రికార్డు స్థాయి పోలింగ్– 84.21 శాతం ఓటింగ్ నమోదుహుస్నాబాద్ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటీకి బుధవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు. పట్టణ వ్యాప్తంగా నిర్వహించిన పోలింగ్‌లో మొత్తం 84.21 శాతం ఓట్లు నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు బారులు తీరడంతో పోలింగ్ కేంద్రాలు సందడిగా మారాయి. ఉదయం 9 గంటలకు 16.57 శాతంగా ఉన్న ఓటింగ్, మధ్యాహ్నం 1 గంట సమయానికి 58.05 శాతానికి చేరుకుంది. సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ గడువు ముగిసే సమయానికి మొత్తం 19,227 మంది ఓటర్లలో 16,192 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మున్సిపాలిటీలోని 20 వార్డుల పరిధిలో ఏర్పాటు చేసిన 40 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. స్త్రీ, పురుష ఓటర్లు దాదాపు సమాన స్థాయిలో పోటీపడి ఓటువేశారు. పురుష ఓటర్లలో 84.68 శాతం మంది, మహిళా ఓటర్లలో 83.78శాతం మంది ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్, సహాయ జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. గతం కంటే భారీ స్థాయిలో పోలింగ్ శాతం పెరగడంతో రాజకీయ పార్టీల్లో గెలుపోటములపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

# ఓటు హక్కు వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు



గడ్డపోతారం మున్సిపల్ పరిధిలో ఎన్నికలు ప్రశాం తంగా ముగిశాయి. బీఆర్ఎస్ పార్టీ 15 వార్డు అభ్యర్థి పులిగిల్ల శ్రీనివాస్ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళి పై సంతోషం వ్యక్తం చేస్తూ గెలుపు పై ధీమా వ్యక్తం చేశారు. కారు గుర్తుపై ఓటేసిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్...జిల్లా కలెక్టర్

## జిల్లాలోని 5 మునిసిపాలిటీలలో మొత్తం పోలింగ్ 82.50 శాతం నమోదు

**ఖమ్మం, వుదయం**



మునిసిపల్ ఎన్నికల పోలింగ్ ఖమ్మం జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో 5 మున్సిపాలిటీలలోని 116 వార్డులకు జరిగిన పోలింగ్ లో మొత్తం 82.50 శాతం ఓటింగ్ నమోదైందని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 15.37 శాతం, 11 గంటల వరకు 37.10 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 59.41 శాతం పోలింగ్ నమోదైందని, సాయంత్రం 3 గంటల వరకు 72.93 శాతం పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు 82.30 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని, మొత్తంగా ఖమ్మం జిల్లాలో 1,41,875 మంది ఓటర్లకు గాను 117043 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కోగా, ఇందులో 55,506 మంది పురుష ఓటర్లు, 61,520 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారు. మొత్తంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 82.50 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు.పోలింగ్ జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీలో 85.45 శాతం, వైరా మున్సిపాలిటీలో 83.71 శాతం,సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.81 శాతం,కల్లూరు మున్సిపాలిటీలో 87.08 శాతం,మధిర మున్సిపాలిటీలో 78.19 శాతం పోలింగ్ నమోదైందని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా కలెక్టరెట్ నుంచి నిరంతరం మానిటరింగ్ చేయడం జరిగిందని అన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పురపాలక ఎన్నికల్లో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి జలగం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంను తనిఖీ చేసి ఓటింగ్ సరళిని పరిశీలించి, పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు పవన్ కుమార్ కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ను పరిశీలించారు.వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ లో డిఆర్ఓ పద్మశ్రీ, సిపిఓ శ్రీనివాస్, టెక్నికల్ మేనేజర్ హనుమాచారి, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మునిసిపల్ ఎన్నికల పోలింగ్

## జిల్లాలో పోలింగ్ శాతం 77.64 శాతం నమోదు

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, వుదయం**



బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా, ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సజావుగా సాగినట్లు ఆయన స్పష్టం చేశారు.కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును, స్థానిక పరిస్థితులను ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అదనపు కలెక్టర్ దేవ సహాయం లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.జిల్లాలోని నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో పరిధిలోనూ ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడు మున్సిపాలిటీల 65 వార్డులకు జరిగిన ఎన్నికలకు 131 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం, బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు ఐ.డీ కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం ధృవీకరించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని విస్తృత ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్ణీత సమయం అయినా సాయంత్రం 5 గంటకు పోలింగ్ ముగిసినప్పటికీ, అప్పటికే లైన్లో ఉన్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇందుకోసం గేట్లు మూసి, క్యూలైన్‌లో ఉన్న ప్రతి ఓటరు ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగించామని వివరించారు.పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయించామని, వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారని అన్నారు. నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించామని అన్నారు. ఈ నెల 13న ఉదయం 8.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామన్నారు.

# వంటగదిలో మౌనం.. ఆరోగ్యానికి అసలైన ప్రాణం



వంట చేయడం అనేది కేవలం ఆకలి తీర్చుకోవడానికి చేసే పని మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన ధ్యాన ప్రక్రియ. మనం తీసుకునే ఆహారం మన ఆలోచనల ద ప్రభావం చూపుతుంది కాబట్టి, వంట చేసేటప్పుడు మనసు ప్రశాంతంగా ఉండటం చాలా అవసరం. నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో వంట చేయడం వల్ల మనస్సులోని ఒత్తిడి తగ్గి, ఒక రకమైన ప్రశాంతత లభిస్తుంది. అందుకే పూర్వీకులు వంట చేసేటప్పుడు అనవసరమైన మాటలు తగ్గించి, దైవచింతనతో లేదా మౌనంగా ఉండాలని సూచించేవారు.ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది టీవీ చూస్తూనో లేదా ఫోన్ మాట్లాడుతూనో వంట పనులు కానిచ్చేస్తుంటారు. దీనివల్ల వంటపై ఉండాల్సిన ఏకాగ్రత దెబ్బతింటుంది, ఇది అటు శారీరక ఆరోగ్యానికి, ఇటు మానసిక స్థితికి ఏమాత్రం మంచిది కాదు. పరధ్యానంలో వంట చేయడం వల్ల పదార్థాల మోతాదులు మారడమే కాకుండా, ఆ వంటకాల్లో నాణ్యత కూడా లోపించే అవకాశం ఉంది. మౌనంగా ఉండి వంట చేసినప్పుడు మన చేతికి, మెదడుకి మధ్య సరైన సమన్వయం కుదిరి పనిలో వేగం పెరుగుతుంది.వంట చేసే వ్యక్తి ఎంత సంతోషంగా, ప్రశాంతంగా ఉంటే ఆ వంటకాలు అంత రుచికరంగా తయారవుతాయని నిపుణులు నమ్ముతారు. వంట చేసేటప్పుడు మనలో కలిగే సానుకూల భావనలు ఆ ఆహార పదార్థాల ద్వారా కుటుంబ సభ్యులకు అందుతాయి. మౌనం పాటిస్తూ వంట చేయడం వల్ల ఆ పని పట్ల గౌరవం పెరుగుతుంది, తద్వారా వంట వండటం అనేది ఒక భారంగా కాకుండా ఒక కళగా మారుతుంది. ఏకాగ్రతతో వండిన భోజనం రుచిలోనే కాదు, అందించే తృప్తిలో కూడా ప్రత్యేకంగా ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యం కేవలం మనం తినే తిండి ద మాత్రమే కాదు, ఆ ఆహారాన్ని ఎలా వండాము అనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. వంటగదిని ఒక పవిత్రమైన స్థలంగా భావించి, అక్కడ ప్రశాంత వాతావరణాన్ని అలవాటు చేసుకోవడం మన జీవనశైలిలో గొప్ప మార్పును తెస్తుంది. ఏకాగ్రతతో వంట చేయడం వల్ల అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలను కూడా నివారించవచ్చు. అందుకే రేపటి నుండి వంట గదిలో ఫోన్లను పక్కన పెట్టి, మౌనంగా వంట చేసి ఆ తేడాను రే గమనించండి.

# ఈ ఆకుల్లో ఔషధ గుణాలు మెండు..



జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస్), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయి. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. జామ పండ్లు చవకగా లభించే పోషకాల గని.. అందుకే దీన్ని పేదవాడి ఆపిల్ అని కూడా పిలుస్తారు. దీనిలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అయితే, జామ పండ్లతో పాటు దాని ఆకులు కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లోని ఔషధ గుణాలను ఆధునిక పరిశోధనలు కూడా ధృవీకరిస్తున్నాయి. కొన్ని సాధారణ ఆరోగ్య సమస్యలకు జామ ఆకులతో ఇంట్లోనే చికిత్సలను తయారు చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. జామ ఆకులు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, యాంటీ మైక్రోబయల్ గుణాలను కలిగి ఉన్నాయి.. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, బరువు తగ్గడం, నోటి ఆరోగ్యం, గుండె ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా.. జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుంది.కీళ్ల నొప్పులు, ముఖ్యంగా వాపులతో కూడిన వాటికి, జామ ఆకుల ముద్దను గోరువెచ్చగా చేసి పట్టులా వేయడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.అంతేకాకుండా, జామ ఆకుల యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల వల్ల పంటినొప్పి, చిగుళ్ల వాపు, నోటిపూత వంటి నోటి సంబంధిత సమస్యలకు ఇవి అద్భుతంగా పనిచేస్తాయి.ఆకుల కషాయంతో పుక్కిలించడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. కడుపు నొప్పి, వాంతులకు కూడా యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్న ఈ ఆకుల కషాయం ఉపయోగిస్తారు. ఈ విధంగా, జామ ఆకులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. అవసరాన్ని బట్టి వీటిని సరైన పద్ధతిలో ఔషధం కింద వాడుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. జామ ఆకులను టీ రూపంలో లేదా లేత ఆకులను నమలడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.. అంతేకాకుండా.. వీటి రసాన్ని కూడా తీసుకోవచ్చు.. అయితే.. ఉదయాన్నే తీసుకుంటే మంచిది..

# వేపాకు.. రోగాలకు దివ్యౌషధం

ఆయుర్వేద సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించ దానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. ఆయుర్వేద



సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించడానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. అంతేకాకుండా పురాతన కాలం నుంచి వేప చెట్టుకు పూజలు కూడా చేస్తారు. వేప చెట్టుకు పసుపు రాసి, బొట్లు పెట్టి ప్రదక్షిణలు కూడా చేస్తారు. వేపాకులు అద్భుతమైన ఔషధ గుణాలు.. పోషకాల గని. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, భాస్వరం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ వ్యాధులు, మధుమేహం, జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సహాయపడతాయి. వేపలో దాగి ఉన్న అద్భుతమైన ప్రయోజనాలను శాస్త్రవేత్తలు నాలుగు ముఖ్యమైన పరిశోధనల ద్వారా నిరూపించారు. 2015వ సంవత్సరంలో భారతదేశంలోని వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు వేపలో నింబల్ ఫ్లేవోన్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరస్ గుణాలను కలిగి ఉంటుందని, క్రిములను సమర్థవంతంగా చంపుతుందని వారు స్పష్టంగా నిరూపించారు. జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ హెన్రిచ్ కు చెందిన శాస్త్రవేత్తలు 2011వ సంవత్సరంలో వేపలో అజాదిరచిటిన్ అనే రసాయనం ఉందని కనుగొన్నారు. వేప నూనెలో ఉండే ఈ రసాయనం తలకు అప్లై చేసిన 10 నుండి 15 నిమిషాల్లో తలలోని పేలను పూర్తిగా నిర్మూలిస్తుందని వారి పరిశోధనలు నిరూపించాయి. 2014వ సంవత్సరంలో ఇండోనేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ గడ్జా మడ శాస్త్రవేత్తలు వేపలో నింబిడిన్ అనే రసాయనాన్ని కనుగొన్నారు. ఈ నింబిడిన్ ప్యాంక్రియాస్ గ్రంథిలోని బీటా కణాలను ఉత్తేజపరిచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ను తగ్గిస్తుందని, తద్వారా షుగర్ స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుందని వెల్లడించారు. ఈ రసాయనం ఇన్సులిన్ ఉత్పత్తికి కూడా దోహదపడుతుంది. అమెరికాలోని రోస్వెల్ పార్క్ క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ శాస్త్రవేత్తలు 2014లో వేపలో నింబిడాల్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం క్యాన్సర్ కణాలు వాటంతట అవే చనిపోయేలా (అపోప్టోసిస్) ప్రేరణ కలిగిస్తుందని, క్యాన్సర్ వృద్ధిని అదుపు చేయడానికి, తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుందని వారు నిరూపించారు. ఈ నాలుగు రకాల పరిశోధనలు వేపలో ఉన్న ఔషధ గుణాలను, శక్తివంతమైన మెడిసిన్స్ లాగా ఇవి జబ్బులను తగ్గించడానికి పనికొస్తున్నాయని రుజువు చేశాయి.

## చక్కని ఆరోగ్యం

# మధుమేహం ఉన్నవారు ఈ పండ్లు తినకూడదు!

పండ్లు పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఆరోగ్యకరమైన ఆహారంలో ముఖ్యమైన భాగం. కానీ అన్ని పండ్లు డయాబెటిక్ బాధితులకు మంచివి కావు. ఎందుకంటే..డయాబెటిస్ అనేది శరీరం గ్లూకోజ్ ను సరిగ్గా ఉపయోగించుకోలేని వ్యాధి. దీనివల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. డయాబెటిస్ రోగులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. అందుకే



మధుమేహ వ్యాధిగ్రస్తులు అన్ని రకాల పండ్లను తీసుకోరాదు. షుగర్ ఉన్నవారు కొన్ని రకాల పండ్లు తినకపోవడమే మంచిది. అందులో మామిడి పండు కూడా ఒకటి. డయాబెటిస్ ఉన్నవారు మామిడి పండు తినకూడదు. మామిడి విటమిన్ ఎ, సి లకు మంచి మూలం. కానీ ఇందులో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. అలాగే, అందరికీ అందుబాటులో ఉండే అరటి పండు కూడా మధుమేహులకు ప్రమాదమే. ఎందుకంటే.. అరటి పండులో కూడా షుగర్ పర్సెంట్ ఎక్కువగానే ఉంటుంది. సీతాఫలంలో కూడా చక్కెర శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. పైనాపిల్ పండులో కూడా సహజ చక్కెర శాతం ఎక్కువ. ద్రాక్ష కూడ తినకూడదు. వాటిలో సహజ చక్కెరలు చాలా ఎక్కువగా ఉంటాయి.

# దోమల్ని తరిమే నూనెలివి..

ఆహార వ్యర్థాలు, తేమ, నిలిచిన నీరు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం ఇలా ఎన్నో కారణాల వల్ల బొద్దింకలు, పురుగులు ఇంట్లో చేరుతుంటాయి. వీటిని సహజంగా సులువుగా తరిమేయాలంటే... పావుకప్పు ఆవనూనెలో, ఐదారు పుదీనా ఆకులు వేసి మరగనివ్వాలి. ఆ మిశ్రమాన్ని వడకట్టి ఓ సీసాలో పోసుకోవాలి. ఇప్పుడు గ్లాసు నీళ్లలో అరచెంచా ఈనూనెను కలిపి వంటగది మూలల్లో స్ప్రే చేయండి. కొన్ని రోజులు ఇలా చేస్తే బొద్దింకలు దరిచేరవు. వేప నూనె సహజ క్రిమి సంహారిణిగా పనిచేస్తుంది. పావులీటరు నీటిలో చెంచా వేపనూనె, అరచెంచా వంట సోడా కలపాలి. దాన్ని అవసరమైన చోట స్ప్రే చేయండి. పావుగంట తర్వాత దోమలే కాదు... చిన్న చిన్న పురుగులు కూడా పోతాయి. ఇక, బొద్దింకలు పోవాలంటే... నిమ్మ చెక్కపై కాస్తవేప నూనె అద్ది... సింకుల కింద, మురికి నీళ్ల గొట్టాలు, తలుపు మూలల్లో పెడితే సరి. వాటికి అడ్డుకట్ట వేయొచ్చు. నిమ్మగడ్డి నూనె ఘాటైన వాసనకు బొద్దింకలు పరారవుతాయి. లీటరు నీటిలో కాస్త బేకింగ్ సోడా, నాలుగైదు చుక్కల నిమ్మగడ్డి నూనెను కలిపి... వంటింటి గట్టు, గోడలు తుడవండి. మూలల్లో స్ప్రే చేయండి.



# గోళ్లు కొరుకుతున్నారా.. రోగాలు రావడం ఖాయం



ఖాళీగా ఉన్నప్పుడో, ఏదైనా దీర్ఘంగా ఆలోచిస్తున్నప్పుడో తెలియకుండానే వేళ్లు నోట్లోకి వెళ్తున్నాయా..? పళ్లతో గోళ్లను కొరుకుతున్నారా..? చాలామంది దీనిని లైట్ తీసుకుంటారు కానీ దీన్నివల్ల రు ప్రమాదంలో పడతారు. ఈ చిన్న వ్యసనం శరీరాన్ని లోపల నుండి గుల్ల చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం రోజంతా మొబైల్ ఫోన్లు, కీబోర్డులు, తలుపు హ్యాండిల్స్, డబ్బు వంటి ఎన్నో వస్తువులను తాకుతాము. మన కంటికి కనిపించని వేలాది బ్యాక్టీరియా, క్రిములు గోళ్ల కింద చేరుతాయి. వాటిని కొరికినప్పుడు ఆ క్రిములు నేరుగా కడుపులోకి వెళ్లి విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పికి దారితీస్తాయి. నిరంతరం గోళ్లు కొరకడం వల్ల దంతాల ఆకారం దెబ్బతినడమే కాకుండా చిగుళ్లు బలహీనపడి ఇన్ఫెక్షన్లు వస్తాయి. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం.. ఇది కేవలం శారీరక అలవాటు మాత్రమే కాదు.. ఒక మానసిక సంకేతం. మెదడు ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి పనులు చేయిస్తుంది. ఏ తోచనప్పుడు కూడా మనసు ఒక సౌకర్యవంతమైన చర్య కోసం గోళ్లను ఆశ్రయిస్తుంది.ఈ చెడు అలవాటుకు స్వస్తి పలకడం అసాధ్యమే కాదు. గోళ్లు ఎప్పుడూ చిన్నగా, శుభ్రంగా ఉంటే కొరకడానికి అవకాశం ఉండదు. మెడికల్ షాపుల్లో దొరికే చేదుగా ఉండే నెయిల్ ఉత్పత్తులను వాడండి. నోట్లో వేలు పెట్టగానే ఆ చేదు వల్ల అలవాటు గుర్తుకొచ్చి ఆపేస్తారు.స్ట్రెస్ బాల్స్ లేదా పెన్నులతో ఆడటం ద్వారా చేతులకు పని చెప్పండి. దీంతో గోళ్ల జోలికి వెళ్లకుండా ఉంటారు. ఒత్తిడి వల్ల ఇలా చేస్తుంటే.. కాసేపు ప్రశాంతంగా గాలి పీల్చుకోవడం లేదా సంగీతం వినడం ద్వారా మనసును మళ్లించండి. గోళ్లు కొరకడం అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు.. అది ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్న. చిన్న వయసులోనే ఈ అలవాటును గుర్తిస్తే త్వరగా మానుకోవచ్చు. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

# మిగిలిన పెరుగుతో..!

కూరల్లాగే పెరుగు మిగిలిపోయినా మరుసటి రోజు తినడానికి కొంతమంది ఇష్టపడరు. అలాంటప్పుడు దాన్ని బయటపడేయడం కాకుండా.. కొన్ని వంటకాల తయారీలో వాడుకోవచ్చంటున్నారు నిపుణులు. తద్వారా వంటకాల రుచి పెరగడంతో పాటు ఆరోగ్యాన్నీ సొంతం చేసుకోవచ్చంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం రండి.. మిగిలిపోయిన పెరుగును అలాగే తినడానికి ఇష్టపడని వారు.. దాన్ని పండ్ల రసాలు, స్మూతీస్ తయారీలోనూ వాడచ్చు. ఈ క్రమంలో స్మూతీస్ చేసేటప్పుడు బ్లెండర్‌లో పండ్లు, తేనె, కొన్ని ఐస్‌ముక్కలతో పాటు కొద్దిగా పెరుగు వేసి.. బ్లెండ్ చేస్తే దాని రుచి పెరుగుతుంది. మాంసాహారం వండే ముందు వాటిని మ్యారినేట్ చేయడం మనకు తెలిసిందే. అయితే ఈ క్రమంలో పెరుగును కూడా కలిపితే.. మాంసం ముక్కలు మరింత మృదువుగా మారి త్వరగా ఉడుకుతాయి. అలాగే కూర రుచి కూడా పెరుగుతుంది. సలాడ్ గార్నిష్/డ్రస్సింగ్ కోసం కొత్తమీర/పుదీనా వంటి ఆకులు, నిమ్మరసం, వెల్లుల్లి ముక్కలు, ఆలివ్ నూనె.. వంటివి వాడుతుంటాం. అయితే క్రీమీగా చిలికిన పెరుగును వాటి పైనుంచి సన్నటి తీగలాగా పోస్తే.. సలాడ్ నోరూరిస్తుంది.. తింటుంటే మధ్యమధ్యలో పుల్లపుల్లగా నోటికి తగులుతుంటుంది. చిప్స్, క్రాకర్స్, కాల్చిన కాయగూర ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రైస్.. వంటి వాటిని వివిధ రకాల పదార్థాలతో తయారుచేసిన డిప్పింగ్ సాస్‌లో ముంచుకొని తింటుంటాం. అయితే ఈ డిప్స్ తయారీలో కొద్దిగా పెరుగును ఉపయోగిస్తే.. వాటి రుచి, చిక్కదనం పెరుగుతాయి. అంతే కాదు.. పెరుగుతోనూ రుచికరమైన డిప్ తయారు చేసుకోవచ్చు. పెరుగును ఒక క్లాత్‌లో వేసి.. అందులోని నీటిని తీసేయాలి. ఇప్పుడు దీన్ని బాగా చిలికితే క్రీమీగా తయారవుతుంది. ఇందులో మీ రుచికి తగినట్లుగా చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి కలుపుకోవచ్చు. కావాలంటే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, స్వీట్‌కార్న్.. వంటివి జత చేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది. మిగిలిపోయిన పెరుగుతో రైతా, మజ్జిగ చారు.. వంటివి తయారుచేసుకోవచ్చు. అలాగే ఈ పెరుగుకు నీళ్లు,



చక్కెర, రోజ్‌వాటర్.. వంటి పదార్థాల్ని కలుపుకొని రుచికరమైన లస్సీ కూడా తయారుచేసుకోవచ్చు. కేక్స్, మఫిన్స్, ప్యాన్‌కేక్స్.. వంటి బేకింగ్ వంటకాల్లో పెరుగు లేదంటే దాన్నే కాస్త చిలికి క్రీమీగా మారాక ఉపయోగించుచ్చు. దీనివల్ల బేక్ చేశాక అవి మరింత మృదువుగా వస్తాయి. వాటి రుచీ పెరుగుతుంది.

# బొప్పాయి గింజలు.. తిన్నారంటే గంపెడు లాభాలు?

ఆరోగ్యానికి మేలు చేసే పండ్ల విషయానికి వస్తే బొప్పాయి అగ్రస్థానంలో ఉంటుంది. ఇది కేవలం ఒక సాధారణ పండు మాత్రమే కాదు, శరీరాన్ని లోపలి నుండి సంరక్షించే సహజ ఔషధం. ఆయుర్వేదంలో దీనిని అమృతఫలం అని పిలుస్తారు. ఎందుకంటే బొప్పాయిలోని ప్రతి భాగం కాయ, పండు, ఆకులు, గింజలు కూడా అద్భుత లక్షణాలతో నిండి ఉంటాయి. ప్రతి పండు దాని సొంత ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది.

బొప్పాయి జ్వరాలను నయం చేసే, రక్తాన్ని శుద్ధి చేసే, చర్మాన్ని మెరుగుపరిచే శక్తిని కలిగి ఉంటుంది. బొప్పాయి,దాని ఆకులు చాలా శక్తివంతమైనవి. అవి శరీరంలోని మూడు దోషాలను సమతుల్యం చేయడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. బొప్పాయి మాత్రమే కాదు, దాని గింజలు, ఆకులు కూడా అమృతంగా పరిగణిస్తారు. బొప్పాయి గింజలను సాధారణంగా కొత్త మొక్కలను పెంచడానికి ఉపయోగిస్తారు. కానీ, దీన్ని తినడం వల్ల మన శరీరం ఎన్ని ప్రయోజనాలను పొందుతుందో తెలిస్తే రు షాక్ అవుతారు. బొప్పాయిలోని పపైన్ ఎంజైమ్ కడుపు, పేగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని శుద్ధి చేయడంలో, పోషకాలను గ్రహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బొప్పాయి ఆకులు, గింజలు ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగించబడతాయి. ఆకులు, గింజలు కొద్దిగా చేదు రుచిని కలిగి ఉన్నప్పటికీ, అవి శరీర మూలంలోని అనేక సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది. భారతదేశంలో గుండె జబ్బులు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పెద్ద తేడాలేకుండా చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితికి బొప్పాయి గింజలు దివ్యౌషధం. బొప్పాయి గింజలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మన శరీరాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తాయి. ఈ విత్తనాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇంకా, ఈ విత్తనాలలో ఒలీక్ ఆమ్లం, మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజలు వాపును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఈ విత్తనాలలో ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. బొప్పాయి గింజలు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ విత్తనాలలో కనిపించే ఐసోథియోసైనేట్స్ వంటి సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. బొప్పాయి గింజలు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విత్తనాలు జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తాయి. రు చర్మం, జుట్టు కోసం బొప్పాయి గింజల సారం లేదా నూనెను ఉపయోగించవచ్చు. మీరు చర్మ సమస్యలతో పోరాడుతుంటే, బొప్పాయి గింజలు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటి యాంటీ ఏజింగ్ లక్షణాలు చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడతాయి.



# అవి ఇంకా ప్రమాదం!



ఉదయాన్నే ఇంటిని ఊడ్చి తుడుస్తాం. పాత్రలు శుభ్రం చేస్తాం. తరచూ దుప్పట్లు, దిండు గలేబులు మారుస్తుంటాం. ఇంటి శుభ్రత, మన వాళ్ల ఆరోగ్యం కోసం ఇలాంటివి ఇంకా ఎన్నో చేస్తుంటాం. కానీ వీటికంటే ప్రమాదకరమైనవి కొన్ని ఉన్నాయి. వాటిని పట్టించుకుంటున్నారా మరి? స్క్రబర్/ స్పాంజ్: పాత్రల శుభ్రతకు ఇవి తప్పనిసరి. పాత్రలన్నీ పూర్తయ్యాక వీటిని నీటితో కడిగి పక్కనపెడతాం. కానీ ఎప్పుడూ తేమతో ఉంటాయి కదా! సూక్ష్మజీవులకు ఆవాసంగా మారతాయి. వీటితో పాత్రలను శుభ్రం చేస్తే తిరిగి వాటిమీదకే చేరతాయి. కాబట్టి, రోజూ రాత్రి బాగా వేడినీటిలో కానీ బ్లీచ్ వేసిన గోరువెచ్చని నీటిలో కానీ నానబెట్టి, శుభ్రం చేయండి.

గడియలు/ హ్యాండిల్స్: తలుపు తీయడానికీ వేయడానికీ గడియలు, హ్యాండిల్స్‌నే పట్టుకుంటూ ఉంటాం. ఎవరెవరో, ఎక్కడెక్కడో తిరిగిన వాళ్లందరి చేతులు పడేదీ దానిమీదే! అంటే సూక్ష్మజీవులకు ఆవాసంగా మారుతున్నట్లేగా! అందుకే వీటినీ తరచూ శుభ్రం చేయాలి.

మొబైల్, రిమోట్లు: అస్సలు శుభ్రం చేయని జాబితా అంటే వీటిదే! జారిపోయి నేలమీద పడతాయి, తినేటప్పుడూ పట్టుకుంటాం దీంతో ఆహార అవశేషాలు, దుమ్ము ఇలా ఎన్ని చేరతాయో. ఇవన్నీ అనారోగ్యాలు, అలర్జీల కారకాలే. అందుకే డిస్‌ఇన్‌ఫెక్టాంట్‌లతో శుభ్రం చేస్తుండాలి. పైపైనే కాదట... బ్యాటరీలను తొలగించీ శుభ్రం చేయాలి అంటారు నిపుణులు.

ఫ్రిజ్ హ్యాండిల్, స్విచ్‌బోర్డులు: పెద్దగా పట్టించుకోనివే ఇవి కూడా. వంట సమయంలో, వెలుతురు అవసరమైనప్పుడు ఎక్కువగా వాడేది వీటినే! నిర్లక్ష్యం చేస్తే అనారోగ్యాలు కొని తెచ్చుకున్నట్టే. వీటినీ తరచూ శుభ్రం చేయాల్సిందే. తడిలేని ఆప్షన్లను ఎంచుకుంటే సరి.

## ఇరాన్ నుంచి దిగుమతుల సమాచారాన్ని కోరిన అమెరికా

ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకున్న ఆరోపణలపై, కంపెనీ నుంచి అమెరికా ఏజెన్సీ సమాచారాన్ని కోరినట్లు అదానీ గ్రూప్ సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ తెలిపింది. అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న సంస్థలతో లావాదేవీలపై దర్యాప్తులో భాగంగా, ఈనెల 4న




అమెరికా ఆర్థిక శాఖకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఈ సమాచారాన్ని కోరినట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. 2025 జూన్‌లో వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదికకు సంబంధించిన చర్చల తర్వాత ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అమెరికా ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు ఉన్న నౌకా మార్గాల్లో ఇరాన్ నుంచి ఎల్‌పీజీను అదానీ గ్రూప్ కంపెనీలు దిగుమతి చేసుకున్నాయని నివేదిక ఆరోపించింది.

## 9.40 లక్షల సబ్‌స్క్రైబర్లను కోల్పోయిన వొడాఫోన్ ఐడియా

గతేడాది డిసెంబర్‌లో ప్రైవేట్ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా భారీగా సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది.




ఇదే సమయంలో దిగ్గజ భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో ఎప్పటిలాగే కొత్త సబ్‌స్క్రైబర్లను సాధించాయి. మంగళవారం టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన డేటా ప్రకారం, సమీక్షించిన నెలలో ఎయిర్‌టెల్ కొత్తగా 54.3 లక్షల మంది కస్టమర్లను చేర్చుకోగా, జియో 29.6 లక్షల మందిని సంపాదించుకుంది. ఇక, వొడాఫోన్ ఐడియా 9.4 లక్షల మందిని, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ 2.1 లక్షల మంది వినియోగదారులను కోల్పోయాయి. దీంతో మొత్తం వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025, డిసెంబర్ చివరి నాటికి 125.87 కోట్లకు పెరిగింది.

# కాసులు కురిపిస్తోన్న స్టాక్ ఇదే లక్ష పెడితే రూ.5.16 లక్షలు



దేశీయ స్టాక్ మార్కెట్లో ప్రస్తుతం తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, దేశాల మధ్య యుద్ధాలతో పాటు విదేశీ మదుపరులు భారీగా అమ్మకాలకు దిగుతుండడంతో భారీగా పడుతూ లేస్తూ ట్రేడింగ్ చేస్తున్నాయి.ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఓ స్టాక్ అదరగొడుతోంది. తమ ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిపిస్తోంది. కేవలం 6 నెలల కాలంలోనే ఈ స్టాక్ 416 శాతం మేర పెరిగి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. అదే టేక్ సొల్యూషన్స్ లిమిటెడ్ స్టాక్. ఇది ఒక స్మాల్ క్యాప్ కేటగిరీ స్టాక్. రూ.50 ధర లోపే లభించే మల్టీబ్యాగర్ స్మాల్ క్యాప్ స్టాక్ అయిన టేక్ సొల్యూషన్స్ షేరు దూసుకెళ్తోంది. ఫిబ్రవరి 10వ తేదీన 4.51 శాతం మేర లాభపడి సరికొత్త ఆల్ టైమ్ హై స్థాయిని తాకింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.46.93 స్థాయిని ఇవాళే టచ్ చేయడం గమనార్హం. ఈ స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర రూ.6.51గా ఉంది. అంటే ఏడాదిలోపే దాదాపు 600 శాతం మేర పెరిగింది. దీంతో ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందాయని చెప్పవచ్చు. ఇంట్రాడేలో ఈరోజు స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ 50లూ 0.2 శాతం మేర పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ఇండియా–యూఎస్ ట్రేడ్ డీల్ ద్వారా సానుకూల ప్రభావంతో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. దీంతో ఈ కంపెనీ స్టాక్ మరింత పెరిగింది. ఈ స్మాల్ క్యాప్ స్టాక్ టేక్ సొల్యూషన్స్ లిమిటెడ్ 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.6.51ని 2025 ఏప్రిల్ నెలలోనే టచ్ చేసింది. ఆ తర్వాత వేగంగా కోలుకుని 591 శాతం మేర పెరిగింది. ఈ స్టాక్ తమ ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రిటర్న్స్ అందించింది. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 303 శాతం మేర లాభాలు ఇచ్చింది. ఇక గత ఆరు నెలల్లో చూసుకుంటే 416 శాతం మేర లాభపడింది. ఆరు నెలల క్రితం లక్ష రూపాయలు పెట్టి షేర్లు కొనుగోలు చేసి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.5.16 లక్షలకు పైగా అవుతాయి. అలాగే గత 3 నెలల కాలంలోనే పెట్టుబడిని దాదాపు డబుల్ చేసింది. 96 శాతం మేర లాభపడింది. ఇక గత నెల రోజుల్లో ఈ స్టాక్ 9 శాతం లాభాలు ఇచ్చింది. టేక్ సొల్యూషన్స్ ఇటీవలే ఫ్యూచర్ ప్లాన్స్ ప్రకటించింది. ఏఐ ఆధారిత స్మార్ట్ డయాగ్నోస్టిక్ అండ్ ప్రివెంటివ్ హెల్త్ కేర్ యూనిట్ వన్ మినట్ క్లినిక్ ఏర్పాటు చేస్తామని తెలిపింది. భారతీయ ప్రివెంటివ్ హెల్త్ కేర్ రంగంలో తమ వ్యాపార విస్తరణ చేపట్టే దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఈ ఏఐ స్మార్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సెబీ వద్ద దాఖలు చేసిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది.

# సోషల్ డియా ప్లాట్‌ఫామ్‌లకు కేంద్రం కీలక ఆదేశాలు




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో రూపొందిన కంటెంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏఐ కారణంగా ఎదురవుతున్న కొత్త సవాళ్లను అధిగమించేందుకు, ఏఐ కంటెంట్ నిబంధనలను కఠినతరం చేసింది.ఏఐ జనరేటెడ్ కంటెంట్‌పై సోషల్ డియా ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా లేబులింగ్ విధానం అమలు చేయడంతో పాటు టెక్నాలజీ దుర్వినియోగాన్ని పర్యవేక్షించాలని ప్లాట్‌ఫామ్‌లను కోరింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మంగళవారం సోషల్ డియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఏఐ ఉపయోగించి సృష్టించిన కంటెంట్‌ను గుర్తించి, లేబుల్ చేసి, నియంత్రించాలని ఆదేశిస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. డీప్‌ఫేక్‌లు, తప్పుదారి పట్టించే వీడియోలు, నకిలీ డాక్యుమెంట్లు, అసభ్య కంటెంట్ వంటి ఏఐ–జనరేటెడ్ కంటెంట్ దుర్వినియోగాన్ని ఆపే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంది.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ డియా ఎథిక్స్ కోడ్) సవరణ నియమాలు, 2026 కింద ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్త నియమాలు ఫిబ్రవరి 20 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఏఐ–జనరేటెడ్ కంటెంట్ అత్యంత సాధారణం, యూజర్లు నిజమైన కంటెంట్ గుర్తించడం కూడా కష్టతరం కావడంతో సోషల్ ప్లాట్‌ఫామ్‌లు ఎక్కువ బాధ్యత వహించాలని ప్రభుత్వం చెబుతోంది. చట్టవిరుద్ధమైన ఏఐ–జనరేటెడ్ కంటెంట్ క్రియేట్, షేర్ చేయకుండా కట్టడి చేసేందుకు ఆటోమేటెడ్ టూల్స్, టెక్నికల్ సిస్టమ్స్ అమలు చేయాలని ప్రభుత్వం సోషల్ డియా ప్లాట్‌ఫామ్‌లకు ఆదేశించింది.

# బిజినెస్

## హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ నుంచి మరో స్కీమ్

దేశంలోని దిగ్గజ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల్లో ఒకన హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ మరో కొత్త స్కీమ్ తీసుకొచ్చింది. చాలా తక్కువ పెట్టుబడితోనే మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం కల్పిస్తోంది.అదే హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్. భారత దేశ దీర్ఘకాల వినియోగ వృద్ధి నుంచి ప్రయోజనం పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు




అందించడమే లక్ష్యంగా ఈ న్యూ ఫండ్ ఆఫర్ డిజైన్ చేసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ తెలిపింది. మరి ఈ కొత్త స్కీమ్ గురించిన వివరాలు తెలుసుకుందాం. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 4, 2026 రోజునే ప్రారంభమైంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 13, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ స్కీమ్ బెంచ్ మార్కెట్ ఇండెక్స్ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ గా ఉంటాయి. దేశీయ వినియోగంపై ఆధారపడే కంపెనీలను అనుసరిస్తూ లాభాలు అందుకోవడమే ఈ స్కీమ్ ప్రధాన లక్ష్యం. ఈ ఇండెక్స్‌లో ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్, ఆటో కాపొనెంట్స్, కన్స్యూమర్ సర్వీసెస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్ కేర్, టెలికాం వంటి 30 కంపెనీల స్టాక్స్ ఉంటాయి. ఆయా కంపెనీలకు వచ్చే ఆదాయంలో 50 శాతానికిపైగా దేశీయంగానే సమకూరుతోంది. దీంతో దేశీయ వినియోగంపైనే ఆ కంపెనీల వృద్ధి అనేది ఆధారపడుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఫండ్ మేనేజర్లుగా నందితా మెనెజెస్, అరుణ్ అగర్వాల్ పేర్లను కంపెనీ వెల్లడించింది. న్యూ ఫండ్ ఆఫర్ సమయంలో ఇన్వెస్టర్లు కనీసం రూ. 100 ఉన్నా చేరవచ్చు. ఆ తర్వాత రిల్ మార్కెట్లోకి ఈ స్కీమ్ వచ్చిన తర్వాత సబ్‌స్క్రిప్షన్, రిడంప్షన్ కోసం సైతం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. అప్లికేషన్ స్టాంప్ డ్యూటీ సహా ఇతర ట్యాక్సులను కట్ చేసిన తర్వాత యూనిట్ల అలాట్మెంట్ ఉంటుందని కంపెనీ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ అనేది హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్. దేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్లలో ఒకటి. ఈ కంపెనీని 1999, డిసెంబర్ 10న ఏర్పాటు చేశారు. అయితే, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కోసం అసెట్ మేనేజ్మెంట్ కంపెనీగా వ్యవహరించేందుకు 2000, జూలై 3న సెబీ నుంచి అనుమతులు ఇచ్చారు. దేశంలోని ప్రముఖ ఏఎంసీల్లో హెచ్‌డీఎఫ్‌సీ ఒకటి.

## గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు




దేశీయ గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు పోగవుతున్నాయి. గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతుండటంతో గోల్డ్ ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు వరదలా వచ్చి చేరుతున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి గోల్డ్ ఈటీఎఫ్ విభాగంలో ఏకంగా రూ. 24,039.96 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది జనవరిలో వచ్చిన రూ. 11,647 కోట్ల కంటే రెట్టింపు కావడం విశేషం.అంతేకాకుండా ఇదే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన రూ. 24,028 కోట్ల కంటే కూడా కూడా ఎక్కువ గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి నిధులు రాడం విశేషం. ఇక, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు సంబంధించి జనవరి నెలలో నిధులు 14 శాతం తగ్గి రూ. 24,028 కోట్లు వచ్చాయి. ఇవి వరుసగా రెండో నెలా తగ్గుముఖం పట్టాయి. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న స్తబ్దత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో మదుపు చేసేందుకు జాగ్రత్త పడ్డారు. ఇదే సమయంలో బంగారం ధరలు పుంజుకోవడం వల్లనే గోల్డ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గు చూపారు. దీంతో మ్యూచువల్ ఫండ్ సంస్థల (ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ. 81.01 లక్షల కోట్లకు చేరింది.

## వాహనాల రిల్ అమ్మకాలకు జీఎస్టీ బూస్ట్

దేశీయ వాహన పరిశ్రమలో కంపెనీలు సరికొత్త రికార్డు అమ్మకాలను సాధించాయి. ఈ ఏడాది జనవరిలో దేశీయ ఆటో పరిశ్రమ రిల్ అమ్మకాలు దాదాపు 18 శాతం పెరిగి 27 లక్షల యూనిట్లకు చేరాయని డీలర్ల సంఘం ఫాడా మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది పండుగ సీజన్‌కు ముందు కేంద్రం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలకు దోహదపడ్డాయి. గత నెలలో పంటకోత, వివాహ వేడుకల సందర్భంగా గ్రాణ ప్రాంతాల్లో గిరాకీ సానుకూలంగా ఉండటం వంటి అంశాలు కూడా అమ్మకాలు పెరిగేందుకు ప్రధాన కారణాలు. ఫాడా డేటా ప్రకారం, జనవరిలో మొత్తం రిల్ అమ్మకాలు 27,22,558 యూనిట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో 23,14,940 యూనిట్లతో పోలిస్తే ఇది 17.61 శాతం పెరిగింది. ఇందులో ప్యాసింజర్ వాహనాల రిల్ అమ్మకాలు 7 శాతం పెరిగి 5,13,475 యూనిట్లుగా నమోదయ్యాయి. మెట్రో ప్రాంతాల్లో కంటే గ్రాణ ప్రాంతాల్లో అమ్మకాలు 14.43 శాతం పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో మాత్రం 2.75 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎస్‌యూవీ, కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఎంట్రీ–లెవల్ కార్లకు తిరిగి డిమాండ్ కనిపిస్తోందని ఫాడా అధ్యక్షుడు సీ ఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ద్విచక్ర వాహన విభాగంలో 18,52,870 యూనిట్లు, త్రీ–వీలర్ విభాగంలో 19 శాతం, కమర్షియల్ విభాగంలో 15 శాతం అమ్మకాలు పెరిగాయి. ట్రాక్టర్అమ్మకాలు అధికంగా 23 శాతం పెరిగాయని ఫాడా వెల్లడించింది.



# క్రీడలు

## భారత బ్యాటర్లపై బ్యాట్ ట్యాంపరింగ్ ఆరోపణలు



భారత క్రికెటర్ల పై శ్రీలంక జరుగుతున్న నేపథ్యంలోనే బ్యాట్ ట్యాంపరింగ్ కు

క్రికెటర్ భానుక రాజపక్స వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ భారత బ్యాటర్లు వాడే బ్యాట్లను ఉద్దేశించి హాట్ కామెంట్స్ చేశారు భానుక రాజపక్స. భారత క్రికెటర్లు పాల్పడుతున్నట్లు సంచలన ఆరోపణలు చేశారు. ఇతర జట్లు వాడే బ్యాట్ల కంటే భారత జట్టుకు సంబంధించిన క్రికెటర్లు వాడే బ్యాట్లు తేడాగా ఉంటాయని చెప్ప ప్రయత్నం చేశారు భానుక రాజపక్స. భారత ప్లేయర్లు వాడే బ్యాట్లు ఎక్కువ పవర్ జనరేట్ చేస్తాయని వెల్లడించారు భానుక రాజపక్స. అయితే ఇతర క్రికెటర్లు వాడే బ్యాట్లు పెద్దగా పనిచేయబోమని చెప్పే ప్రయత్నం చేశారు. తమకు దొరికే బెస్ట్ బ్యాట్స్ కంటే ఇండియా ప్లేయర్ల బ్యాట్లు చాలా మెరుగైనవి అంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు.

## నెక్టస్ మ్యాచ్‌కు అభిషేక్ శర్మ డౌటే...

అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన 2026 టి20 ప్రపంచ కప్‌లో భారత దేశం రెండవ మ్యాచ్‌కు ఫిబ్రవరి 12న న్యూఢిల్లీలో నబియాతో జరిగే



ఓపెనర్ అభిషేక్ శర్మ అందుబాటులో ఉంటాడా లేదా అనే దానిపై సందేహాలు తలెత్తాయి. గత రెండు రోజులుగా కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా బ్యాట్స్‌మన్ ఆసుపత్రిలో చేరినట్లు డియా నివేదిక వెల్లడించింది. అభిషేక్ కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. సమస్యను నిర్ధారించడానికి కొన్ని పరీక్షలు జరుగుతున్నాయి. ఈ రోజు అతను డిశ్చార్జ్ అవుతాడా లేదా అనేది ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ ప్రస్తుతానికి నబియాతో జరిగే మ్యాచ్ సందేహాస్పదంగా ఉంది'' అని వర్గాలు తెలిపాయి.గత ఆదివారం జూంతో జరిగిన భారత టోర్నమెంట్ ఓపెనర్‌కు ముందే అభిషేక్ అనారోగ్యంతో ఉన్నాడు, అతను మైదానంలోకి దిగిన తర్వాత అతని పరిస్థితి మరింత దిగజారింది. ఎడమచేతి వాటం బౌలర్ డకౌట్‌గా అవుట్ అయ్యాడు మరియు రెండవ ఇన్నింగ్స్‌కు తిరిగి రాలేదు, సంజు సామ్సన్ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఫీల్డర్‌గా వచ్చాడు. ఒక ప్రముఖ డియా ప్రకారం, వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్ సమయంలో అభిషేక్ అధిక జ్వరంతో బాధపడ్డాడు. తక్షణ ఉపశమనం కోసం డ్రిప్స్ఇచ్చారు.

## బీసీసీఐపై ఆర్పీ సింగ్ షాకింగ్ కామెంట్స్



సీనియర్ పేసర్ మహ్మద్ ష ప్రస్తుతం భారత జట్టుకు దూరంగా కొనసాగుతున్నాడు. చివరిసారిగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా తరఫున ప్రాతినిధ్యం వహించాడు. వరుస గాయాలు, ఫామ్‌లో తగ్గుదల కారణంగా బీసీసీఐ సెలెక్టర్లు అతడిని జట్టు నుంచి పక్కన పెట్టారు.ఫిట్‌నెస్ తిరిగి సాధించినప్పటికీ, సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్‌తో జరిగిన విభేదాల నేపథ్యంలో షకి అవకాశాలు దూరమయ్యాయి. తాజాగా దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటుతున్నప్పటికీ, బీసీసీఐ అతడికి భారీ షాక్ ఇచ్చింది. షని సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై మాజీ క్రికెటర్ ఆర్పీ సింగ్ తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. మహ్మద్ షని మళ్లీ భారత జట్టులోకి తీసుకురావాలనే ఆలోచన తనకు ఉందని ఆర్పీ సింగ్ వెల్లడించారు.అయితే అదే సమయంలో బీసీసీఐ అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్ నుంచి తొలగించడాన్ని ఆయన తప్పుబట్టారు. షని తిరిగి టీమిండియాలోకి తీసుకురావాలని నేను భావించాను. కానీ బీసీసీఐ అతడిని సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించడం ఆశ్చర్యానికి గురిచేసింది అంటూ ఆర్పీ సింగ్ చేసిన వ్యాఖ్యలు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలతో సెలెక్షన్ విధానం, సీనియర్ ఆటగాళ్లపై బీసీ సీఐ తీసుకుంటున్న నిర్ణయాలపై పలు ప్రశ్న లు తలెత్తుతున్నాయి.అయితే మహ్మద్ ష ఫా మ్‌పై ఎలాంటి సందేహం లేదని ఆర్పీ సింగ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రంజీ ట్రోఫీలో ష అద్భుతంగా రాణిస్తున్నాడని, దేశవాళీ క్రికెట్ లో తన అనుభవం, నైపుణ్యంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌లకు గట్టి సవాల్ విసురుతున్నాడని తెలిపారు. జాతీయ జట్టుకు అవసరమైన అనుభవం ష వద్ద పుష్కలంగా ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో భారత్ తరఫున అన్ని ఫార్మాట్లలో కీలక పాత్ర పోషించిన ష, ముఖ్యంగా విదేశీ పిచ్‌లపై తన స్వింగ్, సీమ్ బౌలింగ్‌తో అనేక విజయాల్లో భాగస్వామి అయ్యాడు. అలాంటి బౌలర్‌ను సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తొలగించడం సరైన నిర్ణయమా? అనే చర్చలు ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చాయి.

## శ్రీలంక జట్టుకు బిగ్ షాక్..కీలక ప్లేయర్ దూరం



టీ20 ప్రపంచ కప్ 2026 కొనసాగుతున్న నేపథ్యంలో శ్రీలంక జట్టుకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టుకు సంబంధించిన స్టార్ ఆటగాడు దూరమవుతున్నాడు. గాయం కారణంగా శ్రీలంక స్టార్ ప్లేయర్ వనిందు హసరంగ టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ నుంచి మొత్తానికి దూరమయ్యాడు. అతని ఎడమ కాలి కండరాలలో చీలిక ఏర్పడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు ఎమ్మారై స్కానింగ్ చేయగా ఈ విషయం బయటపడిందట. ఈ న్యూస్ తెలియడంతో వెంటనే టీ20 ప్రపంచ కప్ 2026 నుంచి వనిందు హసరంగను తప్పిస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డు షాకింగ్ నిర్ణయం తీసుకుంది. శ్రీలంక స్టార్ ఆటగాడు వనిందు హసరంగ గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో అతని స్థానంలో మరో ఆటగాడికి అవకాశం ఇచ్చారు. అసరంగా స్థానంలో లెగ్ స్పిన్ ఆల్ రౌండర్ దుషన్ హేమంతకు శ్రీలంక జట్టులకు చోటు కల్పించారు. శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి ఆదేశాలురాగానే హుటా హుటి న బయలుదేరాడు దుషన్ హేమంత. ఇది ఇలా ఉండగా టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7వ తేదీన ప్రారంభమైన సంగతి తెలిసిందే. మార్చి 8వ తేదీ వరకు కొనసాగానుంది. అయితే ఈ టోర్నమెంట్‌లో ఫిబ్రవరి 8వ తేదీన ఐర్లాండ్ తో శ్రీలంక తలపడింది. ఈ సందర్భంగా అద్భుతంగా రాణించి శ్రీలంక విజయం సాధించింది. కాగా టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ కు ఇండియాతో పాటు శ్రీలంక కూడా ఆతిథ్యం ఇస్తున్నాయి. పాకిస్తాన్ ఆడే ప్రతి మ్యాచ్ శ్రీలంకలో జరగనుంది. ఒకవేళ ఫైనల్ కు పాకిస్తాన్ వెళ్తే, కొలంబోలోనే ఫైనల్ ఉంటుంది. అలా కాకుండా, పాకిస్తాన్ ఫైనల్ కు రాకుంటే పరిస్థితి వేరేలాగా ఉంటుంది. పాక్ ఫైనల్ బరిలో లేకపోతే, ఇండియాలోనే ఫైనల్స్. ఈ మేరకు టీ20 ప్రపంచ కప్ 2026 షెడ్యూల్ ఖరారు అయింది.

## టీ20 వరల్డ్ కప్ వేళ భారత క్రికెటర్లకు బీసీసీఐ షాక్..




ప్లేయర్ల కుటుంబ సభ్యుల విషయంలో కఠిన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆటగాళ్లు కుటుంబ సభ్యులతో ఉండటంపై ఆంక్షలు విధించింది. 45 రోజుల పర్యటన అయితే గరిష్టంగా రెండు వారాలపాటే కుటుంబసభ్యులు ప్లేయర్లతో ఉండొచ్చని నిర్ణయం తీసుకుంది. కొందరు క్రికెటర్లు కుటుంబాలతో ఉండటం వల్ల జట్టు సమావేశాలకు హాజరు కాలేకపోవడంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై దిగ్గజ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతోపాటు ఇతర ప్లేయర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కూడా బీసీసీఐ అదే నిర్ణయానికి కట్టుబడి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్ కప్‌లో తమ కుటుంబ సభ్యులకు తమ వెంట ఉండటానికి అనుమతి ఇవ్వాలని భారత క్రికెటర్లు బోర్డుకు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. కానీ బీసీసీఐ వారి అభ్యర్థనను తిరస్కరించినట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. 'ఆటగాళ్లు తమ భార్యలు, ఫియాన్సీలతో ప్రయాణం చేయొచ్చా? .. వారితోనే ఉండొచ్చా? అని టీమ్ మేనేజ్‌మెంట్ బీసీసీఐని సంప్రదించింది. కుటుంబాలు ప్లేయర్లతో ఉండటానికి వీలు లేదని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి.

## భారత్‌తో మ్యాచ్ ఆడబోమన్న పాక్ రాత్రికి రాత్రే సీన్ రివర్స్

భారత్–పాక్ మ్యాచ్‌కి ముం దు రెచ్చగొట్టి మంటపెట్టిన మొహ్సిన్ నక్వీ.. ఆర్మీ చీఫ్ పేరు ను మధ్యలోకి లాగడంతో హీటెక్కిన వరల్డ్‌కప్! అయితే టీ20 వరల్డ్ కప్‌కి కొంత సమయం ముందు.. తాము భారత్‌లో ఆడబోమని బంగ్లాదేశ్ ప్రకటించింది. దీంతో ఐసీసీ బంగ్లాదేశ్‌ను తొలగించి, స్కాట్లాండ్‌ను వరల్డ్ కప్ కోసం ఎంపిక చేసింది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ కీలక ప్రకటన చేసింది. తాము టీ20 వరల్డ్ కప్ ఆడతాం కానీ.. భారత్‌తో మ్యాచ్‌ను బాయ్ కాట్ చేస్తామని ప్రకటించింది. క్రికెట్ అభిమానులను ఈ ప్రక టన నివ్వెరపరిచింది. టీ20 ప్రపంచ కప్ మొత్తం ద అత్యధిక ప్రేక్షకాదరణతోపాటు యాడ్ రెవెన్యూ వచ్చే మ్యాచ్ ఇది. దీంతో పాకిస్థాన్ తీరుపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం ఒప్పుకుంటే ఆడతామని పాక్ బోర్డు చెప్పింది. అయినా సరే పాక్ సర్కారు ఆడబోమంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించింది. అయితే మ్యాచ్ ఫిబ్రవరి 15న జరగాల్సి ఉండగా.. ఫిబ్రవరి 9న తన మనసు మార్చుకొని బాయ్‌కాట్ నిర్ణయం నుంచి యూటర్న్ తీసుకుంది. పాకిస్థాన్ రోజుల వ్యవధిలోనే తన మనసు మార్చు కొని, భారత్‌తో మ్యాచ్ ఆడాలని నిర్ణయించుకోవడానికి చాలా కారణాలే ఉన్నాయి. ఐసీసీ చీఫ్‌గా ఉన్న జై షా పాకిస్థాన్ క్రికెట్ బోర్డును అష్ట దిగ్బంధనం చేశాడని చెప్పొచ్చు. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఇచ్చే రెవెన్యూ వాటాను ఆపేస్తామని, దీర్ఘకాలంపాటు ఆంక్షలు విధిస్తామని ఐసీసీ హెచ్చరించింది. మరోవైపు బ్రాడ్‌కాస్టర్ సైతం రంగంలోకి దిగి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పీసీబీకి వార్నింగ్ ఇచ్చింది. అదే జరిగితే నష్ట పరిహారంగా పీసీబీ భారీ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఓవైపు ఐసీసీ నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయి, మరోవైపు బ్రాడ్‌కాస్టర్‌తో న్యాయపోరాటం చేయాల్సి వస్తే.. పీసీబీ ఆర్థిక కష్టాలు మామూలుగా ఉండవు. అదే సమయంలో శ్రీలంక క్రికెట్ బోర్డు, యూఏఈ బోర్డులు కూడా పీసీబీకి లేఖ రాశాయి. శ్రీలంక బోర్డు అయితే సెంటిమెంట్‌తో పాకిస్థాన్‌ను కొట్టింది. ఉగ్రవాద కాల్పుల కారణంగా దేశంలో క్రికెట్ ఆడటానికి ఏ దేశమూ ముందుకు రాకపోతే.. మేం వచ్చి ఆడాం. ఇప్పుడు మా దేశంలో జరగబోయే మ్యాచ్‌ను బహిష్కరిస్తారా? దాని వల్ల మాకు చాలా నష్టం జరుగుతుంది. ఇదేనా స్నేహ ధర్మం అన్నట్టుగా పీసీబీకి లేఖ రాసింది. ఇక భారత్‌లో టీ20 వరల్డ్ కప్ ఆడబోమంటూ టోర్నీ నుంచి బయటకు వెళ్లిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు కూడా.. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పీసీబీకి రిక్వెస్ట్ చేసింది. క్రికెట్ మంచి కోసం ఆడండి అని పైకి చెప్పినప్పటికీ.. అసలు కారణాలు మాత్రం వేరే. ఇప్పుడు పాకిస్థాన్ కనుక భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే.. పాకిస్థాన్‌తోపాటు టోర్నీ నుంచి అర్ధంతరంగా వైదొలిగిన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుపైనా ఐసీసీ కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అదే జరిగితే రెండు బోర్డులూ తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటాయి.



# వుదయం సినిమా

## సన్ ఆఫ్ ట్రైలర్ లాంచ్



సాయి సింహాద్రి సైన్మా బ్యానర్ మీద సాయి సింహాద్రిని హీరోగా, నిర్మాతగా చేసిన చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీష్ దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ మూవీని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ట్రైలర్, పాటలను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ సందర్బంగా నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ప్రముఖ రైటర్, నిర్మాత కోన వెంకట్, సముద్ర, వి.ఎన్ ఆదిత్య, రామ సత్య నారాయణ రాజు, రఘు కుంచె తదితరులు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ప్రముక రైటర్, నిర్మాత కోన వెంకట్ మాట్లాడుతూ .. 'సినిమాలోని నటీనటులు, టెక్నికల్ టీంను బట్టి ఆ మూవీ మీద ఓ ఇంప్రెషన్ ఏర్పడుతుంది. ఈ మూవీకి కాస్ట్ అండ్ క్రూ బాగా సెట్ అయింది. సాయి ఈ మూవీ కోసం హీరో అయి నిర్మాత అయ్యాడా?.. నిర్మాత అయ్యాక హీరోగా మారాడా? తెలీదు. కానీ ఈ సినిమాలో మాత్రం మంచి కంటెంట్ ఉంది. ప్రతీ శుక్రవారం పదుల సంఖ్యలో చిత్రాలు వస్తున్నాయి. ఇలాంటి కంటెంట్ ఉన్న చిత్రాలు హిట్ అయితే ఇంకా చాలా మంది కొత్త వాళ్లు తెలుగు చిత్ర పరిశ్రమలోకి వస్తారు. 'సన్ ఆఫ్' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## హే భగవాన్ ఆకట్టుకుంటుంది



ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి, ఈషా వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే భగవాన్' అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రంలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో దర్శకుడు గోపీ అచ్చర మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు.

### చిత్ర దర్శకుడు గోపీ అచ్చర

**మీ నేపథ్యం ఏంటి?**
**సినీ పరిశ్రమలోకి ఎలా వచ్చారు?**
కన్నడలో ఎస్. నారాయణ అనే దర్శకుడి వద్ద పని చేశాను. సుహాస్ నాకు స్కూల్‌లో జూనియర్. 'కలర్ ఫోటో' నుంచి సుహాస్‌తో జర్నీ చేస్తూనే ఉన్నాను. 'రైటర్ పద్మభూషణ్'కి కూడా నేను పని చేశాను.

**సుహాస్ కోసమే ఈ కథను రాసుకున్నారా?**
ఈ కథను సుహాస్‌ని దృష్టిలో పెట్టుకునే రాశాను. స్క్రిప్ట్‌లో సుహాస్ ఇన్వాల్వ్మెంట్ ఏమీ లేదు. కానీ సెట్స్ మీద మాత్రం తన ఆలోచనల్ని, అభిప్రాయాల్ని పంచుకుంటూ ఉండేవాడు.

**ఈ కథలోకి శివానీ నగరం ఎలా వచ్చారు?**
'అంబాజీపేట'తో సుహాస్, శివానీ హిట్ పెయిర్‌గా నిలిచారు. ఆల్రెడీ ఆ జంట జనాల్లో ఓ ముద్రను వేసింది. అందుకే తెలిసిన జంటతోనే వెళ్దామని, శివానీని ఈ చిత్రంలో తీసుకున్నాను.

**'హే భగవాన్'కి స్ఫూర్తి ఏంటి?**
సుహాస్ బలమే కామెడీ. అందుకే ఈ చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్‌గా రాసుకున్నాను. కామెడీతో పాటుగా ఇందులో మంచి ఎమోషన్స్ ఉంటాయి. ఫాదర్ అండ్ సన్ ఎమోషన్‌ని చాలా కొత్తగా చూపించాం. అందరినీ ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది.

## సీతా పయనం 14న ప్రీ రిలీజ్



యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా దర్శకత్వంలో నిరంజన్, ఐశ్వర్య అర్జున్ జంటగా తెరకెక్కించిన చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ మీద అర్జున్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ మూవీతో ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో యాక్షన్ ప్రిన్స్ ధృవ సర్జా ప్రధాన పాత్రను పోషించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 14న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాస్య బ్రహ్మ, పద్మశ్రీ డా. బ్రహ్మానందం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రియల్ హీరోలైన పర్యావరణ వేత్త, సామాజిక వేత్త డా. ప్రకాష్ ఆమ్టే, డా. మందాకిని ఆమ్టే, ట్యాంక్ బండ్ శివ, పర్యావరణ వేత్త దుశ్చర్ల సత్యనారాయణ తదితరులని 'సీతా పయనం' టీం సత్కరించి లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు.

## ఆడియెన్స్ కు నచ్చేలా కపుల్ ఫ్రెండ్లీ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న సినిమా "కపుల్ ఫ్రెండ్లీ". ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్ గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ గా నిర్మిస్తోంది. అజయ్ కుమార్ రాజు.పి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీ గా తెరకెక్కిన "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేస్తున్నారు. మూవీ హైలైట్స్ తెలిపారు ధీరజ్ మొగిలినేని. పదిహేను రోజుల క్రితం "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా చూశాను. మూవీ బాగా నచ్చింది. ప్రమోద్ అన్నకు వంశీ అన్నకు కాల్ చేసి ఈ సినిమా నేను డిస్ట్రిబ్యూట్ చేయాలని అనుకుంటున్నా అని అడిగాను. వారు ఓకే చెప్పడంతో ఈ ప్రాజెక్ట్ టేకప్ చేశాను. ఇది చెన్నై బ్యాక్ డ్రాప్ లో సాగే మంచి లవ్ స్టోరీ మూవీ. టైటిల్ చూసి ఇదోదే ఓన్లీ యూత్ చూడాల్సిన సినిమా అనుకుంటున్నారు. అది నిజం కాదు. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. శివ, మిత్ర అనే రెండు క్యారెక్టర్స్ జర్నీ చూస్తారు. "కపుల్ ఫ్రెండ్లీ" మూవీలో లివ్ ఇన్ రిలేషన్ షిప్ గురించి కేవలం 15 నిమిషాలు మాత్రమే సీన్స్ ఉంటాయి. మిగతా అంతా మిత్ర, శివ అనే జంట ఒకరికొకరు పరిచయం అయ్యాక వారి జీవితాలు ఎలా మారాయి. వీళ్లు ఒకరి కొకరు ఎలా సపోర్ట్ చేసుకున్నారు అనేదే చూపిస్తున్నాం. హీరో నెల్లూరు నుంచి వచ్చి చెన్నైలో ఇంటీరియర్ డిజైనర్ గా సెటిల్ అవ్వాలని ప్రయత్నిస్తుంటాడు. హీరోయిన్ చిత్తూరు నుంచి చెన్నై జాబ్ కోసం వస్తుంది. వీళ్లు కలిశాక ఏమైంది అనేది కథ



## నిలవే ప్రీ రిలీజ్ వేడుక

సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం నిలవే. శ్రేయాసి సేన్ నాయికగా పరిచయం అవుతుంది. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. పీఓవి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం కానుకగా ఫిబ్రవరి 13న విడుదలకాబోతుంది. ఈ సందర్బంగా బుధవారంనాడు మాదాపూర్ లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రదర్శించారు.

సింగర్ సునీత మాట్లాడుతూ, ఈ మధ్య చాలా తక్కువ సినిమాల్లో చక్కటి భావోద్వేగాలు చూస్తుంటాం. అలా అన్నీ ఎమోషన్స్ చూపించేలా వున్న చిత్రమే 'నిలవే'.

హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ, సినిమా ఇండస్ట్రీ. లో అతి పెద్దదైన తెలుగు ఇండస్ట్రీలో నాయికగా నటించినందుకు ఆనందంగా వుంది.

హీరో సౌమిత్ పోలాడి మాట్లాడుతూ, నేను సినిమాలో వెళుతున్నానని చెప్పినప్పటినుంచీ మా నాన్నగారు ఎంతో సపోర్ట్ చేశారు. నన్ను హీరో, దర్శకుడిగా మార్చింది సాయి కే వెన్నం. ఫిబ్రవరి 13న నా తొలి సినిమా విడుదల కాబోతుంది. అందరూ చాలా బాగుందని అభినందించారు. రేపు ప్రేక్షకులు కూడా ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను.

చిత్ర దర్శకుడు సాయి కే వెన్నం మాట్లాడుతూ, 30 లక్షల్లో మంచి సినిమా తీయవచ్చు. కానీ జనాల్లోకి తేవాలంటే కోట్లు ఖర్చుపెట్టాలని ఆమధ్య ఓ దర్శకుడు అన్నారు. మా సినిమా కంటెంట్ సినిమా. ప్రేక్షకులకు మంచి బిలీవ్ నేను ఇవ్వగలిగాను. నాని గారు కోర్ట్ సినిమా తీశాక చూడండి నచ్చకపోతే నా తదుపరి సినిమా చూడకండి అంటూ బెట్ కూడా వేశారు. కానీ మా దగ్గర అలాంటి బెట్ లు లేవు.



## గోదారి గట్టుపైన 14న రిలీజ్



మేమ్ ఫేమస్ తో స్ట్రాంగ్ డెబ్యు చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్ 'గోదారి గట్టుపైన' సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ కు ఫస్ట్ వెంచర్. యం ఆర్ ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

మేకర్స్ ఇప్పుడు మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా నుంచి హార్ట్ బ్రేక్ యాంథమ్ ఓ మై గాడ్ ఫిబ్రవరి 14న రిలీజ్ చేయబోతున్నారు. వాలెంటైన్ డే సెలబ్రేషన్ కి ఇది పర్ఫెక్ట్ ట్రీట్ గా ఉండబోతుంది.

ఈ చిత్రానికి సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ, నాగ వంశీ కృష్ణ సంగీతం, ప్రొడక్షన్ డిజైనర్‌గా ప్రవాళ్య, ఎడిటర్‌గా అనిల్ కుమార్ పి పని చేస్తున్నారు.

యూత్‌ఫుల్ ఎనర్జీ, రూటెడ్ విజువల్స్, గోదారి గట్టుపైన స్నేహం, ప్రేమని సెలబ్రేట్ చేసుకునే ఫీల్ గుడ్ రూరల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులని అలరించనుంది.

## ఎ బ్యూటిఫుల్ బ్రేకప్ 13న విడుదల

తక్ష్, మటిల్డా హీరో–హీరోయిన్లుగా నటించిన ఇంగ్లీష్ ఫీచర్ ఫిల్మ్ "ఎ బ్యూటిఫుల్ బ్రేకప్" ఒక ట్రెండ్ సెట్టింగ్ రొమాంటిక్ హారర్ థ్రిల్లర్. ఈ చిత్రాన్ని ప్రతిభావంతుడైన దర్శకుడు అజిత్ వాసన్ ఉగ్గిన రచన, దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని 5 నేచర్స్ మూవీస్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించగా, ముద్రగడ రంగారావు, ఉగ్గిన సత్యనారాయణరావు సమర్పిస్తున్నారు. పూర్తిగా ఇంగ్లీష్‌లో, గ్లోబల్ ఆడియెన్స్‌ను లక్ష్యంగా రూపొందించిన "ఎ బ్యూటిఫుల్ బ్రేకప్" ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దీనికి ముందుగా 12న దుబాయ్‌లో ఎక్స్‌క్లూజివ్ ప్రీమియర్ నిర్వహించనున్నారు. ఇంగ్లీష్ విడుదల అనంతరం ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో డబ్ చేసి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.




## స్వయంభు టీజర్ లాంచ్



నిఖిల్ సిద్ధార్థ ఎపిక్ పీరియడ్ యాక్షన్ సాగా 'స్వయంభు'తో తన కెరీర్‌లో బిగ్గెస్ట్ చాప్టర్ లోకి అడుగుపెడుతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించిన భారీ పాన్‌వరల్డ్ విజువల్ వండర్ ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. లార్జర్ దెన్ లైఫ్, హైవోల్టేజ్ డ్రామాలో నిఖిల్ ఇంతకు ముందు ఎప్పుడూ చూడని వారియర్ అవతార్ లో కనిపించబోతున్నారు. మేకర్స్ పవర్ ఫుల్ టీజర్‌తో ప్రమోషన్లను ప్రారంభించారు. టీజర్ 'సెంగోల్' కథతో ప్రారంభమవుతుంది. శ్రీరాముడికి పరమేశ్వరుడు అందించిన 'సెంగోల్'ను స్వాధీనం చేసుకునేందుకు జరిగే భీకర యుద్ధాలు కథకు బలమైన నేపథ్యాన్ని అందించాయి. రాజ్యాలు కూలిపోయినా సెంగోల్ మాత్రం అజేయంగా నిలుస్తుంది. ఇలాంటి కీలక సమయంలో ధర్మాన్ని తిరిగి స్థాపించడానికి ముందుకొచ్చే ఓ యోధుడి కథ చూపించడం అద్భుతంగా వుంది. దర్శకుడు భారత్ కృష్ణమాచారి, సెంగోల్ చరిత్రను ఆధారంగా తీసుకుని భారతీయ చరిత్రపౌరాణిక అంశాలను కలిపి 985 AD కాలాన్ని నేపథ్యంగా ఎంచుకోవడం అద్భుతంగా వుంది. ప్రతి ఫ్రేమ్‌లో ఆయన చూపించిన డీటైలింగ్, భారీ వరల్డ్‌బిల్డింగ్ ప్రత్యేకంగా కనిపిస్తుంది.

నిఖిల్ సిద్ధార్థ ఫెరోషియస్ వారియర్ గా అదరగొట్టారు. యుద్ధ వీరుడిగా అద్భుతం అనిపించారు. టీజర్‌లో ఆయన చేసిన వార్ యాక్షన్ సన్నివేశాలు, స్టంట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. సంయుక్త, నభా నటేష్ బలమైన మహిళా పాత్రల్లో కనిపించనున్నారు. సుబ్బరాజు, సునీల్ కీలక పాత్రల్లో కనిపించారు. టెక్నికల్‌గా ఈ చిత్రం టాప్ క్లాస్ లో వుంది. ఆర్ట్ డైరెక్టర్లు ఎం. ప్రభాహరణ్, రవీంద్ర రాజ్యాలని అద్భుతంగా సృష్టించగా, కె.కె. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ విజువల్స్‌కు గ్రాండియర్ తీసుకొచ్చింది. రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్‌ని మరింత ఎలివేట్ చేయగా, VFX హాలీవుడ్ స్థాయిలో వున్నాయి. విజయ్ కామిశెట్టి డైలాగ్స్, కింగ్ సాలమన్‌స్టంట్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్ అన్ని కలసి సినిమాను ఇంటర్నేషనల్ యాక్షన్ బెంచ్‌మార్క్‌గా నిలబెట్టేలా ఉన్నాయి.

## మృత్యుంజయ్ టీజర్ రిలీజ్




'మృత్యుంజయ్' చాలా కొత్తగా ఉంటుంది.. మంచి కంటెంట్‌ని తెలుగు ప్రేక్షకులకి అందించాలనే ఉద్దేశంతో ఈ సినిమాని తీశాం.. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు లేటెస్ట్ మూవీ 'మృత్యుంజయ్'. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కింది. రమ్య గున్నం సమర్పణలో లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. బ్లాక్ బస్టర్ మూవీ 'సామజవరగమన' మూవీ తర్వాత శ్రీవిష్ణు, రేబా మోనికా జాన్ జంటగా నటించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు ఈ చిత్ర టీజర్‌ను సోషల్ మీడియా వేదికగా దర్శకధీరుడు రాజమౌళి రిలీజ్ చేశారు.

## నా జీవితంలో తొలిసారి కెమెరా ముందు నిలిచిన రోజు: చిరంజీవి



తన అద్భుత నటన, మెస్మరైజింగ్ డ్యాన్స్‌లు, పవర్‌ఫుల్ యాక్షన్‌తో కోట్లాది అభిమానులు, ప్రేక్షకుల మనసు గెలుచుకున్న మెగాస్టార్ చిరంజీవి తన సినీ ప్రయాణంలోని అమూల్యమైన జ్ఞాపకాన్ని పంచుకున్నారు. దశాబ్దాలుగా అగ్ర కథానాయకుడిగా అలరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన తొలి సినిమా 'పునాదిరాళ్లు'. ఈ సినిమా కోసం మొదటిసారి కెమెరా ముందుకు వచ్చిన ప్రత్యేక సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో ఒక స్పెషల్ పోస్ట్‌ను షేర్ చేశారు మెగాస్టార్. ఈరోజు "పునాదిరాళ్లు" సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలి రోజు. ఆ రోజు నాలో కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి. ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాదిరాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.